
VOICE OF TELUGU PEOPLE
FOR THE STATE # OF THE STATE # BY THE STATE
VOL 18
ISSUE 12
JULY 2025

# నమస్తే ఆంధ్ర.కామ్

NAMASTEANDHRA.COM



# 4 రోజులు 40,000 కోట్లు







## చంద్రబాబు, లోకేశ్ సింగపూర్ పర్యటన విజయవంతం

16, 17లో..

## కేటీఆర్ మెడకు ఈ-కార్ ఉచ్చు!

కేబినెట్ ఆమోదం లేకుండానే చెల్లింపులకు ఆదేశాలు



12 లో..

## వేళ్లన్నీ తాడేపల్లివైపే!

మద్యం సొమ్ముల డెన్ బిగ్‌బాస్ ప్యాలెస్‌లోనే... ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టుతో జగన్ బ్యాచ్‌లో కలవరం



20 లో..

నమస్తే ఆంధ్ర.కామ్
VOICE OF TELUGU PEOPLE
NAMASTEANDHRA.COM
FOR THE STATE # OF THE STATE # BY THE STATE
JUL 2025

# అమరావతి విమానాశ్రయానికి లైన్ క్లియర్!!



నవ్యాంధ్ర రాజధానిలో అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణానికి కేంద్రం సూత్రప్రాయంగా అంగీకరించినట్లు తెలుస్తోంది. రెండో దశ భూసమీకరణ జరిగే ప్రాంతంలో దీనిని ఏర్పాటు చేసే అంశాన్ని పౌరవిమానయాన శాఖ చురుగ్గా పరిశీలిస్తోంది. అమరావతికి దక్షిణ దిక్కున పెదపరిమి గ్రామ పరిసర ప్రాంతాల్లో ఎయిర్ విమానాశ్రయం ఏర్పాటయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం. కొండలు, నీటి ప్రవాహాలు లేని ప్రాంతంగా ఉండడం వల్ల ఈ ప్రాంతంపై దృష్టి సారించినట్లు చెబుతున్నారు. ఇంకా అధికారికంగా ధ్రువీకరించకున్నా.. కేంద్రం, రాష్ట్రప్రభుత్వ పరిశీలనలో మాత్రం ఉంది. రాజధాని ప్రాంత ప్రాధికార సంస్థ (సీఆర్డీఏ) అమరావతి జోనల్ డెవలప్‌మెంట్ ప్లాన్ ప్రకారం చూసినా.. విమానాశ్రయం వంటి వాటికి పెదపరిమి చుట్టు పక్కల ప్రాంతం అనువుగా ఉంటుంది. అమరావతిలో అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటు అదిగో అక్కడ.. కాదు ఇక్కడ అంటూ సోషల్ మీడియాలో వస్తున్న ఊహాగానాలను సీఆర్డీఏ కొట్టివేస్తోంది. ఎన్టీఆర్ జిల్లా పశ్చిమ ప్రాంతం.. అంటే కంచికచర్ల, నందిగామ మధ్య గానీ.. జగ్గయ్యపేట–చిల్లకల్లు నడుమ గానీ రానుందన్న వార్తల్లోనూ నిజం లేదని స్పష్టంచేసింది. విమానాశ్రయం ఎక్కడ ఏర్పాటు చేయాలో ఇప్పటి వరకు అధికారికంగా నిర్ణయం తీసుకోలేదని సీఆర్డీఏ ఉన్నతా?ధికార వర్గాలు చెబుతున్నాయి.

**పసలేని రిపోర్టు..**

రాష్ట్రప్రభుత్వం, సీఆర్డీఏ పరిశీలన మేరకు రాజధాని దక్షిణం వైపు విమానాశ్రయం ఏర్పాటు సముచితంగా ఉంటుందన్న కీలక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. దక్షిణ దిక్కున అంటే ఉండవల్లి ఉంది. ఉండవల్లి ప్రాంతంలో కొండలు ఉన్నాయి కాబట్టి ఈ ప్రాంతంలో విమానాశ్రయం ఏర్పాటుకు అవకాశం తక్కువ. అమరావతిలో ఏది తలపెట్టాలన్నా జోనల్ డెవలప్‌మెంట్ ప్లాన్స్‌కు తగినట్లుగా ఉంటుంది. అమరావతి జోనల్ డెవలప్‌మెంట్ ప్లాన్‌ను పరిశీలిస్తే ఉండవల్లి నుంచి 30 కిలోమీటర్ల దూరంలో పెదపరిమి చుట్టుపక్కల ప్రాంతంలో అనువుగా కనిపిస్తోంది. నిర్దిష్టంగా ఎక్కడ అనుకూలంగా ఉంటుందన్నది కన్సల్టెన్సీ సంస్థ ఇచ్చే సాంకేతిక నివేదికను బట్టి నిర్ధారణకు వచ్చే అవకాశం ఉంటుంది. అమరావతి విమానాశ్రయానికి సంబంధించి ఏపీ విమానాశ్రయాల అభివృద్ధి సంస్థ (ఏపీఏడీసీఎల్) టెక్నికల్ ఫీజిబిలిటీ నివేదిక కోసం గతంలోనే ఆసక్తి వ్యక్తీకరణ (ఆర్ఎఫ్‌పీ) పిలిచింది. కానీ ఆ కన్సల్టెన్సీ సంస్థ ఇచ్చిన టెక్నికల్ రిపోర్టును సీఆర్డీఏ అధ్యయనం చేసింది. అది ఇచ్చిన సాంకేతికాంశాలు సజావుగా లేవని సీఆర్డీఏ నిర్ణయానికి వచ్చింది. ఏపీఏడీసీఎల్ కూడా ఇదే అభిప్రాయపడినట్లు సమాచారం. దీంతో ఈ రంగంలో నైపుణ్యం క లిగిన సంస్థలకు సాంకేతిక నివేదిక రూపకల్పన బాధ్యతలను అప్పగించారు. అంతర్జాతీయ విమానాశ్రయం ఎక్కడ ఏర్పాటు చేయాలన్నదానిపై ఈ సాంకేతిక నివేదిక కీలకపాత్ర పోషిస్తుంది. ఈ రిపోర్టు వస్తే మరింత స్పష్టత వస్తుంది. ఈ పరిణామాలన్నింటినీ బట్టి చూస్తే అంతర్జాతీయ విమానాశ్రయం అమరావతి–గుంటూరు మధ్య కేంద్రీకృతం కానున్నట్లు తెలుస్తోంది. ఇంకోవైపు.. ఎయిర్‌పోర్టు నిర్మాణానికి జీఎంఆర్, అదానీ వంటి ప్రముఖ సంస్థలు ఆసక్తి కనబరుస్తున్నట్లు సమాచారం. వాటి అధికార బృందాలు కూడా ఎక్కడ ఏర్పాటుచేస్తే అనువుగా ఉంటుందో పరిశీలనలు జరుపుతున్నట్లు తెలుస్తోంది.

రెండో దశ భూ సమీకరణ జరిగే ప్రాంతంలోనే నిర్మాణం!
గుంటూరు-రాజధాని మధ్య కేంద్రీకృతం
పెదపరిమి పరిసరాల్లో ఏర్పాటయ్యే అవకాశం
ఉండవల్లికి 30 కిలోమీటర్ల దూరం
ఇప్పటికే వచ్చిన సాంకేతిక నివేదికపై
సీఆర్డీఏ అభ్యంతరాలు
పౌరవిమానయాన నిపుణులకు
టెక్నికల్ ఫీజిబిలిటీ బాధ్యతలు

**రాజధానిలో ప్రపంచ బ్యాంకు బృందం..**

క్రమంగా పుంజుకుంటున్న రాజధాని పనుల పరిశీలనకు ప్రపంచబ్యాంకు బృందం వారం పదిరోజులకోసారి క్రమం తప్పకుండా వస్తోంది. వైసీపీ విషప్రచారాన్ని తిప్పికొట్టడానికి వీలుగా సీఎం చంద్రబాబు కేంద్ర ఆర్థిక శాఖ, ప్రపంచబ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ) ఉన్నతాధికారులతో మాట్లాడి ఎప్పటికప్పుడు పనుల పర్యవేక్షణకు బృందాలను పంపాలని కోరారు. దీంతో ప్రపంచ బ్యాంకు జాయింట్ ఇంప్లిమెంటేషన్ సపోర్ట్ మిషన్ టీమ్ తరచూ వస్తోంది. రాజధానికి ప్రపంచబ్యాంకు, ఏడీబీ రుణం సమకూరుస్తున్న సంగతి తెలిసిందే. ఇటీవలే ప్రపంచబ్యాంకు సీఆర్డీఏకు రూ.5 వేల కోట్లు విడుదల చేసింది. అమరావతి పనుల పునఃప్రారంభానికి ప్రధాని మోదీ శ్రీకారం చుట్టిన తర్వాత.. క్షేత్ర స్థాయిలో పనులు జోరందుకున్నాయి. వీటిలో సింహభాగం ప్రపంచ బ్యాంకు నిధులతో చేపడుతున్నవే. దాని బృందం క్షేత్ర స్థాయిలో ప్రాజెక్టుల పనులను పర్యవేక్షిస్తోంది. హెచ్‌వోడీ టవర్స్, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ టవర్స్, అఖిలభారత సర్వీసు (ఏఐఎస్) అధికారుల టవర్స్, మంత్రుల బంగళాలతో పాటు రోడ్ల నిర్మాణ పనులను కూడా పరిశీలిస్తోంది. అవి జరుగుతున్న తీరు ఆధారంగా మలివిడత నిధులను విడుదల చేస్తారన్న మాట.

**బీవోటీ విధానంలో ఇన్నర్ రింగ్ రోడ్డు..**

3 నెలల్లో అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు (ఐఆర్ఆర్)ను కూడా పట్టాలెక్కించేందుకు సీఆర్డీఏ అధికారులు రంగం సిద్ధం చేశారు. ఇన్నర్ రింగ్ రోడ్డును పూర్తిగా బీవోటీ విధానంలో నిర్మించాలని నిర్ణయించారు. రాజధాని చుట్టూ వలయాకారంగా 75 మీటర్ల వెడల్పున 96.25 కిలోమీటర్లు పొడవున నిర్మించే ఇన్నర్ రింగ్ రోడ్డుకు గుంటూరు, పల్నాడు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో 3,556.17 ఎకరాలు అవసరం. అమరావతి రెండో దశ భూ సమీకరణ వల్ల గుంటూరు, పల్నాడు జిల్లాల పరిధిలో 2,400.76 ఎకరాల భూములను సేకరించాల్సిన అవసరం లేకుండా పోతోంది. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో 1,155.41 ఎకరాలు తీసుకోవాలసి ఉంటుంది. ఈ భూములను కూడా భూ సమీకరణ విధానంలో తీసుకోవాలనుకుంటున్నట్టు సీఆర్డీఏ వర్గాలు చెబుతున్నాయి. ఎన్టీఆర్ జిల్లాలో ఇబ్రహీంపట్నం, జి.కొండూరు, విజయవాడ రూరల్ మండలాలు, కృష్ణా జిల్లాలో గన్నవరం, పెనమలూరు మండలాల పరిధిలో భూములను సేకరించటానికి వీలుగా త్వరలో ఆయా గ్రామపంచాయితీల పరిధిలో గ్రామసభలు నిర్వహించాలని సీఆర్డీఏ భావిస్తుంది. మూడు నెలల్లో ఈ ప్రక్రియను పూర్తిచేసి టెండర్లు పిలవాలని భావిస్తోంది.





# నవ్యాంధ్రకు పెట్టుబడుల వెల్లువ

**ఉపాధి కల్పన పరిశ్రమల స్థాపనకే చంద్రబాబు మొగ్గు**

**వేల కోట్ల పెట్టుబడులతో కంపెనీల ఏర్పాటుకు ఎస్ఐపీబీ భేటీల్లో ఆమోదం**

**ఆ వెంటనే మంత్రివర్గం ముందుకు**

**9.5 లక్షల కోట్లకు చేరిన ఇన్వెస్ట్‌మెంట్లు**

సమర్థుడు పాలకుడైతే ఎలా ఉంటుందో నవ్యాంధ్రప్రదేశ్ నిరూపిస్తోంది. పెట్టుబడులు వెల్లువెత్తుతున్నాయి. జగన్ ఐదేళ్ల ఏలుబడిలో ఒక్క పరిశ్రమ కూడా రాలేదు. పైగా వాటాలు ఇచ్చుకోలేక చాలా కంపెనీలు ఇతర రాష్ట్రాలకు పరారయ్యాయి. ఉన్న ఉద్యోగాలు ఊడాయి. కొత్త ఉపాధి అవకాశాలు మృగ్యమై యువత అల్లాడిపోయింది. ఇతర ప్రాంతాలకు వలసపోయారు. అందుకే చంద్రబాబు నిరుడు సార్వత్రిక ఎన్నికల సందర్భంగా వచ్చే ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. మళ్లీ సీఎం కాగానే ఇచ్చిన మాట నిలబెట్టుకోవడానికి పెద్దఎత్తున ప్రయత్నాలు ప్రారంభించారు. తక్షణమే ఉపాధి కల్పించే పరిశ్రమలకు పెద్దపీట వేస్తున్నారు. తన పాలనానుభవాన్నంతా రంగరించి.. దేశవిదేశాల నుంచి ఇన్వెస్టర్లను ఆహ్వానిస్తున్నారు. ఆయనపై నమ్మకం.. రాష్ట్రంలో అపార అవకాశాలను దృష్టిలో ఉంచుకుని చాలా మంది తరలివస్తున్నారు. ఒక్క ఏడాది కాలంలోనే రాష్ట్రానికి రూ.9.5 లక్షల కోట్లకుపైబడిన పెట్టుబడుల ప్రతిపాదనలు వచ్చాయి. వీటన్నిటినీ రాష్ట్రప్రభుత్వం ఆమోదించింది. పలు సంస్థలు తమ కార్యకలాపాలను క్రమంగా మొదలుపెడుతున్నాయి. ఉద్యోగ కల్పనే ప్రధానంగా రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) ఇన్వెస్ట్‌మెంట్లకు ఆమోదముద్ర వేస్తోంది. కేవలం నెల వ్యవధిలో దరిదాపుగా రూ.49 వేల కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపింది. జూన్ 20న సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో రూ.28,546 కోట్ల పెట్టుబడులతో 30,270 మందికి ఉపాధి కల్పించే ప్రతిపాదనలకు సమ్మతి తెలుపగా జూలై 23న జరిగిన భేటీలో రూ.20,216 కోట్ల పెట్టుబడులు.. 50,600 మందికి ఉద్యోగాలు లభించే ప్రతిపాదనలకు అంగీకరించింది. ఆయా కంపెనీలకు రాయితీలపై భూములిచ్చేందుకు సంసిద్ధత తెలిపింది. వీటన్నిటినీ మంత్రివర్గం సైతం ఆమోదించడం విశేషం.

### విశాఖకు మహర్దశ..


ఆర్థిక రాజధాని వైజాగ్‌కు ప్రఖ్యాత ఐటీ కంపెనీ కాగ్నిజెంట్ వస్తోంది. రూ.1,582 కోట్ల పెట్టుబడితో 8,000 మంది యువతకు ఉద్యోగాలు కల్పిస్తామంటూ ఆ సంస్థ ప్రతిపాదనలను రాష్ట్రప్రభుత్వం ఆమోదించింది. ఎకరా 99 పైసలు చొప్పున 21.31 ఎకరాలను దానికి కేటాయించాలని కేబినెట్ తీర్మానించింది. కూటమి అధికారంలోకి వచ్చాక 12,000 మందికి ఉద్యోగాలు కల్పిస్తూ వైజాగ్‌లో కార్యాలయం స్థాపనకు టీసీఎస్ చేసిన ప్రతిపాదనకు ప్రభుత్వం గ్రీన సిగ్నల్ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ కంపెనీకి కూడా 22 ఎకరాలు ఎకరా 99 పైసలకే కేటాయించింది. టీసీఎస్ విశాఖ కార్యాలయం కోసం రూ.1,370 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. రాష్ట్రానికి ఐటీ కంపెనీలను తీసుకొచ్చేందుకు మంత్రి లోకేశ నిర్విరామంగా ప్రయత్నాలు చేస్తున్నారు. రెండే రెండు కంపెనీలు టాటా కన్సల్టెన్సీ, కాగ్నిజెంట్‌లతోనే 20000 మంది ఉద్యోగాలు దక్కనుండటంతో విశాఖ నగర రూపురేఖలు పూర్తిగా మారిపోనున్నాయని ఐటీ రంగ నిపుణులు పేర్కొంటున్నారు. భౌగోళికంగా సముద్రం.. భోగాపురం గ్రీనఫీల్డ్ ఎయిర్ పోర్టు.. ఐటీ కంపెనీలు కలసి.. ముంబై తరహా కాస్మోపాలిటన సిటీగా విశాఖ మారేందుకు ఎక్కువ కాలం వేచి చూడాల్సిన అవసరం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

### విశాఖకు మరో నాలుగు ప్రతిష్ఠాత్మక సంస్థలు

విశాఖకు మరో నాలుగు ప్రతిష్ఠాత్మక సంస్థలు రానున్నాయి. జూలై 23న జరిగిన ఎస్ఐపీబీ సమావేశంలో సిఫీ (రూ.16,466 కోట్లు), సత్వ (రూ.1,500 కోట్లు), బీవీఎం (రూ.1,250 కోట్లు), ఏఎనఎస్ఆర్ (1,000 కోట్లు) ప్రతిపాదించిన మొత్తం రూ.20,216 కోట్ల పెట్టుబడులకు ఆమోదం లభించింది. విశాఖలో భూమి లభ్యత తక్కువగా ఉందని ఈ సందర్భంగా సీఎం అన్నారు. ఇప్పటికే ఆర్సెల్లార్ మిట్టల్‌కు స్టీల్ ఫ్యాక్టరీ పెట్టడానికి భూములు ఇస్తున్నామని గుర్తు చేశారు. ఈ క్రమంలో విశాఖకు తరలివచ్చే పారిశ్రామిక సంస్థలకు మౌలిక సదుపాయాల సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. విమానాశ్రయం, రైలు కనెక్టివిటీ, హైవే రోడ్లు, మెట్రో వంటి వాటిపై ముందస్తు ప్రణాళికలతో కార్యాచరణ ప్రణాళికలను అమలు చేయడంపై ఫోకస్ పెట్టాలన్నారు. దీనివల్ల ముమ్మందు పౌరజీవనంలో సమస్యలు తలెత్తవని తెలిపారు. పారిశ్రామిక, ఐటీ సంస్థలకు సమీపంలో ఉద్యోగులు నివాసం ఉండేలా మౌలిక సదుపాయాలు కల్పిస్తే ట్రాఫిక్ సమస్యనూ తగ్గించవచ్చన్నారు. కంపెనీలకు సమీపంలోనే విద్యాసంస్థలు, మాల్స్ ఉంటే ..ఆర్థిక భారంలేని నగర జీవనం అందుబాటులో ఉంటుందని చెప్పారు. ఇందుకోసం మాస్టర్ ప్లానను సిద్ధం చేయాలని స్పష్టం చేశారు.

### యువతకు భరోసా ఇచ్చేలా..

రాష్ట్ర యువతకు భరోసానిచ్చేలా పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామిక సంస్థలు ప్రతిపాదనలతో ముందుకు వస్తున్నాయి. పర్యాటకం, ఐటీ, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు అభివృద్ధి చోదకాలు కావడంతో వీటికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నది సీఎం అభిప్రాయంగా ఉంది.. వెనుకబడిన ప్రాంతాల్లో పరిశ్రమలు పెడితే అదనపు ప్రోత్సాహకాలు ఇవ్వాలని అధికారులకు పదే పదే సూచిస్తున్నారు. పారిశ్రామిక ప్రాజెక్టుల్లో స్థానికులకే ఎక్కువ ఉద్యోగాలు దక్కుతాయని.. అందుకు యువతకు అవసరమైన నైపుణ్యాల్లో శిక్షణ ఇవ్వాలని చెబుతున్నారు. అన్ని ప్రాంతాలూ సమానాభివృద్ధి సాధించాలన్న లక్ష్యంతో.. రాష్ట్రానికి వచ్చే పెట్టుబడులు అన్ని చోట్లా సమానంగా విస్తరించేలా ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. భూములు తీసుకున్న సంస్థలు నిర్దేశిత సమయంలోపే కార్యకలాపాలు చేపట్టేలా అధికారులు పర్యవేక్షించనున్నారు. ఆయా సంస్థల ప్రతినిధులతో వారు తరచూ చర్చిస్తున్నారు కూడా. రాష్ట్రంలో ఏర్పాటయ్యే పరిశ్రమలు, పెట్టుబడులు, ఉద్యోగాల కల్పనపై సమాచారం అందరికీ తెలిసేలా ఆనలైన పోర్టల్‌లో పొందుపరచనున్నారు. క్లస్టర్ల వారీగా పరిశ్రమల మ్యాపింగ్ చేయనున్నారు.





# అసైన్డ్ అక్రమాల్లో ఐదుగురు ఐఏఎస్‌లు

కీలక పోస్టుల్లో ఉంటూ వైసీపీకి కొమ్ముకాశారు

ఫ్రీహోల్డ్ అక్రమాలు జరిగేలా వెసులుబాటు ఇచ్చారు

ఫైళ్లు క్లియర్‌చేయాలని తహశీల్దార్‌లపై తీవ్ర ఒత్తిళ్లు

ఫైల్ల పరిశీలనతో ప్రాధమిక నిర్ధారణ

సీఎంకు చేరిన రెవెన్యూనివేదిక



కనీవినీ ఎరుగని కటిక దోపిడీ.. జగన్ ప్రభుత్వ చరమాంకంలో జరిగిన అసైన్డ్ భూముల స్వాహాలో వైసీపీ నేతలకు ఉన్నతాధికారులే అడుగడుగునా సహకరించారు. సీఎం చంద్రబాబు ఆదేశాలతో రెవెన్యూ శాఖ చేస్తున్న విచారణలో కొత్త విషయాలు వెలుగుచూస్తున్నాయి. వైసీపీ నేతల అక్రమాలకు తెరవెనక ఎవరు సహకరించారు.. 5.75 లక్షల ఎకరాల అసైన్డ్ భూములను ప్రభుత్వ ఉత్తర్వులకు విరుద్ధంగా ఫ్రీహోల్డ్ ఎలా అయిందో తేలిపోయింది. నాడు జగన్ ప్రభుత్వంలోని కొందరు పేరుమోసిన పెద్దలు, ప్రజాప్రతినిధులపైనే ఇప్పటిదాకా అనుమానాలున్నాయి. అయితే వీరికి ప్రత్యక్షంగా, పరోక్షంగా కొందరు ఐఏఎస్‌లు కూడా సహకరించారని తాజా విచారణలో తేలింది. కలెక్టర్, జాయింట్ కలెక్టర్ (జేసీ) హోదాలో ఉన్న కొందరు అధికారులు.. వైసీపీ పెద్దలు, జిల్లా స్థాయి నేతల అడుగులకు మడుగులొత్తుతూ లక్షల ఎకరాల భూములను అడ్డగోలుగా నిషేధ జాబితా (22ఏ) నుంచి తొలగించేందుకు సహకరించారు. అంతేకాదు.. వైసీపీ నేతలు చెప్పినట్లు చేయాలని.. వారు చెప్పిన ఫైల్స్‌ను క్లియర్ చేయాలని తహశీల్దార్లపై తీవ్ర స్థాయిలో ఒత్తిడిచేశారు. ఫలితంగానే కేవలం ఐదారు నెలల వ్యవధిలో 13 లక్షల ఎకరాలను ఫ్రీహోల్డ్ చేశారు. అందులో అక్రమంగా, చట్టవిరుద్ధంగా 5.75 లక్షల ఎకరాలకు విముక్తి కల్పించారని రెవెన్యూశాఖ గుర్తించింది. ఉన్నతస్థాయి అధికారుల అండదండలు ఉండటంతోనే వైసీపీ నేతలు చెలరేగి భూములు దక్కించుకున్నారని నిర్ధారించింది. ఈ పరిణామాల నేపథ్యంలో అసైన్డ్ భూముల అక్రమాలు జరిగిన కీలకమైన పది జిల్లాల డేటాను పరిశీలించగా.. ఐదు జిల్లాల్లో ఐఏఎస్‌ల అక్రమాల భూ చదరంగం బయటపడింది. దీనిపై సీఎంకు తాజాగా నివేదిక సమర్పించింది.

### పకడ్బందీ పథకంతో..

అసైన్డ్ భూములకు శాశ్వత హక్కులు కల్పించేందుకు జగన్ ప్రభుత్వం 2023లో ఆంధ్రప్రదేశ్ అసైన్డ్ భూముల చట్టం-1977(పీవోటీ)లో సవరణలు చేసింది. అసైన్‌మెంట్ కాలపరిమితిలో 20 ఏళ్లు దాటిన భూములను నిషేధ జాబితా నుంచి తొలగించి (ఫ్రీహోల్డ్).. లబ్ధిదారుల పేరిట శాశ్వత హక్కులు కల్పిస్తూ పట్టాలు ఇవ్వాలని అదే ఏడాది డిసెంబరు 19న జీవో 596 జారీ చేశారు. ఆ ఉత్తర్వులోని మార్గదర్శకాల ప్రకారమే ఫ్రీహోల్డ్ చేయాలని ఆదేశించారు. జిల్లా స్థాయిలో ఈ ప్రక్రియను పర్యవేక్షించాల్సింది జాయింట్ కలెక్టర్‌లే. రెవెన్యూ సబ్జెక్టు వారి వద్దే ఉంటుంది. అయితే జీవో రాకముందే.. ఆ ఏడాది ఆగస్టు నుంచే వేల ఎకరాల భూములను అక్రమంగా నిషేధ జాబితా నుంచి బయటకు తీశారు. 2023 డిసెంబరు 20 నుంచి 2024 జూలై వరకు 13.54 లక్షల ఎకరాల అసైన్డ్ భూములను ఫ్రీహోల్డ్ చేశారు. వాటిలో జీవో 596కి విరుద్ధంగా, అడ్డగోలుగా నిషేధ జాబితా నుంచి తొలగించిన భూములు 5.75 లక్షల ఎకరాలు. ఎన్నికల ముందు, తర్వాత కూడా జనం చంద్రబాబును కలిసి ఫిర్యాదు చేశారు. తమకు అసైన్ చేసిన భూములు 22ఏ జాబితాలో ఉన్నాయని.. బలవంతంగా లాక్కుని.. ఆ తర్వాత ఫ్రీహోల్డ్ చేయుంచుకుని వైసీపీ నేతలు కాజేశారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దరిమిలా ఈ ఏడాది ఫిబ్రవరిలో ముఖ్యమంత్రి రెవెన్యూ శాఖకు కీలకమైన ఆదేశాలు ఇచ్చారు. దరిదాపుగా 2.5 లక్షల ఎకరాల ప్రభుత్వ భూములను అసైన్డ్‌గా చూపించి.. జేసీలు, తహశీల్దార్ల సహకారంతో వైసీపీ నేతలు కాజేశారన్న కంప్లయింట్లు కూడా వచ్చాయి. దరిమిలా ఫ్రీహోల్డ్ అక్రమాలు ఎలా జరిగాయి? ఇందులో ఎవరి పాత్ర ఎంత? ప్రజాప్రతినిధులు, నేతలు, అధికారులు ఏ స్థాయిలో ఎలా ఉల్లంఘనలకు పాల్పడారో లోతైన విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని రెవెన్యూశాఖను సీఎం ఆదేశించారు. ఈ నేప?థ్యంలో ఆ శాఖ ఫ్రీ హోల్డ్ అక్రమాలపై ఉన్నత స్థాయిలో విచారణ జరిపింది. అత్యధిక అక్రమాలు జరిగిన జిల్లాలపై ఎక్కువ ఫోకస్‌పెట్టింది. జీవో 596 ఉల్లంఘనతోపాటు చట్టపరిధిలో లేని భూములు, రికార్డులు లేనివి, ఇంకా సర్వీస్ ఇనాం, షరతుగల పట్టా, చుక్కల భూములను కూడా భారీగా ఫ్రీహోల్డ్ చేశారని తేలింది. ఫ్రీ హోల్డ్ అయిన కొన్ని రకాల భూముల కేసులను పరిశీలించగా.. కొన్ని జిల్లాల్లో కలెక్టర్లు, మరి కొన్ని జిల్లాల్లో జేసీలే వైసీపీ నేతల అక్రమాలకు కొమ్ముకాసినట్లు స్పష్టంగా బయటపడింది. ఈ నేప?థ్యంలో ఆయా కలెక్టర్లు ప్రభావితం చేసిన ఫైళ్లు, జాయింట్ కలెక్టర్ల ఆదేశాలతో అక్రమంగా ఫ్రీహోల్డ్ అయిన భూములు, దిగువ స్థాయిలో తహశీల్దార్ పరిధిలో తీసుకున్న తప్పుడు నిర్ణయాలపై సమగ్ర రిపోర్టు తయారు చేశారు.




### అక్రమాల దారిలో ఐదుగురు ఐఏఎస్‌లు

కంచే చేను మేసిన చందంగా ఐదుగురు ఐఏఎస్‌లు అసైన్డ్ చట్టాన్ని ఉల్లంఘించి 5.75 లక్షల ఎకరాలను ఫ్రీ హోల్డ్ చేశారు. అందులో అసైన్‌మెంట్ అయినట్లుగా రికార్డులే లేని భూమి 2.69 లక్షల ఎకరాలు, కాలపరిమితి దాటనివి 32 వేల ఎకరాలు. కలెక్టర్ ఉత్తర్వుతో సంబంధం లేకుండా ఫ్రీ హోల్డ్ అయినవి 60వేల ఎకరాలున్నాయు. ఈ భూములు ఎలా ఫ్రీ హోల్డ్ అయ్యాయని లోతుల్లోకి వెళ్లి పరిశీలన చేస్తే, కొన్ని జిల్లాల కలెక్టర్లు, జేసీల ఒత్తిళ్లు, సొంత ప్రయోజనాలు దాగిఉన్నట్లు గుర్తించారు. వారెవరంటే.. జగన్ జమానాలో రాయలసీమలోని ఓ జిల్లాకు ఆ అధికారి జేసీగా ఉన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆయన్ను ఆ జిల్లాకే కలెక్టర్‌గా పోస్టింగ్ ఇచ్చింది. జేసీగా ఉన్నప్పుడు భారీగా భూముల ఫ్రీ హోల్డ్ జరిగింది. ఇందులో ఈ అధికారి తప్పిదాలు, ఒత్తిళ్లు, నిర్లక్ష్యం చాలా ఉందని గుర్తించారు. కోస్తాకు చెందిన ఓ జిల్లా కలెక్టర్ తన జేసీని పక్కనపెట్టి కేసులను సెటిల్ చేసినట్లు తేలింది. జేసీ సంతకాలు లేకుండానే ఫైళ్లను క్లోజ్ చేశారు. ప్రస్తుతం ఈ అధికారి విద్యుత రంగంలో పనిచేస్తున్నారు. ప్రకాశం జిల్లా జేసీగా పనిచేసి ఇప్పుడు ఓ సంపన్న జిల్లాకు కలెక్టర్‌గా ఉన్న అధికారి పాత్ర కూడా నిర్ధారణ అయింది. అలాగే గతంలో రాయలసీమలో కొద్దికాలం జేసీగా పనిచేసిన అధికారి సర్వీస్ ఇనాం, చుక్కల భూములను అడ్డగోలుగా ఫ్రీ హోల్డ్ చే శారని తేల్చారు. ఇప్పుడు ఆయన అదే సీమలో ఓ జిల్లాకు కలెక్టర్‌గా ఉన్నారు. ఎన్నికలకు ముందు కొంతకాలం తిరుపతి జిల్లాకు కలెక్టర్‌గా పనిచేసిన ఓ అధికారి బదిలీకి ముందు 6వేల ఎకరాల అసైన్డ్ భూముల ఫైళ్లను క్లియర్ చేశారని గుర్తించారు. ప్రస్తుతం ఈయన కోస్తాలో అమరావతికి సమీపంలోని ఓ ప్రముఖ జిల్లాకు కలెక్టర్‌గా ఉన్నారు. విశాఖ జిల్లా జేసీగా పనిచేసిన వ్యక్తి వైసీపీ నేతలతో అంటకాగారు. నాటి ప్రభుత్వ పెద్దలు, సీఎం కార్యదర్శి ధనుంజయరెడ్డి, ఆయన అల్లుడు, కొడుకు, ఇతర కీలక వ్యక్తులు విశాఖలో భారీగా భూములు కొన్నారు. వందల ఎకరాల అసైన్డ్ భూముల కొనుగోలుకు ఒప్పందాలు కూడా చేసుకున్నారు. అప్పుడు ఆ జేసీయే అసైన్డ్ భూముల డేటా, ఇతర సమాచారం వారికి అందించారన్న ఫిర్యాదులున్నాయి. తాజా విచారణలో ఈయన పనిచేస్తున్నచోటే వేల ఎకరాల అక్రమ ఫ్రీ హోల్డ్ బయటపడుతుందని అంతా భావించారు. కానీ ఆచరణలో అందుకు పూర్తి విరుద్ధంగా ఆ జిల్లాలో అసైన్డ్ భూముల అక్రమాలే జరగలేదని వరుసగా నివేదికలు వచ్చాయి. సర్కారు కూడా విస్మయానికి గురైంది. నాటి వైసీపీ పెద్దలు మూకుమ్మడిగా ఆ జిల్లాలో మకాంవేసి వేల ఎకరాల భూములు కొంటే, అక్కడ ఎకరం కూడా పరాధీనం కాలేదని నివేదికలు ఇవ్వడం ఏమిటి? అసలేం జరుగుతోందని ఆరాతీసింది. అయినా ఫలితం లేదు. స్వాహాకు సహకరించిన అధికారిని అక్కడే ఉంచి నివేదికలు అడిగితే ఇలా రాక ఎలా వస్తాయి? ఈ వ్యవహారంలో టీడీపీ, జనసేన నేతల పాత్ర కూడా ఉన్నట్లు కనిపిస్తోంది. వైసీపీ పెద్దలతో వీరు లాలూచీపడినట్లు తెలుస్తోంది. ఫ్రీహోల్డ్ చేసిన భూములను వాటాలు వేసుకుని పంచుకున్నారని ప్రచారం జరుగుతోంది.

### మా కలెక్టర్‌పై విచారణ చేయండి..

రాయలసీమలోని ఓ జిల్లా ప్రజాప్రతినిధులు ఇటీవలి కాలంలో ముఖ్యమంత్రి కార్యాలయంలో ఓ ఫిర్యాదు ఇచ్చారు. తమ జిల్లా కలెక్టర్‌ను మార్చాలని డిమాండ్ చేశారు. ఇందుకు కారణం ఫ్రీ హోల్డ్ భూముల అక్రమాలు జరిగిన సమయంలో తమ జేసీగా ఆయనే ఉన్నారని, ఇప్పుడు ఆనాటి అక్రమాలపై విచారణ చేస్తోన్న సమమంలో ఆయనే కలెక్టర్‌గా ఉన్నారని, ఆయన ఆ పోస్టులో ఉంటే అసలు దోషులు బయటపడరని టీడీపీ నేతలు నివేదించారు. ఇదే అంశాన్ని పార్టీ ముఖ్యనేతల వద్దా ప్రస్తావించారు. జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి, ఇన్ ఛార్జి మంత్రికి ఈ విషయం పెద్ద తలనొప్పిగా మారింది. నిజానికి తప్పులు చేశారని రెవెన్యూ శాఖ గుర్తించిన అధికారుల జాబితాలో ఈయన కూడా ఉన్నారు. ఇక ఈ విషయంలో కీలక నిర్ణయం తీసుకోవాల్సింది ముఖ్యమంత్రే. ఫ్రీహోల్డ్ అక్రమాల్లో తహశీల్దార్, ఆర్డీవోల తప్పులను గుర్తించి వారిపై చర్యలు తీసుకుంటున్నారు. అదేసమయంలో వారిని అక్రమాల బాటలో పరుగులు పెట్టించిన కొందరు ఐఏఎస్‌లపై సీఎం ఏం చర్యలు తీసుకుంటారన్నది ఇటు అధికారవర్గాలు, అటు ఐఏఎస్‌ల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. తప్పుచేసిన వారు ఎంతటివారైనా చర్యలు తప్పవని ఆయన పదేపదే చెబుతుంటారు. ఐఏఎస్‌ల విషయంలోనూ అదే పంథా కొనసాగిస్తారా?




# రాష్ట్రాభివృద్ధిపై జగన్ కుట్ర

**ఏపీఎండీసీ బాండ్లు కొనవద్దంటూ 200 మంది ఇన్వెస్టర్లకు ఈమెయిల్స్**

**పీఎం, ఆర్థిక మంత్రి, ఆర్‌బీఐ, సెబీ, ఇతర ఎక్స్ఛేంజీలకు ఫిర్యాదులు**

**హైకోర్టులో కేసులు.. వాటిపై బుగ్గన ప్రెస్‌మీట్లు, జగన్ ట్వీట్లు**


**అయినా నమ్మని ఇన్వెస్టర్లు.. ఎండీసీ బాండ్లు ఓవర్‌సబ్‌స్క్రైబ్**

**నిబంధనలు ఉల్లంఘన జరగలేదని తేల్చిన సెబీ, ఆర్‌బీఐ, కేంద్రం**

ఈ వ్యక్తికి రాష్ట్రాభిమానం ఇసుమంతైనా లేదు. అధికారంలో ఉన్నా.. విపక్షంలో ఉన్నా.. రాష్ట్రాభివృద్ధి గురించి కలలో కూడా ఆలోచించరు. చంద్రబాబుపై ద్వేషంతో రాష్ట్రాన్ని, యువతను నాశనం చేయడానికైనా వెనుదీయరు. గద్దెపై ఉన్న ఐదేళ్లలో ఒక్క పరిశ్రమను కూడా తేకపోగా.. ఉన్నవాటిని సొంతం చేసుకోడడమో, దారికిరాని వారిని తరిమేయడమో చేశారు. అందుకు జనం ఛీత్కరించి గద్దె మీద నుంచి లాగి కిందపడేసినా బుద్ధి తెచ్చుకోవడం లేదు. కుక్కతోక వంకర సామెతను రుజువు చేస్తున్నారు. ఆయనే మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి. రాష్ట్రంలో అభివృద్ధి జరుగకుండా కుట్రలు చేస్తున్నారు. ఎవరూ పెట్టుబడులు పెట్టకుండా భయాందోళనలకు గురిచేయాలని చూస్తున్నారు. తన పర్యటనలతో అలజడులు సృష్టించడం ద్వారా రాష్ట్రంలో శాంతిభద్రతలు లేవని చాటేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. జాతీయ చానళ్లకు తప్పుడు సమాచారం ఇచ్చి, ధన ప్రలోభాలు చూపి తప్పుడు కథనాలు ప్రసారం చేయిస్తున్నారు. ఇంకోవైపు సన్నిహితులను రంగంలోకి దించి.. కేంద్రప్రభుత్వానికి చంద్రబాబుపై తప్పుడు ఫిర్యాదులు చేయిస్తున్నారు. 2014-19 నడుమ రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టులపై ఇలాగే తప్పుడు ఆరోపణలు చేసి.. కేసులు వేసి అడ్డుకోవాలని చేశారు. తాను అధికారంలోకి వచ్చాక వాటిని బొందపెట్టారు. ఇప్పుడు తనను ఓడించిన జనంపై కక్షగట్టారు. రాష్ట్రానికి నిధులు, రుణాలు రాకుండా చేయాల్సిన అకృత్యాలన్నీ చేస్తున్నారు. రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ(ఏపీఎండీసీ) బాండ్ల జారీ ద్వారా రూ.9,000 కోట్ల రుణం సమీకరించాలని చంద్రబాబు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ బాండ్లను ఎవ్వరూ కొనకుండా, ఆ అప్పు రాకుండా చేసేందుకు జగన్, ఆర్థిక శాఖ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, ఉదయ భాస్కర్ అనే మరో వ్యక్తి కలిసి కుట్రలు ఎలా పన్నారో, వాటిని ప్రభుత్వం ఎలా అధిగమించిందో తాజాగా వెల్లడైంది. అధికారంలో ఉన్నన్నాళ్లు బ్రాండ్ ఏపీని ప్రత్యక్షంగా నాశనం చేసి, ఇప్పుడు తప్పుడు ట్వీట్లతో పరోక్షంగా నాశనం చేస్తున్నారు. జర్మనీలో ఉద్యోగం చేసే ఉదయ్ భాస్కర్ ద్వారా ఏపీఎండీసీ ఇష్యూ చేసే బాండ్లు కొనొద్దంటూ 200 మందికి పైగా ఇన్వెస్టర్లకు ఈ-మెయిల్స్ పెట్టించారు. వీటిని ఆ ఇన్వెస్టర్లు ఏమాత్రం పట్టించుకోకపోవడంతో లేళ్ల అప్పిరెడ్డిని తెరపైకి తెచ్చారు. ఆయనతో హైకోర్టులో పిల్ వేయించారు. ఏపీఎండీసీ బాండ్ల వ్యవహారం ఇప్పుడు కోర్టు పరిధిలో ఉందని, ఇన్వెస్ట్ చేయొద్దని ఇన్వెస్టర్లకు మళ్లీ ఈ-మెయిల్స్ పంపారు. అలాగే వ్యవహారం కోర్టులో ఉండగా బాండ్ల జారీపై ముందుకెలా వెళ్తారంటూ జగన్ పత్రికలో కథనాలు వండివార్చారు. బుగ్గన హైదరాబాద్‌లో ప్రెస్‌మీట్లు పెట్టి వాటిపై వ్యాఖ్యానాలు చేయడం.. వాటిపై జగన్ ట్వీట్లు.. మళ్లీ వాటిని ఇన్వెస్టర్లకు పంపడం రోజూ ఇదో ప్రహసనంగా మారింది. అయినప్పటికీ ఇన్వెస్టర్లు చంద్రబాబు ప్రభుత్వంపై విశ్వాసం కోల్పోలేదు. ఈ బాండ్లకు పెట్టుబడులు రాకూడదని జగన్ విశ్వ ప్రయత్నాలు చేసినప్పటికీ ఏపీఎండీసీ ఇష్యూ ఓవర్‌సబ్‌స్క్రైబ్ అవడం విశేషం.

**ఆర్‌బీఐ, సెబీ చెప్పినా వినరా ?**

లేళ్ల అప్పిరెడ్డి విష ప్రచారాలు సత్ఫలితాలు




ఇవ్వకపోవడంతో వైసీపీ రాజ్యసభ సభ్యుడు, ఆర్థిక శాఖపై స్టాండింగ్ కమిటీ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డిని రంగంలోకి దించారు. ఆయన ఏపీఎండీసీ బాండ్ల వ్యవహారం రాజ్యాంగ విరుద్ధం, నిబంధనలకు విరుద్ధమంటూ ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఆర్‌బీఐ, సెబీ, ఇతర ఎక్స్ఛేంజీలకు ఫిర్యాదులు ఇచ్చారు. సాధారణంగా బాండ్ల ఇష్యూకి 4 గంటల్లో అనుమతి వస్తుంది. కానీ జగన్ ముఠా నిర్వాకంతో 15 రోజుల సమయం పట్టింది. చంద్రబాబు ప్రభుత్వం చేస్తున్నది సరైనదేనని, ఏపీఎండీసీ బాండ్ల జారీలో నిబంధనల ఉల్లంఘన లేదని కేంద్రం, సెబీ, ఆర్‌బీఐ తేల్చిచెప్పాయి. ఆ తర్వాతే బాండ్ల ఇష్యూకి అనుమతి దొరికింది. రూ.9,000 కోట్ల అప్పు కూడా వచ్చింది. ఇంతా జరిగాక కూడా ఇది తప్పంటూ జగన్ ట్వీట్లు, బుగ్గన ప్రెస్‌మీట్లు పెడుతున్నారు. సెబీ, ఆర్‌బీఐ చెప్పినా కూడా వినరా అని ఆయన ఎద్దేవా చేశారు. డైరెక్ట్ డెబిట్ విధానం తప్పంటూ గగ్గోలు పెడుతున్న బుగ్గన ఆయన ఆర్థిక మంత్రిగా ఉన్నప్పుడే దేశంలో ఎక్కడా లేని విధంగా ఆ విధానం బేవరేజెస్ కార్పొరేషన్‌లోకి తీసుకొచ్చారు.




ఇప్పుడు ఆ విధానాన్ని ఆర్‌బీఐ ఆమోదించింది. ఇటీవల తెలంగాణ ప్రభుత్వానికి డైరెక్ట్ డెబిట్ విధానంలో అప్పు తీసుకోవడానికి అనుమతిచ్చింది. చాలా రాష్ట్రాల్లో ఇదే విధానం అమలవుతోంది.

**బుగ్గన ఇచ్చిన జీవో తప్పా..?**

ఏపీఎండీసీ బాండ్ల జారీ ద్వారా రూ.7,000 కోట్లు అప్పు తెచ్చుకునేందుకు అనుమతిస్తూ మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన తన హయాంలో 2024 మార్చి 15వ తేదీన జీవో 35 ఇచ్చారు. ఇప్పుడు టీడీపీ కూటమి ప్రభుత్వం అదే ఏపీఎండీసీ బాండ్ల జారీ ద్వారా రూ.9,000 కోట్లు అప్పు తెచ్చుకునేందుకు అనుమతిస్తూ ఈ ఏడాది మార్చి 11వ తేదీన జీవో 32 జారీచేసింది. ఇందులో ఏ జీవో తప్పో బుగ్గన చెప్పాల్సిన అవసరం ఉంది. కూటమి ప్రభుత్వం నిబంధనల ప్రకారం నడచుకుంటోంది. బుగ్గన తరహాలో ప్రభుత్వ ఆస్తులు తాకట్టు పెట్టడం లేదు. బేవరేజెస్ కార్పొరేషన్ వ్యవహారంలో అప్పు కోసం ఏకంగా గవర్నర్ పేరునే వివాదాల్లోకి లాగారు. దీంతో ఆగ్రహించిన గవర్నర్ అప్పటి సీఎస్‌ను పిలిచి తిడితే ఉత్తర్వులను సవరించిన సంగతి జగన్ మీడియా ఉద్దేశపూర్వకంగా విస్మరించింది. జనానికి ఇవేవీ తెలియవన్నది వారి ప్రగాఢ విశ్వాసం.

**దొంగ మెయిల్స్‌పై కచ్చితంగా కేసులు పెట్టాలి**

రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీసే విధంగా మెయిల్స్ పెట్టిన వారిపై కచ్చితంగా కేసులు పెట్టి తీరాలి. ఆ ప్రబుద్ధులను చట్టం ముందేగాక జనం ముందు కూడా నిలబెట్టాలి, పెట్టుబడిదారులెవరో తెలుసుకుని మరీ ఈ-మెయిల్స్ పెట్టారంటే వారిది ఎంత క్రిమినల్ బెయిలో తెలిసిపోతోంది. కేంద్రంలో, సెబీలో కూడా జగన్ తాబేదారులు ఉన్నారని అవగతమవుతోంది. ప్రధానికి, కేంద్ర ఆర్థిక మంత్రికి, కేబినెట్ సెక్రటరీకి కూడా మెయిల్స్ పెట్టారు. దీనిపై విచారించాలని సెబీకి కేబినెట్ సెక్రటరీ సూచించడం తీవ్రతకు అద్దం పడుతోంది. దీంతో సెబీ.. పెట్టుబడిదారులతో పాటు రాష్ట్రప్రభుత్వం నుంచి కూడా వివరణ తీసుకుంది. బాండ్లకు క్లియరెన్స్ ఇవ్వడానికి ఆర్‌బీఐ ఎవరని బుగ్గన ప్రశ్నించడం విస్తుగొల్పుతోంది. ఆర్‌బీఐ అంటే రాజేంద్రనాథ్‌రెడ్డి బ్యాంక్ ఆఫ్ ఇండియా కాదు.. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అని ఆయన మరచినట్లున్నారు. లేదంటే పెట్టుబడులు రావడంతో ఆయనకు కడుపుమంటగా ఉందేమో! ఆర్‌బీఐ, సెబీ క్లియరెన్స్ ఇచ్చాక పెట్టుబడిదారులు పెట్టుబడి కూడా పెట్టారు. దీన్ని కూడా రాజ్యాంగ విరుద్ధమని చెప్పడం హాస్యాస్పదం. అధికారంలో ఉన్నప్పటిలా పిట్టకథలు చెప్పి తప్పించుకుందామంటే కుదరదు. రాష్ట్రానికి ద్రోహం తలపెట్టినందుకు జగన్ ముఠా కచ్చితంగా క్షమాపణ చెప్పాలి.. చెప్పించాలి. లేదంటే ఇంకా రెచ్చిపోతూనే ఉంటారు. కోర్టులో పిటిషన్లు వేయడం.. మర్నాడే ప్రెస్‌మీట్లు పెట్టి విమర్శలు గుప్పించడం.. కోర్టులో ఉందని, డబ్బులు ఎలా ఇస్తారని ఇన్వెస్టర్లనే నిలదీయడం ఈ ముఠా కుట్రలకు, దుర్మార్గాలకు నిదర్శనం. జగన్ హయాంలో ఇదే ఏపీఎండీసీ ద్వారా రూ.7 వేల కోట్లకు బాండ్లు జారీచేస్తే.. ఎవరూ ఒక్క బాండు కూడా కొనలేదు. చంద్రబాబు 9 వేల కోట్లకు ఇష్యూ చేస్తే ఓవర్ సబ్‌స్క్రైబ్ కావడం చూసి జగన్ కళ్లలో నిప్పులు పోసుకుంటున్నారు.

## 4 వేల కోట్ల బడ్జెట్.. నిజమేనా?



ఓ పదేళ్ల కిందట ఇండియన్ సినిమా మీద 200-300 కోట్ల బడ్జెట్ పెట్టడం కూడా చాలా రిస్కీ అనిపించేది. కానీ గత కొన్నేళ్లలో 500 కోట్లతో సినిమా తీయడం మామూలైపోయింది. ప్రభాస్ సినిమాలన్నీ దాదాపుగా ఆ బడ్జెట్లోనే తెరకెక్కుతున్నాయి. ఇదంతా 'బాహుబలి' పుణ్యమే అనడంలో సందేహం లేదు. రెండు భాగాలకు కలిపి ఆ చిత్రం మీద రూ.500 కోట్లకు పైగా బడ్జెట్ పెట్టించి, అంతకు కొన్ని రెట్లు వసూళ్లు రాబట్టిన రాజమౌళి.. ప్రస్తుతం మహేష్ బాబుతో వెయ్యి కోట్ల సినిమా తీస్తున్నారు. దానికే ఔరా అనుకుంటుంటే.. 'రామాయణం' సినిమా మీద ఏకంగా 500 మిలియన్ డాలర్లు, అంటే రూ.4 వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు ప్రకటించి పెద్ద షాకే ఇచ్చారు నిర్మాత నమిత్ మల్హోత్రా.

నిజంగా 'రామాయణం' రెండు భాగాలకు కలిపి రూ.4 వేల కోట్ల బడ్జెట్ పెడుతున్నారా.. అంత పెడితే ఎంతమేర వర్కవుట్ అవుతుంది అనే ప్రశ్నలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. ఇండియాలో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా 'బాహుబలి-2' రికార్డు నెలకొల్పింది. ఆ సినిమా ఎనిమిదేళ్ల ముందు రూ.1700 కోట్ల మేర వసూళ్లు రాబట్టింది. ఆ తర్వాత ఎన్నో భారీ చిత్రాలు వచ్చాయి కానీ.. దానికి దగ్గరగా కూడా వెళ్లలేకపోయాయి. రాజమౌళి సైతం 'ఆర్ఆర్ఆర్'తో ఆ రికార్డును కొట్టలేకపోయాడు. 'బాహుబలి-2' స్థాయి హైప్ తెచ్చుకోవడం మరో సినిమాకు అసాధ్యం అనే అభిప్రాయం బలంగా ఉంది. రామాయణ కథకు ఉన్న పొటెన్షియాలిటీ, మేకింగ్ మీద ఉన్న నమ్మకం నిర్మాతలతో భారీ బడ్జెట్ పెట్టడానికి పురిగొల్పి ఉండొచ్చు. ఇటీవల రిలీజ్ చేసిన గ్లింప్స్ సినిమా మీద అంచనాలను పెంచిన మాట వాస్తవం. కానీ నిర్మాత ప్రకటించిన బడ్జెట్ వర్కవుట్ కావాలి.. సినిమా బ్రేక్ ఈవెన్ కావాలి.. లాభాలు రావాలి అంటే మాత్రం బాక్సాఫీస్ దగ్గర అద్భుతాలే జరగాలి. అది అనుకున్నంత సులువు కాదు. ఐతే సినిమాకు పెద్ద బడ్జెట్టే పెడుతుండొచ్చు కానీ.. మరీ ఈ స్థాయిలో ఖర్చు పెట్టే స్థాయి ఇండియన్ సినిమాలకు ఇంకా రాలేదని.. సినిమాకు హైప్ పెంచడం కోసమే ఇలా చెప్పారేమో అనే సందేహాలు కలుగుతుండడం గమనార్హం.

# నోట్ల కట్టలపాములు

## బయటపడుతున్న లిక్కర్ స్కామ్ డంప్‌లు





కోట్ల కట్టలు.. కట్టల గుట్టలు.. మద్యం కుంభకోణంలో వైసీపీ నేతలు దాచిన నోట్ల కట్టలపాములు.. ఒక్కొక్కటిగా సిట్ విచారణలో బయటపడుతున్నాయి! హైదరాబాద్ శివారులోని ఒక ఫామ్‌హౌస్‌లో 12 అట్టపెట్టెల్లో ఏడాదిగా దాచిన రూ.11 కోట్ల నగదును సిట్ అధికారులు తొలుత స్వాధీనం చేసుకున్నారు! ఈ కుంభకోణంలో 40వ (ఏ40) నిందితుడైన వరుణ్ పురుషోత్తం ఇచ్చిన సమాచారం ఆధారంగా ఆ సొమ్మును సీజ్ చేశారు. ఆ తర్వాత నాలుగు రోజులకే.. ఈ కేసులో కీలక నిందితుల్లో ఒకడైన సీహెచ్ వెంకటేశ్‌నాయుడు (ఏ34) ఒక డెన్‌లో రూ.కోట్ల నోట్ల కట్టల్ని లెక్కిస్తున్న వీడియో ఒకటి వెలుగులోకి వచ్చింది. వైసీపీ చీఫ్ జగన్‌కు అత్యంత సన్నిహితుడు, ఈ కేసులో నిందితుడైన చెవిరెడ్డి భాస్కరరెడ్డికి ప్రధాన అనుచరుడు.. ఈ వెంకటేశ్ నాయుడు. కేసు దర్యాప్తులో భాగంగా అతడి ఫోన్‌ను స్వాధీనం చేసుకున్న అధికారులు.. అందులో డిలీట్ చేసిన పాత డేటా మొత్తాన్ని అత్యంత అధునాతనమైన రికవరీ సాఫ్ట్‌వేర్ల ద్వారా రిట్రీవ్ చేశారు. అలా బయటపడిందే ఈ వీడియో. మద్యం సొమ్మును ఏనాడూ ముట్టనేలేదంటూ కోర్టులో దొంగ ఏడుపులు ఏడ్చే చెవిరెడ్డి భాస్కరరెడ్డి మాటలు పచ్చి అబద్ధాలని ఈ వీడియోతో విస్పష్టంగా తేటతెల్లమైంది. మద్యం కుంభకోణంలో ఒక్క ముడుపుల ద్వారానే రూ.3500 కోట్లకు పైగా కొల్లగొట్టినట్లు సిట్ ఇప్పటికే చార్జిషీట్‌లో పేర్కొన్న సంగతి తెలిసిందే. ఆ అభియోగాలను నిరూపించే ఇలాంటి వీడియోలు మరిన్ని.. సిట్‌కు లభ్యమైనట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం.

### అట్టపెట్టెల్లో డబ్బు.. ఆరేడు వరుసల డబ్బు..

ఇంతకీ సిట్ వెలికితీసిన వీడియోలో ఏముందంటే.. ఒక గదిలో టీపాయ్‌పై ఆరేడు వరుసల్లో పేర్చిన రూ.2000, రూ.500 నోట్ల కట్టలు కళ్లు చెదిరేలా ఉన్నాయి. వాటిని వెంకటేశ్ నాయుడు లెక్కిస్తూ.. కొన్ని కట్టల్ని చూపి.. 'ఇవి ఇంత'.. 'అవి ఇంత'.. 'మొత్తం కలిపితే రూ.5 కోట్లు..' అని చెబుతున్న దృశ్యాలు ఈ వీడియోలో ఉన్నాయి. వెంకటేశ్ నాయుడు అలా లెక్క చెబుతుంటే మరో వ్యక్తి ఆ నోట్ల కట్టల్ని అట్టపెట్టెల్లో నింపుతున్నాడు. నిజానికి.. నోట్ల రద్దు అనంతరం కేంద్ర ప్రభుత్వం తెచ్చిన చట్టాల ప్రకారం అంత డబ్బును భౌతికంగా కలిగి ఉండడం (దానికి సంబంధించిన సరైన లెక్కలు చూపితే తప్ప) దర్యాప్తు చేయదగ్గ అంశం. ఈ నేపథ్యంలోనే.. ఆ సొమ్మును అప్పట్లో ఎక్కడికి తరలించారు? ఎవరికి చేర్చారనేదానిపై సిట్ అధికారులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఈ వీడియో 2021 నాటిదని సిట్ అధికారులు భావిస్తున్నారు.



### పెద్దలకేనా?

మద్యం డిస్టిలరీలు, సరఫరా కంపెనీల నుంచి వసూలు చేసిన ముడుపులను రాజ్ కసిరెడ్డి బృందం ఎప్పటికప్పుడు హైదరాబాద్, తాడేపల్లిల్లోని పలు డెన్లకు చేర్చి భద్రపరిచేదనే విషయం తెలిసిందే. అక్కడి నుంచి ఆ సొత్తును నాటి ప్రభుత్వ పెద్దలకు చేర్చేది. ఈ డెన్లలో దాచిన సొమ్మునే గత ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులకు పంపిణీ చేశారు. ఈ క్రమంలోనే.. హైదరాబాద్‌లో బంజారాహిల్స్‌లోని క్రిషి వ్యాలీ అపార్ట్‌మెంట్‌లోని తన నివాసాన్నే ఓ డెన్‌గా మార్చేసిన వెంకటేశ్ నాయుడు అందులోని సొత్తుకు హ్యాండ్లర్‌గా వ్యవహరించారు. అక్కడి నుంచే చెవిరెడ్డి భాస్కరరెడ్డి బృందం ఈ సొమ్మును సేకరించి, ఏపీకి తీసుకొచ్చేది. ఇలా దాదాపు రూ.50-60 కోట్ల సొమ్మును ఏపీకి తీసుకొచ్చినట్టు సమాచారం. హైదరాబాద్‌లో స్థిరాస్తి వ్యాపారం చేసుకునే వెంకటేశ్ నాయుడు.. చెవిరెడ్డి భాస్కరరెడ్డికి అత్యంత సన్నిహితుడు. మద్యం ముడుపుల సొమ్మును డెన్లలో భద్రపరచటం, ఆ సొత్తును గత ప్రభుత్వ పెద్దలకు చేరవేయటంలో చెవిరెడ్డి, వెంకటేశ్‌ల పాత్ర ఉన్నట్లు సిట్ దర్యాప్తులో గుర్తించింది. తమ ప్రమేయంపై విచారణ జరుగుతోందని తెలిసిన వెంటనే వీరిద్దరూ శ్రీలంక మీదుగా మాల్దీవులు, మాలే దేశాలకు పారిపోయేందుకు ప్రయత్నించారు. జూన్ 18న వారు బెంగళూరు విమానాశ్రయంలో ఉండగా సిట్ అధికారులు గుర్తించి అరెస్టు చేశారు. ఈ కేసులో కీలక నిందితులైన మిథున్ రెడ్డి, విజయసాయిరెడ్డి, జగన్ ఓఎస్డీ పి.కృష్ణమోహనరెడ్డి, భారతి సిమెంట్స్ డైరెక్టర్ గోవిందప్ప బాలాజీలతో వెంకటేశ్ నాయుడు తరచూ భేటీ అయ్యేవాడు. అతడు ఎవరెవరితో ఏయే సమయాల్లో భేటీ అయ్యాడనే విషయాన్ని సిట్ గూగుల్ టేకవుట్స్ ద్వారా నిర్ధారించుకున్నట్టు సమాచారం.

### జగన్‌తోనూ ..

గుర్తుందా.. జగన్ తాడేపల్లి ప్యాలెస్‌లో 2022 జనవరి 15న తిరుమల తిరుపతి దేవస్థానం సెట్ వేసి.. సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఆ సెట్‌ను వెంకటేశ్ నాయుడే దగ్గరుండి వేయించినట్లు సిట్ గుర్తించింది. అప్పట్లో ఈ వేడుకల్లో జగన్‌కు అత్యంత సన్నిహితులైనవారు మాత్రమే పాల్గొన్నారు. అలాంటిచోట జగన్‌తో కరచాలనం చేస్తూ, వెంకటేశ్ ఆత్మీయంగా మెలగడం.. చెవిరెడ్డి కూడా వారి వెంటే ఉండడం గమనార్హం.


NAC వారి అద్భుత
వార్షికోత్సవ
ఆఫర్
₹152 తగ్గింపు*
ప్రతి గ్రాముకు
బంగారు ఆభరణాలపై
VA* లేదు
అన్ని
వజ్రాల ఆభరణాలపై
25%* తగ్గింపు
వెండి వస్తువుల VA పై
20% తగ్గింపు*
వెండి ఆభరణాలపై
SUPER THINK DIAMOND
JEWELLERY PURCHASE PLAN
ఒక నెల ఇన్‌స్టాల్‌మెంట్ ఉచితం | అద్భుతమైన ఆఫర్* |
మొదటి నెల ఇన్‌స్టాల్‌మెంట్ విలువ గల గిఫ్ట్ వొచర్*
* నిబంధనలు మరియు షరతులు వర్తిస్తాయి
NAC JEWELLERS
Crafting Bonds of Pure Love Since 1973
నెం.40, MG రోడ్, లబ్బీపేట, విజయవాడ, ఆంధ్రప్రదేశ్
కస్టమర్ కేర్: 044 4399 6666 / +91 95974 57555
ఇప్పుడు ఆన్‌లైన్‌లో కొనండి www.nacjewellers.com

నమస్తే ఆంధ్ర.కామ్
VOICE OF TELUGU PEOPLE
NAMASTEANDHRA.COM
FOR THE STATE # OF THE STATE # BY THE STATE
JUL 2025

# సంపద సృష్టి ఇదీ!

**రాష్ట్రానికి తరలివస్తున్న పరిశ్రమలు**
**తయారీ, పర్యాటకం, ఇంధన రంగాల్లో**
**రూ.32,271 కోట్ల పెట్టుబడులు**
**చంద్రబాబు వచ్చిన ఏడాదిలోపే**
**6 ఎస్ఐపీబీ సమావేశాలు**
**76 ప్రాజెక్టులకు ప్రభుత్వ ఆమోదం**
**మొత్తంగా 4,95,796 కోట్ల పెట్టుబడులు**
**4.5 లక్షల ఉద్యోగావకాశాలు**

సంపద సృష్టి అంటే.. తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకుని.. పారిశ్రామికవేత్తలతో క్విడ్ ప్రో కోకు పాల్పడి.. ఊరూ పేరూ లేని తన కంపెనీల్లో వేల కోట్లు పెట్టుబడిగా పెట్టించడం కాదు.. అధికార మదంతో ప్రతి రోజూ సాయంత్రమయ్యేసరికి మద్యం, ఇసుక ఆదాయంలో ముడుపులు తీసుకోవడం కాదు.. కంపెనీల యజమానుల గొంతుపై కత్తిపెట్టి బలవంతంగా వాటాలు రాయించుకోవడం కాదు.. సంపద సృష్టి అంటే.. రాష్ట్రానికి పెట్టుబడులు ఆహ్వానించడం.. ఆ పెట్టుబడులతో వచ్చే పరిశ్రమల్లో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం.. ప్రజలు కష్టపడి సంపాదించుకునే వెసులుబాటు కల్పించడం.. వారి వినిమయ శక్తిని పెంపొందించడం.. పన్నుల ఆదాయం పెంచడం.. తెచ్చిన అప్పులను ప్రభుత్వ ఆస్తులు కూడగట్టుకునేలా చేయడం. జగనన్నకు ఇలాంటివి చెబితే అసలు చెవికెక్కించుకోరు. ఎందుకంటే ఆయన దృష్టిలో సంపద సృష్టి అంటే.. రూ.వేల కోట్ల ప్రజాధనాన్ని సొంత ఆస్తులుగా మార్చుకోవడం. ఐదేళ్ల ధ్వంసమైన రాష్ట్రాన్ని గాడినపెట్టేందుకు.. పెద్దఎత్తున పెట్టుబడులను ఆకర్షించడానికి చంద్రబాబు పడుతున్న కష్టం అంతా ఇంతా కాదు. కేంద్రం నుంచి నిధులు, గ్రాంట్లు విడుదల చేయించుకోవడంతో ఆయన సంతృప్తి చెందడం లేదు. ప్రభుత్వపరంగానే గాక ప్రైవేటు రంగంలోనూ ఉపాధి అవకాశాల కల్పన కోసం రాష్ట్రానికి తరలివచ్చేలా పారిశ్రామికవేత్తలను ఒప్పించడానికి నానా ఇబ్బందులు పడుతున్నారు. ఆయనపై అభిమానంతో రూ.వేల కోట్లు పెట్టుబడిగా పెట్టడానికి ఇన్వెస్టర్లు ఆసక్తిగా ఉన్నా.. మళ్లీ జగన్ అధికారంలోకి వస్తే పరిస్థితేంటన్న భయం వారిలో ఇంకా ఎక్కువగా ఉంది. ఐదేళ్ల చేసిన విధ్వంసం చూసిన జనం ఆయనకు రెండో చాన్సు ఇవ్వరని వారికి నచ్చజెప్పడం బ్రహ్మప్రళయంగా మారింది. అయినప్పటికీ తన కృషి సాగిస్తున్నారు. చంద్రబాబు అమలు చేస్తున్న స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు ఆకర్షితులవుతున్న పలువురు ఇన్వెస్టర్లు పెట్టుబడులకు ముందుకొస్తున్నారు. తక్షణమే ఉపాధి కల్పించే పరిశ్రమలు పెడితే అధిక రాయితీలిస్తామని సీఎం ప్రతిపాదించడంతో.. తయారీ, పర్యాటకం, ఇంధన రంగాల్లో 19 సంస్థలు తాజాగా పెట్టుబడుల ప్రతిపాదనలను రాష్ట్రప్రభుత్వం ముందు ఉంచడం.. వాటిని పరిశీలించిన కేబినెట్ తక్షణమే ఆమోదించడం చకచకా జరిగిపోయాయి. జగన్ తన ఏలుబడిలో కేవలం ఐదు రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు (ఎస్ఐపీబీ) సమావేశాలు నిర్వహిస్తే.. చంద్రబాబు సారథ్యంలోని టీడీపీ కూటమి ప్రభుత్వ హయాంలో ఏడాదిలోపే ఆరు సార్లు ఈ భేటీలు జరిగాయి. 76 ప్రాజెక్టులకు ఆమోదముద్ర పడింది. మొత్తం రూ.4,95,796 కోట్ల పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్ లభించింది. ఇవి గ్రౌండ్ అయితే ఏకంగా 4.5 లక్షల ఉద్యోగాలు లభిస్తాయని అంచనా.



### 35,371 ఉద్యోగాలు.. 32,271 కోట్ల పెట్టుబడులు

గత నెలలో జరిగిన ఆరో ఎస్ఐపీబీ సమావేశంలో మొత్తం రూ.32,271 కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలకు అంగీకారం తెలుపగా.. మంత్రివర్గం ఐదు రోజుల వ్యవధిలోనే ఆమోదించడం కీలక పరిణామం. ఈ పెట్టుబడులు వాస్తవ రూపం దాలిస్తే 35,371 మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయి.

### పరిశ్రమలకు భూకేటాయింపులు, రాయితీలు..

అగ్రి కెమికల్స్, ఫైన అండ్ స్పెషాలిటీ కెమికల్స్ తయారీ పరిశ్రమకు గ్రీనఫీల్డ్ సదుపాయం కల్పించడం కోసం డెక్కన ఫైన కెమికల్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు 7,608 ఎకరాలు కేటాయించాలని చంద్రబాబు నిర్ణయించారు. ఈ ప్రాజెక్టు కోసం డెక్కన ఫైన కెమికల్స్ రూ.2,560 కోట్లు పెట్టుబడిగా పెడుతుంది. 1,800 మందికి ఉపాధి కల్పిస్తుంది. భారత ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్) రూ.1400 కోట్ల పెట్టుబడితో డిఫెన్స సిస్టమ్ ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్‌ను స్థాపించేందుకు ముందుకొచ్చింది. 800 మందికి ఉద్యోగాలు దక్కే అవకాశం ఉండడంతో రాష్ట్ర కేబినెట్ ఆమోదించింది. అలాగే కర్నూలు జిల్లా ఓర్వకల్లులో పీయూఆర్ ఎనర్జీ రూ.1200 కోట్ల పెట్టుబడితో 1200 మందికి ఉపాధి కల్పించేలా ఎలక్ట్రిక్ వెహికల్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చింది. టైలర్‌మేడ్ ఇన్సెంటివ్ విధానంలో దానికి 115 ఎకరాలు కేటాయించారు. ఇంటర్మీడియట్ మాన్యుఫాక్చరింగ్ ఫెసిలిటీ సెంటర్‌ను స్థాపించేందుకు ముందుకొచ్చిన బ్లూజెట్ హెల్త్ కేర్ లిమిటెడ్‌కు రాయితీ మీద 125.12 ఎకరాలు కేటాయించాలని నిర్ణయించారు. ఈ ప్రాజెక్టులో రూ.1,750 కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు, 1750 మందికి ఉద్యోగాలు ఇచ్చేందుకు సంస్థ ముందుకొచ్చింది. జూపిటర్ రెన్యువబల్స్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.2,700 కోట్ల పెట్టుబడితో 2,216 మందికి ఉపాధిని కల్పించేలా 4.8 మెగావాట్ల సోలార్ సెల్, 1.5 మెగావాట్ల మాడ్యూల్స్ తయారీ చేస్తామని ప్రతిపాదించింది. ఏపీఐడీపీ విధానం మేరకు ఈ ప్రాజెక్టుకు అవసరమైన భూమిని కేటాయించేందుకు కేబినెట్ ఆమోదించింది. ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే.

**రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్న పారిశ్రామికవేత్తలకు పెద్దపీట వేసేలా, ప్రాజెక్టులు కార్యరూపం దాల్చేలా డ్యాష్‌బోర్డు ద్వారా నిరంతర పర్యవేక్షణ అవసరమని ముఖ్యమంత్రి స్పష్టంచేశారు. ఒప్పందాలు చేసుకున్న సంస్థల పనుల పురోగతిపై అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.**

### అధికార యంత్రాంగంలో సంతృప్తి

ఇప్పటివరకూ జరిగిన ఆరు ఎస్ఐపీబీ సమావేశాల్లో 76 ప్రాజెక్టుల ద్వారా రూ.4,95,796 కోట్ల పెట్టుబడులు, 4,50,934 మందికి ఉద్యోగాల కల్పన లక్ష్యంగా ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేయడంపై ఉన్నతాధికార యంత్రాంగం

సంతృప్తి వ్యక్తం చేస్తోంది. అయితే ఇక్కడ కీలకమైన అంశం ఏమిటంటే.. పరిశ్రమలకు శంకుస్థాపన నుంచి ఉత్పత్తి చేపట్టే దాకా నిరంతరం వారే పరిశీలించాలి. ఇందుకోసం నోడల్ అధికారులను ఏర్పాటు చేసుకోవాలి. క్షేత్రస్థాయిలో ప్రాజెక్టు ఏ దశలో ఉందో తెలుసుకోవాలి. ప్రతి సంస్థ ఎంత పెట్టుబడులు పెడుతుంది.. ఎంత మందికి ఉద్యోగాలు ఇస్తుంది.. వంటి విషయాలను ఒక పోర్టల్ ద్వారా రాష్ట్ర ప్రజలకు తెలియజేయాలి. ప్రపంచ శ్రేణి దిగ్గజ సంస్థలకు ప్రోత్సాహకాలు ఇవ్వడంపై రాజకీయంగా చేస్తున్న విమర్శలను సమర్థంగా తిప్పికొట్టాలి. పరిశ్రమలు రావడం వల్ల స్థానికంగా వచ్చే ఉద్యోగాలు, అభివృద్ధి, రాష్ట్రానికి వచ్చే ఆదాయాలపై ప్రజల్లో నిరంతరం అవగాహన కల్పిస్తూ ఉండాలి. కొత్త పరిశ్రమలను ప్రోత్సహించడంతో పాటు ఉన్న పరిశ్రమలు ఖాయిలా పడకుండా చూడాలి.

**జగన్ శోకాలు!**

కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది తిరక్కముందే దరిదాపుగా రూ.5 లక్షల కోట్ల పెట్టుబడులకు ఇన్వెస్టర్లు ముందుకు రావడం జగన్ సహించలేకపోతున్నారు. ఆయా కంపెనీలపై దుష్ప్రచారం సాగిస్తూనే రాష్ట్ర ఆదాయ వ్యయాలపై తన పత్రికలో అబద్ధాలు అచ్చువేయిస్తున్నారు. చంద్రబాబు హయాంలో రాష్ట్ర ఆదాయం తగ్గిపోతోందని రాయిస్తున్నారు. అప్పులే తప్ప ఆదాయం లేదని.. తన హయాంలో మాత్రం అంతా వెలిగిపోయిందని నిస్సిగ్గుగా కథనాలు రాయించారు. ఆదాయం తగ్గడం నిజమేనని.. అయితే అది రాష్ట్ర ప్రభుత్వం ఆదాయం కాదని.. జగన్ సొంత ఆదాయమని ప్రభుత్వ వర్గాలు మండిపడుతున్నాయి. ఆయన అధికారంలో ఉన్నప్పుడు సొంత మీడియాకు అడ్డగోలుగా ప్రకటనల రూపంలో కొన్ని వందల కోట్లు సమర్పించుకున్నారు. ఇక మద్యం, ఇసుకలో వేల కోట్లు ముడుపుల ఆరోపణలు సరేసరి! వెరసి... జగన్ సొంత ఆదాయం పడిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం రాబడి ఏమాత్రం తగ్గలేదు. పైగా పెరిగింది. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 2023-24తో పోలిస్తే.. చంద్రబాబు పాలనలో 2024-25లో రెవెన్యూ రాబడి, కేంద్ర గ్రాంట్లు తగ్గాయని జగన్ మీడియా ఆ మధ్య కథనాలు ప్రచురించింది. 2024-25 ఆర్థిక సంవత్సర గణాంకాలను కాగ్ వెల్లడించిందంటూ అర్ధ సత్యాలు, అసత్యాలతో ప్రజల్ని మభ్యపెట్టే యత్నం చేసింది. 'జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 2023-24లో రెవెన్యూ రాబడి రూ.1,73,963 కోట్లు. చంద్రబాబు సీఎం అయ్యాక 2024-25లో రెవెన్యూ రాబడి రూ.1,68,443 కోట్లు. ఆదాయం రూ.5,520 కోట్లు పడిపోయింది' అని రాసింది. వాస్తవం ఏంటంటే.. రాష్ట్ర విభజన తర్వాత 2014-15లో కేంద్రం నుంచి రావాల్సిన రెవెన్యూ లోటు గ్రాంటు 2023-24లో రూ.10,460 కోట్లు వచ్చింది. దీనికి తోడు 15వ ఆర్థిక సంఘం సిఫారసు మేరకు 2023-24లో రూ.2,691 కోట్ల నిధులు వచ్చాయి. ఆ ఆర్థిక సంఘం నుంచి కొన్నేళ్లపాటు రావలసిన నిధులన్నింటినీ.. ఎన్నికల ముందు జగన్ సర్కారు ఒకేసారి తీసేసుకుంది. దీంతో... 2023-24లో రెవెన్యూ రాబడి బాగా పెరిగినట్లు కనిపిస్తోంది. కేంద్రం ఇచ్చిన రెవెన్యూ లోటు గ్రాంటు రూ.10,460 కోట్లు, ఆర్థిక సంఘం సిఫారసు మేరకు వచ్చిన నిధులు రూ.2,691 కోట్లు.. మొత్తం దాదాపు 13,151 కోట్లు మినహాయిస్తే.. జగన్ ప్రభుత్వంలో 2023-24లో వచ్చిన రెవెన్యూ రాబడి రూ.1,60,813 కోట్లు మాత్రమే. చంద్రబాబు సీఎం అయ్యాక 2024-25లో రెవెన్యూ రాబడి రూ.1,68,443 కోట్లు. అంటే... జగన్ ప్రభుత్వంతో పోలిస్తే చంద్రబాబు హయాంలో ఏడాదిలో 4.74 శాతం ఎక్కువే.

**12.49 శాతం వృద్ధిరేటు**

రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సామాజిక, ఆర్థిక సర్వేలో వివిధ అంచనాలను పొందుపరచింది. 12.94 శాతం వృద్ధిరేటుతో రూ.16.06 లక్షల కోట్ల జీఎస్‌డీపీ నమోదవుతుందని పేర్కొంది. వ్యవసాయం రంగంలో 15.86 శాతం వృద్ధిరేటుతో రూ.5.19 లక్షల కోట్ల జీవీఏ, పారిశ్రామిక రంగంలో 6.71 శాతం వృద్ధిరేటుతో రూ.3.41 లక్షల కోట్ల జీవీఏ, సేవా రంగంలో 11.7 శాతం వృద్ధిరేటుతో రూ.6.11 లక్షల కోట్ల జీవీఏ నమోదవుతుందని అంచనా వేసింది. ఆక్వాకల్చర్ రంగంలో 16 శాతం వృద్ధిరేటు, పారిశ్రామిక ఉత్పాదక విభాగంలో 6.57 శాతం వృద్ధి, నిర్మాణ రంగంలో 10.47 శాతం, సేవా రంగంలో కమ్యూనికేషన్స్ విభాగంలో 15.28 శాతం, బ్యాంకింగ్, బీమా రంగాల్లో 14.6 శాతం వృద్ధిని ఆశిస్తోంది.

**పుంజుకున్న జీఎస్టీ వసూళ్లు**

జగన్ పాలనలో చివరి సంవత్సరంలో అంటే 2023-24లో రాష్ట్రంలో జీఎస్టీ వసూళ్లు తగ్గాయి. గత ఏడాది జూన్‌లో చంద్రబాబు అధికారంలోకి వచ్చాక నెమ్మదిగా అన్ని రంగాల్లో కార్యకలాపాలు ఊపందుకోవడం ప్రారంభమైంది. ఆ ప్రభావం ఆ ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలల్లో జీఎస్టీ వసూళ్లపై పడింది. అందుకే గత 10 నెలల్లో అత్యధికంగా ఫిబ్రవరిలోనే జీఎస్టీ వసూలైంది. రాష్ట్రంలో ఆర్థికపరమైన కార్యకలాపాలు ఊపందుకున్నాయనడానికి ఇదే సంకేతం. స్థూలంగా ఫిబ్రవరిలో జీఎస్టీ వసూళ్లు 3.79 శాతం పెరిగాయి. 2023-24 నవంబరులో రూ.4,093 కోట్ల జీఎస్టీ వసూలు కాగా.. 2024-25 లో రూ.3,699 కోట్లకు తగ్గాయి. 2024 జనవరిలో రూ.3,587 కోట్లు వసూలు కాగా.. 2025 జనవరిలో రూ.3,603 కోట్లకు చేరాయి. గత ఏడాది ఫిబ్రవరిలో రూ.3,678 కోట్లు వసూలు కాగా, ఈ ఏడాది ఫిబ్రవరిలో రూ.3,817 కోట్లకు పెరిగాయి.?

**సంక్షేమానికి లోటు లేదు**

2014కి ముందు వృద్ధులు, వితంతువులకు సామాజిక పింఛను రూ.200 వచ్చేది. 2014లో చంద్రబాబు సీఎం కాగానే ఒకేసారి రూ.2,000కి పెంచారు. ఇప్పుడు రెండోసారి రాగానే రూ.4,000కి పెంచిన ఘనత ఆయనకే దక్కింది. దాదాపు 63.36 లక్షల మందికి ప్రతి నెలా పెన్షన్లు పంపిణీ చేస్తున్నారు. ఏడాదికి రూ.32,520 కోట్లు ఖర్చు చేస్తున్నారు. దేశం మొత్తంలో ఆంధ్రప్రదేశ్ మాత్రమే అత్యధికంగా పెన్షన్లు పంపిణీ చేస్తోంది. జూన్‌లో అన్నదాతా సుఖీభవ, తల్లికి వందనం ఇవ్వనుంది. ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలెండర్లు ఇస్తోంది. ఎన్ని ఇబ్బందులున్నా సంక్షేమానికి లోటులేకుండా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

# మెగా పెన్షన్ స్టార్!

## సినిమాల్లో సంపాదిస్తున్న రూ.కోట్లు చాలనట్టు.. అటు ఎంపీ పెన్షన్.. ఇటు ఎమ్మెల్యే పింఛనూ



మెగాస్టార్ చిరంజీవి అంటే తెలియని వారు ఉండరు. ఎటువంటి బ్యాక్‌గ్రౌండ్ లేకుండా చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టిన చిరంజీవి.. తనదైన ప్రతిభా, పట్టుదలతో స్టార్ హీరోగా ఎదిగారు. దేశం మెచ్చిన నటుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు. వేల కోట్ల ఆస్తులు సంపాదించారు. అంతటి చిరంజీవీ.. ప్రభుత్వం నుంచి పెన్షన్ తీసుకుంటున్నారు అంటే నమ్ముతారా? కానీ అది నిజం. పైగా రెండు చోట్ల ఆయనకు పెన్షన్ అందుతోంది. గతంలో కొన్నాళ్లు చిరంజీవి రాజకీయాల్లో ఉన్న సంగతి తెలిసిందే. ప్రజారాజ్యం పార్టీని స్థాపించి పాలిటిక్స్‌లోకి ఎంటర్ అయ్యారు. 2009 శాసనసభ ఎన్నికల్లో ప్రజారాజ్యం పోటీ చేసినప్పటికీ.. ఉమ్మడి ఏపీలో ఆ పార్టీకి మూడవ స్థానం మాత్రమే దక్కింది. 2011లో ఆయన ప్రజారాజ్యం పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేశారు. 2009 ఎన్నికల్లో తిరుపతి నియోజకవర్గం నుంచి తొలిసారి అసెంబ్లీకి ఎన్నికైన చిరంజీవి.. 2012లో కేంద్ర మంత్రివర్గంలో చోటు దక్కించుకున్నారు. పర్యాటక శాఖ మంత్రిగా పనిచేశారు.

2014లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసినప్పటికీ ఆయనకు పరాజయం ఎదురైంది. ఆ తర్వాత పాలిటిక్స్‌కు దూరమై పూర్తిగా సినిమాలపై దృష్టి సారించారు. అయితే మాజీ ఎమ్మెల్యేలకు, మాజీ ఎంపీలకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అందించే పెన్షనను మాత్రం ఆయన అందుకుంటున్నారు. తాజాగా ఓ సంస్థ.. మాజీ ప్రజాప్రతినిధుల కోటలో ఏపీ నుంచి పెన్షన్ అందుకుంటున్న వారి జాబితాను సేకరించింది.



ఆ జాబితాలో మెగాస్టార్ చిరంజీవి, కేంద్ర మాజీ మంత్రి, ప్రస్తుత గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు, నాదెండ్ల భాస్కర్ రావు వంటి ప్రముఖులు ఉండడం అందరిని విస్మయానికి గురిచేసింది. వీరంతా రాష్ట్ర ప్రభుత్వం నుంచే కాకుండా కేంద్రం నుంచి కూడా పెన్షన్ అందుకుంటున్నారు. పింఛన్లు తీసుకోవడం తప్పు కాదు. నేరం కూడా కాదు. కానీ, బాధ్యతాయుతమైన స్థానాల్లో ఉన్నవారు, రూ.వేల కోట్ల ఆస్తులున్నవారు కూడా ఇలా రెండు చోట్ల నుంచి పింఛన్లు తీసుకోవడం విమర్శలకు దారి తీస్తోంది. దేశ, రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ఏదో ఒక పెన్షన్ తీసుకుంటే ఉత్తమం అని కొందరు హితవు పలుకుతున్నారు.

# భద్రత కల్పిస్తున్నా డ్రామాలే!





ఇంత రక్షణ సీఎంకు కూడా ఉండదు
జగన్‌కు ప్రతిపక్ష నేత హోదా లేకున్నా
కనీవినీ ఎరుగని రీతిలో భారీ భద్రత
ఎక్కడకు వెళ్లినా 500 మందికిపైగా పోలీసుల పహారా
అయినా వారిపైనే మాజీ సీఎం నిందలు
వారి బట్టలూడదీస్తామని బెదిరింపులు
డీఐజీని మాఫియా డాన్‌తో పోల్చిన వైనం

పాపం.. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పరిస్థితి చూస్తే సొంతపార్టీ వాళ్లకు కూడా జాలేస్తోంది. ప్రజలివ్వని ప్రతిపక్ష నేత హోదా కోసం, సీఎంగా ఉన్నప్పుడు తనకున్న భద్రతను కొనసాగించేలా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు ఆయన పడుతున్న పాట్లు అన్నీ ఇన్నీ కావు. ఆయన విన్యాసాలు కోర్టులకు సైతం విస్మయం కలిగిస్తున్నాయి. ఆయన వాదన చిత్రవిచిత్రంగా ఊహకందని విధంగా ఉంటోంది. రాష్ట్రంలో మూడు ప్రధానపార్టీలు టీడీపీ, బీజేపీ, జనసేన సంకీర్ణ ప్రభుత్వంలో ఉన్నాయని.. ఇక మిగిలింది వైసీపీయే గనుక ప్రధాన ప్రతిపక్షంగా దానిని, ప్రధాన ప్రతిపక్ష నేతగా తనను గుర్తించాలని మొండిపట్టు పడుతున్నారు. 175 అసెంబ్లీ స్థానాలకు గాను గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ కేవలం 11 సీట్లలోనే గెలవగలిగింది. అసెంబ్లీలో ప్రతిపక్ష హోదా రావాలంటే పదో వంతు సీట్లయినా రావాలి. అంటే వైసీపీకి 18 స్థానాలు దక్కితే తప్ప ఇవ్వడం సాధ్యం కాదు. 2014, 19 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకే విపక్ష హోదాకు దిక్కులేకుండా పోయింది. 543 స్థానాల లోక్‌సభలో ప్రతిపక్ష హోదా దక్కాలంటే 55 స్థానాలు రావాలి. కానీ ఆ పార్టీకి 2014లో 44, 2019లో 52 మాత్రమే వచ్చాయి. దాంతో ఆ పార్టీ లోక్‌సభాపక్ష నేతకు ప్రతిపక్ష నేత హోదా దక్కలేదు. 2019 ఎన్నికల్లో 99 స్థానాలు రావడంతో ఆ పార్టీ అగ్ర నేత రాహుల్‌గాంధీకి ఆ హోదా దక్కింది. ఈ వాస్తవం జగన్‌కు తెలియక కాదు.. వైసీపీ ఉనికి, తన ఉనికి కాపాడుకోవడానికి ఆయన ఇలాంటి గిమ్మిక్కులు చేస్తున్నారు. తాను అధికారంలో ఉండగా.. ఎన్ఎస్‌జీ రక్షణలో ఉన్న చంద్రబాబుకు ఆకస్మికంగా భద్రత తగ్గించారు. ఇప్పుడు గద్దెనెక్కిన చంద్రబాబు అలాంటి పని చేయలేదు. జగన్‌కు ప్రతిపక్ష హోదా లేకపోయినా మాజీ ముఖ్యమంత్రిగా ఆయనకు భారీ స్థాయి భద్రత కల్పిస్తున్నారు. ఆయన ఇప్పటివరకు జరిపిన పర్యటనల్లో ఎంత మంది పోలీసులతో రక్షణ కల్పించిందీ రాష్ట్రప్రభుత్వం వివరాలు బహిర్గతం చేసింది. వాస్తవానికి ఇలాంటి సున్నితమైన అంశాలు బయటకు చెప్పరు. కానీ జగన్ అసత్య ఆరోపణలతో చేస్తున్న యాగీని జనం ముందు పెట్టడానికి తప్పని పరిస్థితుల్లో వివరాలు తెలియజేసింది. శ్రీసత్యసాయి జిల్లా రాప్తాడు నియోజకవర్గం రామగిరిలో ఓ కుటుండాన్ని పరామర్శించడానికి ఆయన వెళ్లినప్పుడు ఏకంగా 506 మంది పోలీసులతో పాటు ఐదు స్పెషల్ పార్టీ బృందాలు బందోబస్తు నిర్వహించాయి. సత్తెనపల్లి నియోజకవర్గంలో మంది సొమ్మును బెట్టింగ్‌ల్లో పెట్టి అప్పులపాలై ఆత్మహత్య చేసుకున్న రెంటపాళ్ల ఉపసర్పంచ్ కుటుంబాన్ని ఏడాది తర్వాత పరామర్శించడానికి ఇటీవల ఆయన వెళ్లినప్పుడు 679 మంది పోలీసులు, 15 రోప్ పార్టీలు.. గుంటూరు మిర్చియార్డు సందర్శన సందర్భంగా 123 మంది.. తెనాలిలో గంజాయి బ్యాచ్ పరామర్శకు వెళ్లినప్పుడు 122 మంది.. పొదిలిలో మహిళలపై వైసీపీ మూకలు రాళ్లదాడి చేసినప్పుడు 156 మంది.. శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల పర్యటనలో 394 మందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. మరోవైపు పులివెందులలో జగన్ ఇంటి వద్ద నిత్యం 71 మంది రక్షణగా ఉంటారు. తాడేపల్లి ప్యాలెస్ వద్ద కూడా అంతే. అయినా తనకు రక్షణ లేదంటూ ఆయన గగ్గోలుపెడుతున్నారు. పోలీసులు వద్దన్నా పర్యటనలకు వెళ్లడం.. బలప్రదర్శనలు నిర్వహించడం.. వారికో రూట్‌మ్యాప్ ఇచ్చి.. వేరే రూట్లో పోవడం.. పోలీసులను నెట్టేసుకుని కార్యకర్తలు తన వద్దకు వచ్చేలా నాటకాలు ఆడడం ఆయనకే చెల్లుతోంది. పైగా గంజాయి, రౌడీ బ్యాచ్‌ల పరామర్శలకు వెళ్లి.. మూడున్నరేళ్లలో తానే అధికారంలోకి వస్తానని.. పోలీసుల బట్టలు ఊడదీయిస్తానని.. రిటైరైనా సప్తసముద్రాల అవతల ఉన్నా లాక్కొచ్చి శిక్షిస్తానని బెదిరించడం దేనికి సంకేతం?

### జడ్ ప్లస్ హక్కు కాదు..

'నేను మాజీ ముఖ్యమంత్రిని.. జడ్ ప్లస్ రక్షణ నా హక్కు.. ప్రజల తరఫున ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నందుకు నన్ను అంతం చేయాలని చూస్తున్నారు' అంటూ జగన్ బిల్డప్ ఇస్తున్నారు. కానీ సెక్యూరిటీ కమిటీ సిఫారసు మేరకే ఎవరికైనా పోలీసులు రక్షణ కల్పిస్తుంటారు. జడ్ ప్లస్ రక్షణ అనేది హక్కు కాదు. సెక్యూరిటీ కమిటీ వివిధ కోణాల్లో విచారించి నిర్ణయిస్తుంది. తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చేసిందేంటో జగన్ ఉద్దేశపూర్వకంగానే మరచిపోయారు. ప్రాణహాని ముప్పున్న నేతల్లో చంద్రబాబు దేశంలో తొమ్మిదో స్థానంలో ఉన్నారు. 2003లో అలిపిరిలో ఆయనపై క్లెమోర్ మైన్స్ పేల్చి హత్యాయత్నం చేసినప్పటి నుంచి ఎన్ఎస్‌జీ భద్రత కల్పిస్తున్నారు. కానీ 2019లో జగన్ గద్దెనెక్కగానే ఆయన రక్షణను ఆకస్మికంగా తగ్గించారు. దీనిపై ఆయన కోర్టుకు వెళ్తే సెక్యూరిటీ రివ్యూ కమిటీ సిఫారసు మేరకే తగ్గించామని నాటి అడ్వకేట్ జనరల్ కోర్టులో చెప్పారు. న్యాయస్థానం సీరియస్ అవడంతో ఆ ఏడాది ఆగస్టులో చంద్రబాబుకు భద్రతను పునరుద్ధరించారు. ఉమ్మడి రాష్ట్ర చివరి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి సెక్యూరిటీని జగన్ కేవలం 2o2కి తగ్గించారు. మాజీ సీఎంగా తనను గౌరవించాలని కోరుతున్న జగన్‌కు ఇదెందుకు గుర్తులేదు? ముఖ్యమంత్రిగా, గవర్నర్‌గా పనిచేసిన కొణిజేటి రోశయ్య స్వర్గస్థులైతే ఆయన భౌతిక ఖాయానికి నివాళులు కూడా అర్పించని ఈయన.. తనను గౌరవించాలని అడుక్కోవడం చూస్తుంటే.. దెయ్యాలు వేదాలు వల్లించినట్లే ఉంది. వైసీపీ స్థానిక నేతలు అడిగిన మేరకు పర్యటనల్లో జగన్‌కు పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. కానీ వారు  చెప్పింది కనీసం లెక్కచేయరు. పరామర్శల పేరుతో బల ప్రదర్శనలు నిర్వహిస్తూ కారుతో దళితుడిని తొక్కించి చంపించేస్తారు. నిరసనలు తెలిపే మహిళలపై వైసీపీ శ్రేణులతో రాళ్ల దాడులు చేయిస్తారు.. తిరిగి పోలీసులపై అభాండాలు వేస్తున్నారు. జనం విస్మరించారేమోనన్న భయంతో.. పదే పదే మాజీ ముఖ్యమంత్రినని గుర్తుచేస్తుంటారు.

### బాబు, పవన్‌ను నాడు అడ్డుకోలేదు..

తన పర్యటనలకు చంద్రబాబు ఆంక్షలు పెడుతున్నారని.. మేమేనాడైనా ఆయన్ను, పవన్ కల్యాణ్‌ను, లోకేశ్‌ను అడ్డుకున్నామా అని జగన్ అమాయకంగా అడుగుతున్నారు. వారి ముగ్గురి విషయంలో ఆయన చేసిన అక్రమాలు అన్నీ ఇన్నీ కావు. ఆ ఐదేళ్లలో చంద్రబాబును సొంత నియోజకవర్గం కుప్పం కూడా వెళ్లనివ్వలేదు. అయినా ఆయన వెళ్తే నాటి డీఎస్పీ సుధాకర్‌రెడ్డి ఆయన్ను ఎలా అడ్డుకుని అవమానించారో.. తిరుపతి విమానాశ్రయంలో ఎనిమిది గంటలు ఏ విధంగా నిర్బంధించారో.. అయ్యన్నపాత్రుడి కుమారుడి పెళ్లికి నర్సీపట్నం వెళ్తుంటే విశాఖపట్నంలో వైసీపీ మూకలు సృష్టించిన వీరంగం.. తూర్పుగోదావరి జిల్లా అనపర్తి నియోజకవర్గంలో చంద్రబాబు వెంట ఎంతమంది జనంఉన్నారో బయటి ప్రపంచానికి తెలియకుండా దాచడానికి.. లారీలు అడ్డుపెట్టి ఆయన్ను చీకట్లో నడిపించిన వైనం.. ఉండవల్లి నివాసం నుంచి బయటకు రానివ్వకుండా గేట్లకు తాళ్లు కట్టడం.. జనవాణి పేరుతో విశాఖపట్నం వెళ్లిన పవన్ కల్యాణ్‌ను హోటల్ నుంచి బయటకు రాకుండా అడ్డుకోవడం.. అర్ధరాత్రి 70 మంది జనసేన కార్యకర్తలను పోలీసులతో, వైసీపీ కార్యకర్తలతో బెల్టులతో కొట్టించి.. తిరిగి వారిపైనే హత్యాయత్నం కేసులు పెట్టించడం.. పవన్ గుంటూరు జిల్లా ఇప్పటం గ్రామానికి వెళ్తుంటే అడ్డుకోవడం.. రాష్ట్రంలోకి వస్తున్న జనసేన అధ్యక్షుడిని రాష్ట్ర సరిహద్దుల్లో రోడ్డుపై కూర్చోబెట్టడం.. నరసరావుపేటలో అనూష అనే యువతిని శ్రీకాంతరెడ్డి అనే వైసీపీ నేత హత్య చేస్తే పరామర్శకు వెళ్తున్న లోకేశ్‌ను అడ్డుకోవడం.. దళిత యువతి రమ్య హత్యకు గురైతే కుటుంబాన్ని పరామర్శించేందుకు ఆయన వెళ్తుంటే పోలీసు జీపు ఎక్కించి కృష్ణా జిల్లాలోని మారుమూల పోలీసు స్టేషన్‌కు తరలించడం.. యువగళం పాదయాత్రలో అడుగడుగునా ఇబ్బంది పెడుతూ మైకులు, వాహనాలు సీజ్‌చేసి.. నిలుచోడానికి స్టూలు కూడా లేకుండా తీసుకుపోవడం.. హైకోర్టు అనుమతితో న్యాయస్థానం నుంచి దేవస్థానం వెళ్తున్న అమరావతి మహిళా రైతులను నెల్లూరు జిల్లాలో ఇబ్బందులకు గురిచేసిన కాకాణి గోవర్ధన్‌రెడ్డికి, చంద్రబాబు ఇంటిపై దాడి చేసిన జోగి రమేశ్‌కు మంత్రి పదవులు ఇవ్వడం.. ఇవన్నీ జగన్ విస్మరించినా జనం ఎప్పటికీ విస్మరించరు.

### డీఐజీ మాఫియా డాన!

సమర్థంగా పనిచేసే పోలీసు అధికారులను తన హయాంలో పక్కనపెట్టిన జగన్.. ఇప్పుడు అధికారం పోయాక వారినే టార్గెట్ చేశారు. రాష్ట్రంలో డీఐజీలు మాఫియా డానలలా వ్యవహరిస్తున్నారని అన్యాయంగా ఆరోపించారు. తన పార్టీ నేతల అక్రమాలను వారికి ఆపాదిస్తూ తానొస్తే చర్యలు  తీసుకుంటానని బెదిరింపులకు దిగుతున్నారు. డీఐజీ పరిధిలోని జిల్లాల్లో లిక్కర్ అమ్మాలన్నా.. బెల్టు షాపులు నిర్వహించాలన్నా.. ఇసుక తవ్వాలన్నా.. మట్టి ఎత్తుకెళ్లాలన్నా డబ్బులు వసూలు చేసి.. ఆ సొమ్మును అధికార పార్టీ ఎమ్మెల్యేలకు ముట్టజెబుతున్నారని అన్నారు. ఇవన్నీ చూసి భరించలేక సిద్ధార్థ్ కౌశల్ వంటి కొందరు ఐపీఎస్ అధికారులు రాజీనామా చేసి వెళ్లిపోతున్నారని చెప్పారు. ఇది కూడా పచ్చి అబద్ధం. జగన్ హయాంలో కౌశల్ ఎస్పీగా పనిచేసినప్పుడు ఆయా జిల్లాల వైసీపీ నేతలు ఆయనపై ఆరోపణలు గుప్పించి బదిలీచేయించేవారు. చంద్రబాబు వచ్చాక ఆయన్ను డీజీపీ ఆఫీసులో అడ్మిన్ ఎస్పీగా నియమించారు. జగన్ ఆరోపణలను కౌశల్ సైతం ఖండించారు. చంద్రబాబు గతంలో కూడా తనకెన్నో కీలక బాధ్యతలు అప్పగించారని.. వ్యక్తిగత కారణాల వల్లే తాను రాజీనామా చేశానని వివరణ ఇచ్చారు. అయితే రిలయన్స్ కంపెనీలో ఏఐ ఆధారిత విభాగంలో పనిచేసేందుకే  కౌశల్ ఐపీఎస్‌కు రాజీనామా చేసినట్లు తెలుస్తోంది. ఆయనతో పాటు మధ్యప్రదేశ్, బిహార్‌లలో ఐపీఎస్‌లుగా పనిచేస్తున్న మరో ఇద్దరు కూడా అధికారులు కూడా వీఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్నారని ప్రచారం జరుగుతోంది. వీటన్నిటినీ మరుగుపరచి.. తన అడ్డగోలు అక్రమాల నుంచి జనం దృష్టి మళ్లించడానికి జగన్ ఎన్ని విన్యాసాలు చేసినా వారు నమ్మరని ఆయనకు ఎప్పటికి అర్థమవుతుందో!








# ఏపీ ప్రభుత్వ సలహాదారుగా డాక్టర్ రవి వేమూరు ప్రమాణ స్వీకారం!





ఎన్నారై వ్యవహారాలు, సేవలు, పెట్టుబడుల విభాగానికి ఆంధ్రప్రదేశ ప్రభుత్వ సలహాదారుడిగా బాధ్యతలను డాక్టర్ రవి వేమూరు స్వీకరించారు. తాడేపల్లిలోని ఏపీఎన్నార్టీఎస్ కార్యాలయంలో వేద పండితుల ఆశీర్వచనాల నడుమ ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి వేమూరు కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రపంచంలో తెలుగువారు ఎక్కడున్నా నెంబర్ వనగా ఉండాలన్న సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌ల లక్ష్యాలకు అనుగుణంగా పని చేస్తానని ఆయన పేర్కొన్నారు. పలు దేశాలలోని ప్రవాసాంధ్రుల సంక్షేమం, నవ్యాంధ్రప్రదేశ అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఏపీ అభివృద్ధిలో, పీ-4 కార్యక్రమంలో ఎన్నారైలను భాగస్వాములను చేయడమే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఉద్యోగులుగానే ఉన్న ఎన్నారైలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక ప్రణాళిక రచించామని చెప్పారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన ద్వారా.. ప్రపంచంలోని వివిధ దేశాలలో చదువుకుంటున్న తెలుగు విద్యార్థులకు మెరుగైన ఉద్యోగావకాశాలు లభించేలా శిక్షణా కార్యక్రమాలు చేపడతామన్నారు.



అమరావతిలో ఎన్నారై ఐకానిక్ టవర్ నిర్మాణాన్ని రెండేళ్లలో పూర్తి చేస్తామని డాక్టర్ రవి వేమూరు ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఏపీఎనఆర్‌టీ వారధిగా ప్రవాసాంధ్రుల కోసం ప్రత్యేక ఇన్సూరెన్స పథకాలు తెస్తామని చెప్పారు. విదేశాల్లో తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ప్రోత్సహించేందుకు శ్రీవారి కల్యాణం వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ఎన్నారైల పెట్టుబడులను ఆకర్షించడంలో ఏపీఎనఆర్‌టీ కీలక వేదికగా నిలుస్తుందని చెప్పారు. కాగా.. ఈ కార్యక్రమానికి టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, టీడీపీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ యాదవ్, టీడీపీ ఎమ్మెల్యేలు నక్కా ఆనందబాబు, ఇంటూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, బ్రాహ్మణ సాధికార సమితి అధ్యక్షులు బుచ్చి రాం ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ పరుచూరి అశోక్ బాబు, ఏపీఎనఆర్టీ సొసైటీ సీఈవో హేమలత రాణి, ఏపీ ఎనఆర్టీఎస్ డైరెక్టర్లు శేషుబాబు కానూరి, శాంతి, ఎన్నారై టీడీపీ గల్ఫ్ విభాగం అధ్యక్షుడు రాధాకృష్ణ రవి, ఎన్నారై టీడీపీ కువైట్ విభాగం అధ్యక్షుడు నాగేంద్ర బాబు అక్కిలి, ఓఎస్డీ, ఏపీ ఎన్నార్టీ ప్రెసిడెంట్ డీవీ రావు, డాక్టర్ మురళీ నన్నపనేని, రవి శాఖమూరి, ప్రభాకర్, ఫైనాన్స మేనేజర్, ఏపీ ఎన్నార్టీ స్టాఫ్, డాక్టర్ రవి వేమూరు శ్రేయోభిలాషులు, పలువురు ఎన్నారైలు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.










# కేటీఆర్ మెడకు ఈ-కార్ ఉచ్చు!

**కేబినెట్ ఆమోదం లేకుండానే చెల్లింపులకు ఆదేశాలు**
**అది కూడా ఎన్నికల కోడ్ అమల్లో ఉండగానే**
**తుది దశకు ఏసీబీ దర్యాప్తు**
**ఉచ్చు బిగుస్తుండడంతో నిరాశానిస్పృహలు**
**సీఎం రేవంతరెడ్డిపై పచ్చిబూతులు**
**మీడియాపైనా దాడికి బరితెగింపు**
**ఇంకా ఇంకా చేస్తామని అహంకారం**
**ఆంధ్రామీడియా అంటూ విషం**
**ఫాంహౌస్‌లో ఉండి కేసీఆర్ నిర్దేశం**

తన సంతానంపై అవినీతి ఆరోపణలను భారత రాష్ట్ర సమితి(బీఆర్ఎస్), తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ సహించలేకపోతున్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం, హ్యాట్రిక్ కొట్టే చాన్సు పోవడంతో తెలంగాణ జాతిపిత ఖిన్నుడయ్యారు. ఓడించిన ప్రజలపై రగిలిపోతున్నారు. ఆయన సీఎంగా ఉండగానే... ఢిల్లీ మద్యం పాలసీ స్కాం కేసులో కుమార్తె కవిత నెలల తరబడి తిహార్ జైల్లో మగ్గాల్సి వచ్చింది. ఆమెను బయటకు తీసుకురావడానికి తెరవెనుక కేంద్ర బీజేపీ పెద్దలతో మంత్రాంగం సాగించారు. ఆ పార్టీతో పరోక్ష పొత్తుకు కూడా సంకేతాలిచ్చారు. కానీ సత్ఫలితాలివ్వలేదు. కుమారుడు కేటీఆర్‌ను సీఎంగా చూడాలన్న కల నెరవేర్చుకోవడానికి ఎన్నికలను ఎదుర్కోవడం ఒక్కటే మార్గం. అందుకు ఇంకో మూడేళ్లుపైనే ఆగాలి. అటు తన హయాంలో జరిగిన అవినీతిని రాష్ట్రంలో రేవంతరెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కటొక్కటిగా బయటపెడుతోంది. ముఖ్యంగా కేటీఆర్ మెడకు ఈ-కార్ రేసు స్కాం చుట్టుకుంది. నిబంధనలను తుంగలో తొక్కి మంత్రివర్గ ఆమోదం లేకుండా.. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పటికీ అస్మదీయ కంపెనీకి రూ.కోట్లు చెల్లించాలని అధికారులను ఆయన ఆదేశించిన వైనం బహిర్గతమైంది. ఈ కుంభకోణం జాతీయ స్థాయిలో సంచలనంగా మారడం.. ఏసీబీ తన కుమారుడిని రెండోసారి విచారణకు పిలవడం కేసీఆర్‌ను మరింత ఆందోళనకు గురిచేస్తోంది. కుమారుడిని కూడా అరెస్టు జైల్లో పెడతారన్న ఊహనే ఆయన తట్టుకోలేకపోతున్నారు. అందుకే రేవంతను వ్యక్తిగతంగా టార్గెట్ చేయిస్తున్నారు. ప్రభుత్వం, పార్టీలు, మీడియాపై తమ నేతలు, శ్రేణులను తిరుగుబాటుకు ప్రేరేపిస్తున్నారు. తొమ్మిదిన్నరేళ్లు ఫాంహౌస్‌లోనే ఉండి రాజ్యమేలిన ఆయన.. ప్రతిపక్షంలోకి వచ్చినా దాని నుంచి బయటకు రావడం లేదు. అక్కడి నుంచే దాడులకు ఆదేశిస్తున్నారు.

### ఏసీబీ ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి..



ఫార్ములా ఈ-కార్ రేసింగ్ వ్యవహారంలో నిధుల దుర్వినియోగంపై నమోదు చేసిన కేసులో కేటీఆర్‌ను ఏసీబీ జూన్ 16న పిలిపించి విచారించింది. గతంలో విచారణకు హాజరైనప్పుడు అడిగిన ప్రశ్నలకు ఆయన ఇచ్చిన జవాబులను.. ఎఫ్ఈవో కంపెనీ ప్రతినిధుల నుంచి సేకరించిన పత్రాలు, సమాచారంతో బేరీజు వేసి.. ప్రత్యేక ప్రశ్నావళి రూపొందించింది. ఏడున్నర గంటలపాటు సాగిన విచారణలో 60 ప్రశ్నలు సంధించింది. 'ఫార్ములా ఈ కార్ రేస్ నిర్వహణకు మంత్రివర్గ ఆమోదం లేకుండా ఎలా నిధులు చెల్లించారు? రేసు నిర్వహణ నుంచి మధ్యలో వైదొలగిన 'ఏస్ నెక్ట్సజెన' సంస్థ మీ పార్టీకి రూ.49 కోట్లు ఎన్నికల బాండ్ల రూపంలో ఎందుకు చెల్లించింది? ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న సమయంలో మీరు అధికారులకు డబ్బుల చెల్లింపునకు నేరుగా (మౌఖిక) ఆదేశాలు ఎలా ఇచ్చారు? విదేశీ సంస్థకు నిధుల చెల్లింపుల్లో రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) మార్గదర్శకాలను ఎందుకు ఉల్లంఘించారు' అని దర్యాప్తు అధికారులు అడిగారు. ఎలాంటి లాభాపేక్షా లేకపోతే ఎఫ్ఈవో కంపెనీకి నిధుల చెల్లింపుల్లో నిబంధనలు అతిక్రమించాల్సిన అవసరం ఏమిటని కూడా ప్రశ్నించారు. 'అసలు మంత్రివర్గ ఆమోదం లేకుండా నిధులు ఎందుకు చెల్లించారు? నిధుల చెల్లింపుల్లో క్విడ్ ప్రోకో జరిగిందా? రేసు నిర్వహణలో త్రైపాక్షిక ఒప్పందం ఏమిటి? అగ్రిమెంట్‌కు కేవలం నాలుగు నెలల ముందు ఏర్పాటు చేసిన కంపెనీకి బాధ్యతలు ఎలా ఇచ్చారు? కేవలం రూ.2 లక్షల మూలధనం ఉన్న కంపెనీకి బాధ్యతలు ఎందుకు ఇవ్వాల్సి వచ్చింది' అని అడిగిన కీలక ప్రశ్నలకు కేటీఆర్ నీళ్లు నమిలినట్లు తెలిసింది. ఈ మొత్తం వ్యవహారాన్ని అధికారులే చూసుకున్నారని వారిపై నెట్టేసినట్లు సమాచారం. మధ్యలో ఎదురుదాడికి దిగినా.. ఏసీబీ అధికారులు తగు ఆధారాలను ముందుపెట్టడంతో ఆయన మౌనంగా ఉండిపోయారని వార్తలు వచ్చాయి. ఆ వెంటనే ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఏపీలో అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు, ఇతర టీడీపీ నేతల ఫోన్లు, నాటి ఏపీ సీఎం జగన్ చెల్లెలు షర్మిల ఫోన్, ప్రముఖ హీరోయిన్ల ఫోన్లను కూడా ట్యాప్ చేశారని గుప్పుమనడంతో కేటీఆర్ బిత్తరపోయారు. ఇప్పటికే డ్రగ్స్ వ్యవహారంలో కొందరు హీరోయిన్లను కేటీఆర్ బయటపడేశారని... ఆయనకు వారితో లింకులున్నాయని.. వారిని బ్లాక్‌మెయిల్ చేశారని పెద్దఎత్తున ప్రచారం జరిగింది. తాజాగా ఫోన్‌ట్యాపింగ్‌లో ఎవరెవరి ఫోన్లను ట్యాప్ చేశారో ప్రత్యేక దర్యాప్తు బృందం బయటపెట్టడమే గాక.. వారిలో కొందరిని పిలిపించి ఎప్పుడెప్పుడు ట్యాపింగ్ జరిగిందో వారి దృష్టికి తీసుకెళ్లింది. చివరకు తన సొంత పార్టీ నేతలను కూడా కేసీఆర్ వదల్లేదు. ఫోన ట్యాపింగ్ కేసులో వారిలో చాలా మంది బాధితులుగా ఉన్నారు. వారందరినీ సిట్ పిలిపించి వాంగ్మూలాలు నమోదుచేస్తోంది. సిట్ ఇప్పటి వరకు సేకరించిన సాక్ష్యాధారాల్లో భాగంగా.. మావోయిస్టుల సానుభూతిపరుల పేరుతో 615 మంది ఫోన్లను ట్యాప్ చేయడం ద్వారా అప్పటి ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్‌రావు భారతీయ టెలిగ్రాఫ్ చట్టం, ఐటీ చట్టాన్ని ఉల్లంఘించారని నిర్ధారించింది. ఈ క్రమంలో కేటీఆర్ పాత్రపై ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా ప్రముఖంగా కథనాలు ప్రసారం చేశాయి.. ప్రచురించాయి. దీంతో బీఆర్ఎస్ నాయకులు రెచ్చిపోయారు. ఆ పార్టీ విద్యార్థి సంఘం బీఆర్ఎస్వీ కార్యకర్తలు హైదరాబాద్ ఫిలింనగర్‌లో ఉన్న మహా టీవీ కార్యాలయంపై జూన్ 28న దాడి చేశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కేటీఆర్‌పై ప్రసారం చేసిన కథనానికి నిరసనగా రాళ్లు, కర్రలతో దాడి చేశారు. కార్యాలయంలోని సామగ్రి, బయట ఉన్న కార్లను ధ్వంసం చేశారు. ఈ దాడిలో మహాటీవీకి చెందిన ఓ ఉద్యోగికి గాయాలయ్యాయి. దీనిని కేసీఆర్, కేటీఆర్ ఖండించలేదు సరికదా.. తెలంగాణపై ఆంధ్రా మీడియా విషం చిమ్ముతోందని.. మహాటీవీకి పట్టిన గతే మిగతా చానళ్లకూ పడుతుందని కేసీఆర్ సన్నిహితుడైన మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి బహిరంగంగానే హెచ్చరించారు. ఏబీఎన్-ఆంధ్రజ్యోతిపైనా దాడిచేయాలని చూశారు. దీంతో ఆ చానల్‌తో పాటు అన్ని చానళ్లు, పత్రికలు బందోబస్తు పెంచుకోవలసిన పరిస్థితి ఏర్పడింది.

### మళ్లీ తెలంగాణ సెంటిమెంటును రెచ్చగొట్టాలని..

2014, 18ల్లో తెలంగాణ సెంటిమెంటును బాగా వాడుకుని అధికారంలోకి వచ్చిన కేసీఆర్.. 2023 ఎన్నికల్లో మాత్రం చతికిలపడ్డారు. జనం కర్రుగాల్చి వాతపెట్టారు. లోక్‌సభ ఎన్నికల్లో 17 ఎంపీ సీట్లకు గాను ఒక్కటి కూడా రాలేదు. కాంగ్రెస్, బీజేపీ చెరో 8 స్థానాల్లో, ఎంఐఎం ఒక్కచోట గెలిచాయి. చివరకు కేసీఆర్, ఆయన మేనల్లుడు హరీశ్‌రావు ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్, సిద్దిపేట అసెంబ్లీ స్థానాలున్న మెదక్ లోక్‌సభ సీటులోనూ బీఆర్ఎస్ ఓడిపోవడం.. అందునా మూడో స్థానానికి పడిపోవడం ఆ పార్టీ శ్రేణులకు షాకిచ్చింది. క్రమంగా తెలంగాణవ్యాప్తంగా ద్వితీయ శ్రేణి నేతలు, కేడర్ కాంగ్రెస్, బీజేపీల్లోకి వెళ్లడం మొదలైంది. వారిని అడ్డుకోవడానికి చేస్తున్న ప్రయత్నాలు ఫలించకపోవడంతో మళ్లీ తెలంగాణ సెంటిమెంటును రెచ్చగొట్టేందుకు మీడియాపై దాడులు మొదలుపెట్టారు. ఏపీ-తెలంగాణ జలవివాదాలను పెద్దది చేయాలని చూస్తున్నారు. అయితే తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) పేరు నుంచి తెలంగాణను తీసేసిన కేసీఆర్‌ను జనం నమ్మడం లేదని.. ఆయన పిలుపిచ్చిన కార్యక్రమాలు విఫలమవుతుండడమే దీనికి నిదర్శనమని కొందరు బీఆర్ఎస్ సీనియర్ నేతలే చెబుతున్నారు. ఇది తెలిసే కేటీఆర్ తెలంగాణ సీఎంపై రెచ్చిపోతున్నారు. ముఖ్యమంత్రి అన్న గౌరవం కూడా లేకుండా పచ్చిబూతులు తిడుతున్నారు. ఏపీ సీఎం చంద్రబాబుకు తెలంగాణను తాకట్టుపెట్టారని ఆరోపిస్తున్నారు.




సిలికానాంధ్ర
మనబడి
ACCREDITED
(అమెరికా మరియు కెనడాలో ACS-WASC గుర్తింపు పొందిన ఏకైక తెలుగు విద్యాలయం)
18+ సంవత్సరాలు
40+ రాష్ట్రాలు
10+ దేశాలు
తెలుగు
చదవడం, వ్రాయడం మాట్లాడడం నేర్చుకోండి
100,000+ విద్యార్థులు
2000+ భాషా సేవకులు
300+ మనబడి కేంద్రాలు
తరగతుల నమోదు ప్రారంభమైనది
బాలబడి* ప్రవేశం ప్రసూనం ప్రకాశం
ప్రమోదం ప్రభాసం ప్రబోధం
* BALABADI admissions are open throughout the year
క్రొత్త విద్యార్థులు
• 4 - 6 సం॥ బాలబడి - 1
• 6 సం॥ బాలబడి - 2 లేదా ప్రవేశం(తల్లిదండ్రుల ఇష్టం)
• 7+ సం॥ ప్రవేశం
గుర్తింపు
• పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం గుర్తింపు
• అమెరికాలోని వివిధ స్కూల్ డిస్ట్రిక్ట్‌లలో ప్రపంచభాషగా (World Language Credit) గుర్తింపు
• ప్రఖ్యాత WASC సంస్థచే గుర్తింపు
కార్యక్రమాలు
పిల్లల పండుగ, తెలుగు మాట్లాట, బాలానందం, పలుకుబడి, తెలుగుకుపరుగు, పద్యనాటకం బాలమిత్ర, బాలచంద్రిక
మనబడి కేంద్రాలు మీ ఇంటి నుండి 5 మైళ్ళ లోపు
సృజనాత్మక పాఠాలతో సరిక్రొత్త పుస్తకాలు!
సెప్టెంబర్ 6 నుండి తరగతులు ప్రారంభం
బాలరంజని
తెలుగు సాధన కోసం - కథలు, పాటలు, ఆటలతో ఉచితంగా ఆప్!
మనబడిలో చేర్పిద్దాం - తెలుగు భాష నేర్పిద్దాం
For more details and to register:
manabadi.siliconandhra.org
info@manabadi.siliconandhra.org
1-844-626-BADI (2234)
Follow us on :



# మలివిడత భూసమీకరణపై ఆచితూచి!

- మొదట రైతుల్లో అపోహలను తొలగించాలి
- హడావుడి చేయొద్దని సీఆర్‌డీఏకు సీఎం స్పష్టీకరణ
- రెండో విడత సమీకరణ లక్ష్యం 44 వేల ఎకరాలు
- ప్రస్తుతానికి 20 వేల ఎకరాలే తీసుకునే యోచన
- ప్రభుత్వ ప్రణాళికలపై రాజధాని రైతులకు
- అవగాహన కల్పించాలని చంద్రబాబు ఆదేశం

రాజధాని అమరావతిలో ప్రతిష్ఠాత్మక క్వాంటమ్ కంప్యూటింగ్ వ్యాలీ రాబోతోంది.. పలు విద్య, ఐటీ సంస్థలు, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు తరలివస్తున్నాయి.. పెట్టుబడులు పెట్టడానికి ఇన్వెస్టర్లు కూడా ఆసక్తి చూపుతున్నారు. చంద్రబాబు ప్రభుత్వం మళ్లీ రావడంతో అటు రాజధాని నిర్మాణ పనులూ క్రమంగా పుంజుకుంటున్నాయి. అమరావతి ప్రాంత రైతులు, ప్రజలు సంతోషంగా ఉన్న తరుణంలో ప్రభుత్వం వారిపై ఊహించని బాంబు వేసింది. గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం, రైల్వే స్టేషన్, స్పోర్ట్స్ సిటీ కోసమంటూ ఇంకో 44 వేల ఎకరాలను సమీకరిస్తామని ప్రకటించింది. దీంతో వారందరి గుండెల్లో గునపం దించినట్లయింది. పదేళ్ల కిందట 34 వేల ఎకరాలు ఇస్తే.. అభివృద్ధి చేసిన రిటర్నబుల్ ప్లాట్లు ఇస్తామన్న హామీకి ఇప్పటికీ అతీగతీ లేదని.. మళ్లీ 44 వేల ఎకరాలు తీసుకుంటామంటే తమ గతేంటని రైతులు మండిపడుతున్నారు. గ్రామసభలు పెట్టకుండా అధికారులను అడ్డుకుంటున్నారు. సీఎం, మంత్రి, ఎమ్మెల్యే, ఉన్నతాధికారులు.. ఎవరు వెళ్లినా గట్టిగా నిలదీస్తున్నారు. ఈ వాస్తవాన్ని కప్పిపుచ్చి.. రైతులు భూములివ్వడానికి సిద్ధంగా ఉన్నారంటూ అధికారులు మెచ్చుకోలు నివేదికలు ఇచ్చారు. క్షేత్ర స్థాయిలో రైతులు, టీడీపీ నేతల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకున్న సీఎం.. రెండో విడత భూసమీకరణకు తొందరపడొద్దని రాజధాని ప్రాంత ప్రాధికార సంస్థ (సీఆర్‌డీఏ)కు మౌఖికంగా ఆదేశాలిచ్చారు.

### అనుమానాలు.. అసంతృప్తి..

మొదటి దశలో భూములిచ్చిన రైతుల సమస్యలు ఇంకా అపరిష్కృతంగానే ఉన్నాయి. వార్షిక కౌలుకే దిక్కులేదు. ప్రభుత్వం ఏ సంగతీ స్పష్టంచేయడంలేదు. ఈ పరిస్థితుల్లో రెండో దశలో భూములు సమీకరించదలచిన గ్రామాల రైతుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. పైగా అధికారులు హడావుడిగా గ్రామ సభలు కూడా పెడుతున్నారు. రెండోదశ పూలింగ్ ఎందుకు.. ఈ భూములను ఏం చేస్తారు.. భూములిచ్చే రైతులకు కలిగే ప్రయోజనాలేమిటి? రాజధానిని పరిపూర్ణం చేసే విషయంలో అసలు ప్రభుత్వ ప్రణాళికలు ఏమిటో వారికి ఎలాంటి అవగాహనా కల్పించకుండా.. మమ అనిపించుకోవడానికి ప్రయత్నాలు చేస్తుండడంపై రైతుల్లో ఆగ్రహావేశాలు నెలకొన్నాయి. ఐదేళ్ల నరకం నుంచి బయటపడి ఇప్పుడిప్పుడే ఊపిరి పీల్చుకుంటున్న తమపై చంద్రబాబు కూడా కత్తిగట్టారని విమర్శించడానికి సైతం వారు వెనుకాడడం లేదు. భూములిచ్చే ప్రసక్తే లేదని గుంటూరు జిల్లా తాడికొండ మండలం పొన్నెకల్లు గ్రామ రైతులు తేల్చిచెప్పారు. గ్రామసభను రద్దు చేయాలని ఆందోళనకు దిగారు. ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, ఆర్‌డీవో శ్రీనివాస్, ఇతర అధికారులు స్టేజ్‌పైకి రాగానే రైతులు ఒక్కసారిగా అక్కడికి వచ్చి గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. రైతులు శాంతించకపోవడంతో తాత్కాలికంగా గ్రామసభను రద్దు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. మరో నాలుగు గ్రామాల్లో కూడా ఇవే పరిస్థితులు నెలకొన్నాయని.. భూములిచ్చేందుకు రైతులు సుముఖంగా లేరని తేలడంతో ముఖ్యమంత్రి అప్రమత్తమయ్యారు. గతంలో భూములిచ్చిన రైతుల సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇదే సమయంలో రెండో విడత భూసమీకరణపై ఆయా ప్రాంతాల రైతుల్లో ఏర్పడిన సందేహాలను పూర్తి స్థాయిలో తీర్చే ప్రయత్నాలు చేయాలని స్పష్టం చేశారు. మంత్రులు, అధికారులు అత్యుత్సాహంతో వ్యవహరించవద్దని.. రెండో దశ భూ సమీకరణపై మంత్రుల కమిటీని నియమించి పూర్తి స్థాయిలో అధ్యయనం చేసిన తర్వాతే.. రైతులను ఒప్పించి ముందుకు అడుగు వేయాలని సూచించారు. ఈ ప్రక్రియను నిదానంగా ముందుకు తీసుకెళ్లాలని నిర్దేశించారు.

### ఇప్పటికిప్పుడు 20 వేల ఎకరాలే

రాజధానిని ఆర్థికంగా నిలబెట్టే ప్రాజెక్టుల కోసం రెండో విడత భూ సమీకరణ తలపెట్టారు. కొత్తగా సమీకరించే 44 వేల భూముల్లో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయంతో పాటు స్మార్ట్ ఇండ్రస్ట్రియల్ సిటీ, స్పోర్ట్స్ సిటీ వంటివి నిర్మిస్తామని ప్రభుత్వం చెబుతోంది. ఇంతమొత్తంలో కాకున్నా ప్రస్తుతానికి అమరావతి మండలంలోని వైకుంఠపురం, పెద మద్దూరు, ఎండ్రాయి, కర్లపూడి గ్రామాలతో పాటు తుళ్లూరు మండలంలో వడ్డమాను, హరిశ్చంద్రాపురం, పెదపరిమి గ్రామాల్లో కలిపి 20,494 ఎకరాలు యుద్ధ ప్రాతిపదికన తీసుకోవాలని భావిస్తోంది. వీటికి ల్యాండ్ పూలింగ్ నిబంధనలు అమలు చేస్తూ చట్టసవరణ కూడా చేశారు. అమరావతిలో రూ.49 వేల కోట్లతో జరుగుతున్న పనులు పూర్తయ్యే సమయానికి ఈ ప్రాంతంలో ఆర్థిక కార్యకలాపాలు కూడా పుంజుకుంటే మరింత అభివృద్ధికి దోహదపడుతుంది. ఈ విషయాలను రైతుల్లోకి బలంగా తీసుకెళ్లలేకపోవడంతో ఈ సమస్య ఉత్పన్నమైంది.

అపోహలు తొలగించడంపై పెద్దఎత్తున దృష్టిపెట్టాలని ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో కొందరు మంత్రులు సూచించారు. రైతులు పలు సమస్యలను తమ దృష్టికి తీసుకొచ్చారని, వారి ఆవేదనను పరిగణనలోకి తీసుకోవాలని, తొందరపడొద్దని కోరారు. దీంతో అనుమానాల నివృత్తి తర్వాతే భూ సమీకరణ ప్రక్రియను నిదానంగానే చేపట్టాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. అందుకే హడావుడి చేయొద్దని సీఆర్‌డీఏ అధికారులకు సూచన చేశారు.

### రాజధాని నిర్మాణాల్లో జాప్యం చేయొద్దు

రైతుల్లో విశ్వాసం పాదుగొల్పేదిశగా చంద్రబాబు కొన్ని నిర్ణయాలు తీసుకున్నారు. ఇప్పటి వరకు రాజధానిలో 72 సంస్థలకు 947 ఎకరాలు సీఆర్‌డీఏ కేటాయించింది. స్థలాలు పొందిన వారిలో స్కూళ్లు, బ్యాంకులు, యూనివర్సిటీలు, హోటళ్లు, హెల్త్‌కేర్ సంస్థలు, మత సంస్థలు, ఐటీ, టెక్ పార్కులున్నాయి. ఆయా సంస్థల యాజమాన్యాలతో సీఎం చర్చించారు. ఎవరు ఏ సమయంలో నిర్మాణాలు మొదలుపెడతారు.. ఎప్పటికి పూర్తి చేస్తారని ఆరా తీశారు. అనుమతుల విషయంలో ఎక్కడా జాప్యం ఉండదని, జాప్యం జరిగితే తనను నేరుగా సంప్రదించాలని సూచించారు. స్థలాలు పొందిన వాళ్లు నిర్దేశించిన సమయంలో నిర్మాణాలు మొదలుపెట్టి పూర్తి చేయాల్సిందేనని తేల్చిచెప్పారు. ఏ సందర్భంలోనూ, ఏ కారణంతోనూ జాప్యాన్ని అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. నెలలో నిర్మాణాలు ప్రారంభిస్తామని మూడు సంస్థలు, రెండు నెలల్లో మొదలుపెడతామని 15 సంస్థలు, ఐదు నెలల్లో నిర్మాణాలు చేపడతామని 13 సంస్థలు, ఆర్నెల్లలో నిర్మాణాలు ప్రారంభిస్తామని 17 సంస్థల ప్రతినిధులు తెలిపారు. వారి నుంచి స్పష్టమైన హామీని తీసుకున్నారు. ఈ సందర్భంగా వివిధ సంస్థల ప్రతినిధులు ముఖ్యమంత్రికి తమకు అదనంగా భూములను



కేటాయించాలని కోరారు. ప్రధానంగా హెూటళ్లకు చెందిన వివిధ సంస్థల ప్రతినిధులు కన్వెన్షన సెంటర్ల నిర్మాణం కోసం ప్రస్తుతం కేటాయించిన భూములతో పాటు అదనంగా రెండు నుంచి రెండున్నర ఎకరాలు అడిగారు. అలాగే పార్కింగ్ కోసం అదనపు భూములు కావాలని మరికొన్ని సంస్థలు కోరాయి. ఏపీ, తెలంగాణల్లోని తమ సిబ్బందికి శిక్షణ ఇచ్చే ట్రైనింగ్ సెంటర్ కోసం తమకు అదనంగా స్థలం కేటాయించాలని పోస్టల్‌శాఖ ప్రతినిధులు కోరారు. అలాగే  కార్యకలాపాలు ప్రారంభించిన తర్వాత ఎంత మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామనే అంశాన్ని పలువురు ప్రతినిధులు ముఖ్యమంత్రికి వివరించారు.

●

# కౌలు రాదు.. అప్పూ పుట్టదు!



## అమరావతి రైతుల అగచాట్లు
## వైసీపీ హయాంలో అప్పుల ఊబిలోకి
### చంద్రబాబు చెల్లించిన బకాయిలు వాటికే చాలక విలవిల

రాజధాని అమరావతి కోసం భూములు త్యాగం చేసిన రైతులకు.. మళ్లీ చంద్రబాబు సీఎంగా వచ్చాక కూడా కష్టాలు తప్పడం లేదు. గత వైసీపీ ప్రభుత్వంలో మాదిరిగానే కౌలు సకాలంలో రాక, రిటర్నబుల్ ప్లాట్లపై అప్పులు పుట్టక వారు నానా అగచాట్లు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పాత బకాయిలు చెల్లించినా, అవి అప్పుల చెల్లింపులకే వెళ్లిపోవడంతో రైతుల ఆర్థిక పరిస్థితి ఆందోళనాకరంగా ఉంది.  2014-19 మధ్య రాజధాని రైతులకు అప్పటి టీడీపీ ప్రభుత్వం సకాలంలో కౌలు చెల్లించింది. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ రాజధానిపై కక్షపూరితంగా వ్యవహరించింది. వార్షిక కౌలు చెల్లించకుండా నిలిపివేస్తూ వచ్చింది. రైతులు కోర్టులను ఆశ్రయించి కౌలు పొందాల్సిన పరిస్థితి వచ్చింది. తొలి రెండు మూడేళ్లు కోర్టు ఆదేశాలతో కౌలు చెల్లించిన వైసీపీ ప్రభుత్వం ఆ తరువాత పూర్తిగా ఆపేసింది. ఐదేళ్లపాటు సాగిన ఈ వ్యవహారంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి తిరిగి కోలుకోలేని స్థితికి వచ్చారు. రాజధానికోసం 29,881 మంది రైతులు 34,323 ఎకరాల భూములిచ్చారు. వారిలో మెజారిటీ చిన్న, సన్నకారు, అసైన్డ రైతులే ఉన్నారు. ఎకరంలోపు భూమి ఇచ్చినవారు 20,490 మంది, రెండెకరాలలోపు భూములిచ్చినవారు 5,227 మంది, అసైన్డ భూములు ఇచ్చినవారు 2.800 మంది ఉన్నారు. అసైన్డ రైతులకు మూడేళ్లపాటు కౌలు రాకపోవడంతో పస్తులుండాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే కిందటేడాది అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రైతులకు రెండు విడతలుగా రూ.470 కోట్లు చెల్లించింది. అధిక వడ్డీల కారణంగా గత ఐదేళ్లలో వడ్డీలు పెరిగి రుణ మొత్తం పెరిగిపోయింది. దీంతో ప్రభుత్వం చెల్లించిన కౌలు మొత్తం అప్పుల్లో కొంత తీర్చడానికే సరిపోయింది తప్ప వారికి ఊరట లభించలేదు.

**అధిక వడ్డీలకు బలి**

రాజధాని కోసం భూములు త్యాగం చేసిన రాజధాని రైతులకు ఒక్క రూపాయి కూడా అప్పు పుట్టడం లేదు. చేతిలో భూమి లేకపోవడంతో బ్యాంకులు రుణాలివ్వడానికి నిరాకరిస్తున్నాయి. వ్యవసాయం చేయకపోవడంతో వ్యవసాయ పరపతి సంఘాలు(పీఏసీఎస్) కూడా రుణాలివ్వడం లేదు. దీంతో అన్నదాతలు రోడ్డున పడ్డారు. రాజధాని కోసం భూములిచ్చే సమయంలో సగటు రైతు ఊహకు కూడా రాని ఈ పరపతి అంశం ఇప్పుడు వారి పాలిట కోలుకోలేని శాపంగా మారింది. మరో వైపు ప్రభుత్వం ఇచ్చిన రిటర్నబుల్ ప్లాట్లకు కూడా బ్యాంకులు రుణాలు ఇవ్వడం లేదు. రాజధానిని అర్బనగా ప్రకటిస్తే ఇస్తామని కొన్ని బ్యాంకులు చెబుతుంటే.. మరికొన్ని బ్యాంకులు లీడ్ బ్యాంకు నుంచి ఆదేశాలు లేవంటూ చేతులు దులిపేసుకుంటున్నాయి. దీంతో రైతులు ప్రైవేటు ఫైనాన్సర్ల చేతిలో పడి సర్వస్వం కోల్పోతున్నారు.

**స్కూల్లో చేర్పించే పరిస్థితీ లేదు**

గతంలో టీడీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు ప్రతి ఏటా మే, జూనలో కౌలు చెల్లించేది. దీంతో ఆ సమయంలో పిల్లలను స్కూలుకు పంపించడానికి రైతులకు పెద్ద ఇబ్బంది ఉండేది కాదు. అయితే గత ఐదేళ్లలో తలెత్తిన ఆర్థిక ఇబ్బందుల కారణంగా చాలామంది ప్రైవేటు స్కూళ్లు, కళాశాలలకు తమ పిల్లలను పంపించడమే గగనంగా మారింది. తాజాగా కూటమి ప్రభుత్వం ఇచ్చిన 'తల్లికి వందనం' డబ్బులు కూడా అక్కరకు రాలేదని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తక్షణం కౌలు చెల్లించాలని, బ్యాంకుల ద్వారా తక్కువ వడ్డీకి రైతులకు రుణం ఇచ్చేలా పరపతి కల్పించాలని వేడుకుంటున్నారు.



# కన్నప్పతో ఏం సాధించినట్లు?

కన్నప్ప.. మంచు కుటుంబానికి ఎంతో ప్రతిష్టాత్మకమైన సినిమా. దీని గురించి పది పదిహేనేళ్ల నుంచి మాట్లాడుతూనే వచ్చారు మంచు విష్ణు, మంచు మోహన్ బాబు. తనికెళ్ల భరణి దర్శకత్వంలో చేయాలనుకున్న సినిమా ఇది. కానీ ఆయన పక్కకు వెళ్లిపోతే మంచు విష్ణునే స్వయంగా స్క్రిప్టు రెడీ చేసుకుని.. హిందీ 'మహాభారతం' సీరియల్ దర్శకుడు ముకేశ్ కుమార్ సింగ్ డైరెక్షన్లో రెండేళ్ల ముందు దీన్ని పట్టాలెక్కించారు. రూ.200 కోట్లకు పైగా బడ్జెట్ పెట్టి తీసిన ఈ సినిమాకు ఆశించిన స్థాయిలో బిజినెస్ ఆఫర్లు రాకపోతే సొంతంగా రిలీజ్ చేసుకున్నాడు విష్ణు. అంతే కాక ఓటీటీ, ఇతర హక్కులను సైతం అమ్మలేదు. ఐతే సినిమా మంచి ఫలితాన్నందుకుని తన పెట్టుబడినంతా వెనక్కి తీసుకు వస్తుందని అతను బలంగా నమ్మాడు. కానీ ఈ సినిమా హంగామా అంతా ఒక్క వీకెండ్‌కే పరిమితం అయింది. మూడు రోజులు ఓ మోస్తరు వసూళ్లు రాబట్టి.. ఆ తర్వాత చల్లబడిపోయింది 'కన్నప్ప'.




మోహన్ లాల్, అక్షయ్ కుమార్, శరత్ కుమార్.. ఇలా బహు భాషల నటులను పెట్టుకుని, పాన్ ఇండియా స్థాయిలో సినిమాను రిలీజ్ చేస్తే.. ఫుల్ రన్లో ఈ సినిమా రాబట్టిన వసూళ్లు రూ.40 కోట్లకు మించలేదు. నిజానికి ఈ సినిమాకు రివ్యూలు పాజిటివ్‌గానే వచ్చాయి. సోషల్ మీడియా టాక్ కూడా అంత నెగెటివ్‌గా ఏమీ లేదు. అయినా సరే.. సినిమా బాక్సాఫీస్ దగ్గర నిలబడలేకపోయింది. పెట్టిన బడ్జెట్ అంతా థియేటర్ల నుంచే వచ్చేస్తుందని.. డిజిటల్, శాటిలైట్ రైట్స్‌తో వచ్చేదంతా లాభమే అని అంచనా వేశాడు విష్ణు. తీరా చూస్తే చెప్పిన బడ్జెట్లో 20 పర్సంట్‌కు మించి థియేటర్ల నుంచి రికవర్ కాలేదు. ఇక డిజిటల్, శాటిలైట్ రైట్స్ నుంచి వచ్చేదెంతో చూడాలి. మొత్తంగా చూస్తే విష్ణు చెప్పినట్లు నిజంగా 200 కోట్లు ఖర్చు పెట్టి ఉంటే సగం కూడా వెనక్కి రానట్లే. అంటే అతను భారీగానే నష్టపోయి ఉండాలి. లేదంటే నిజంగా చెప్పినంత బడ్జెట్ అయినా పెట్టకపోయి ఉండాలి.





# 4 రోజులు.. 45 వేల కోట్ల పెట్టుబడులు

## చంద్రబాబు, లోకేశ్ సింగపూర్ పర్యటన



### బాబు భావోద్వేగం

సింగపూర్ లో తెలుగు డయాస్పోరా ఫ్రం సౌత్ ఈస్ట్ ఏషియా కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు.. ఏపీ అభివృద్ధి విషయంలో అక్కడి తెలుగు వాళ్లు తనపై ప్రదర్శించిన ఏవీ చూసి ఒక్కసారిగా ఎమోషనల్ అయ్యారు. తెలుగు దేశం పార్టీ హయంలోనే మూడేళ్లలో 300 ఇంజనీరింగ్ కాలేజీలు ఏపీలో ఏర్పాటు అయ్యాయి. ఈ అంశంపై చాలా మంది అప్పట్లో విమర్శలు చేవారు. కానీ ఫ్యూచర్ మొత్తం ఐటీ, నాలెడ్జ్ ఎకానమీకి ఉంటుందని నమ్మాను. నాలెడ్జ్ ఎకానమీలో తెలుగుజాతి అగ్రగామిగా ఉండాలంటే ఐటీని ప్రమోట్ చేయాలని ఆలోచించాను. నేడు సింగపూర్‌లో వేలాది తెలుగు ప్రజలు ఉన్నారంటే ఆనాటి ఆలోచనలే కారణం. సింగపూర్‌లో 40 వేల మంది తెలుగు ప్రజలు ఉన్నారు. ఒక వ్యక్తి ఫౌండేషన్ ద్వారా సింగపూర్ గౌరవప్రదమైన దేశంగా ఎదిగింది. అమరావతి మాస్టర్ ప్లాన్ ను సింగపూర్ ప్రభుత్వం ఉచితంగా తయారు చేసి ఇచ్చింది. కానీ, 2019 తర్వాత సింగపూర్ ప్రభుత్వాన్ని తప్పు పట్టే పరిస్థితి తెచ్చారు. ప్రభుత్వ బ్రాండ్ పోతే ఏపీ నష్టపోతుందని సింగపూర్ ప్రభుత్వానికి చెప్పాను. గతంలో జరిగిన తప్పులు సరిదిద్దాలనే సింగపూర్ పర్యటనకు వచ్చా అని ఆయన తన భావోద్వేగాన్ని ఆపుకొంటూ పేర్కొన్నారు.


నాలుగు రోజుల పర్యటన.. అక్షరాలా నలభై ఐదు వేల రూపాయల కోట్ల పెట్టుబడుల సాధన. ఇదీ చంద్రబాబు బ్రాండ్ అంటే. ఇదీ నాయకుడి సత్తా అంటే. అప్పులు చేసి బటన్లు నొక్కి అదే గొప్ప అనుకునే కుక్కమూతి పిందెలకు.. సంపద సృష్టించి పేదలకు పంచే దార్శనికులకు తేడా ఇది. 2014-19 నడుమ సింగపూర్ సర్కారుతో కలిసి ఏపీ.. ముఖ్యంగా అమరావతి అభివృద్ధికి సీఎం చంద్రబాబు రచించిన విస్తృత ప్రణాళికలను తర్వాత వచ్చిన నికృష్ట పాలకులు సర్వనాశనం చేసిన సంగతి తెలిసిందే. దీంతో.. మళ్లీ అధికారంలోకి వచ్చాక చంద్రబాబు ఆ వికృత పాలన పీడ నుంచి రాష్ట్రం బయటపడిందని చెప్పి.. పెట్టుబడిదారుల్లో విశ్వాసాన్ని ప్రోది చేయడానికి, ముఖ్యంగా సింగపూర్ ప్రభుత్వానికి క్షమాపణలు చెప్పి మరిన్ని పెట్టుబడులు ఆకర్షించడానికి నాలుగు రోజుల పర్యటన చేశారు. ఒక రాష్ట్రాధినేత విదేశీ ప్రభుత్వానికి ఇలా క్షమాపణలు చెప్పాల్సిరావడం దౌర్భాగ్యమే.. కానీ.. క్షమాపణ చెప్పడం చంద్రబాబు గొప్పదనానికి, రాష్ట్రాభివృద్ధి కోసం ఆయన పడుతున్న తపనకు నిదర్శనం. ఈ క్షమాపణలు చెప్పడం ద్వారా ఆయనేమీ తగ్గలేదు.. సరికదా.. ఆయన గొప్పదనం శిఖరాయమానమైంది. ఆ సంగతి అలా ఉంచితే.. సీఎం చంద్రబాబు నేతృత్వంలో సింగపూర్ వెళ్లిన మంత్రుల బృందానికి ప్రవాసాంధ్రులు మొదలు సింగపూర్ అధ్యక్షుడు ధర్మన్ షణ్ముగ రత్నం వరకు అపూర్వ స్వాగతం లభించింది. సింగపూర్లో ఆయన నాలుగు రోజులపాటు అవిశ్రాంతంగా వివిధ సమావేశాలు, రౌండ్ టేబుల్ చర్చల్లో పాల్గొన్నారు. సింగపూర్ ప్రభుత్వానికి చెందిన పలువురు అధికారులను, మంత్రులు టాన్ సీ లెంగ్, కె.షణ్ముగం వంటివారిని కలవడంతోపాటు.. దిగ్గజ సంస్థలను కలిశారు. సుర్బానా జురాంగ్, సెంబ్ కార్ప్, ఎస్ఐఏ ఇంజనీరింగ్, ఏఐ సింగపూర్, కెప్పెల్ కార్పొరేషన్, కెపిటాల్యాండ్ ఇన్వెస్ట్‌మెంట్ (ఇండియా), మందాయ్ వైల్డ్‌లైఫ్ గ్రూప్, సుమితోమో మిత్సుయ్ బ్యాంకింగ్




కార్పొరేషన్, టెమసెక్ హోల్డింగ్స్ వంటి సంస్థల ప్రతినిధులతో మాట్లాడారు. "ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అపార అవకాశాలు, వనరులు ఉన్నాయి. వ్యాపారాభివృద్ధికి పెద్ద ఎత్తున అవకాశాలున్నాయి. పెట్టుబడులతో వచ్చి రాష్ట్ర ప్రగతిలో భాగస్వాములు కండి" అని ఆహ్వానించారు. రాష్ట్రంలో ఏయే ప్రాంతాలను ఎలా అభివృద్ధి చేయాలనే దిశగా ప్రభుత్వం రూపొందించిన ప్రణాళికలను వారికి వివరించారు. దీంతో రాష్ట్రంలో రియల్ ఎస్టేట్, పారిశ్రామిక రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు కెపిటాల్యాండ్ ఇండియా ప్రతినిధులు ఆసక్తి చూపారు.




విశాఖలో డాల్ఫిన్ సిటీ, అమరావతిలో బొటానికల్ గార్డెన్ వంటివాటి ఏర్పాటులో రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు మందాయ్ వైల్డ్ లైఫ్ సంస్థ ఆసక్తి కనబరచింది. నవంబరు 14, 15 తేదీల్లో విశాఖలో జరిపే పెట్టుబడుల సదస్సుకు హాజరు కావాల్సిందిగా సింగపూర్ ప్రభుత్వ ప్రతినిధులను సీఎం ఆహ్వానించారు. కాగా.. సీఎం చంద్రబాబు చేపట్టిన సింగపూర్ పర్యటన విజయవంతమైందని, ఐదేళ్లలో రూ.45 వేల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు కుదిరాయని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. కేవలం ఒక్క జూమ్‌కాల్ ద్వారా ఆర్సెల్లార్ మిత్తల్‌ను ఆహ్వానించగా.. దేశంలోనే అతిపెద్ద స్టీల్‌ప్లాంట్, డేటా సెంటర్‌లు ఏపీలో ఏర్పాటు కాబోతున్నట్లు వెల్లడించారు.




# పెట్టుబడుల 'వేటగాడు' లోకేశ్.. ఏపీకి గూగుల్ డేటా సెంటర్

తండ్రికి కొడుకుపుట్టినప్పుడు కలిగే సంతోషం కన్నా.. జనులు ఆ కుమారుడిని పొగిడినప్పుడు కలిగే సంతోషం ఎక్కువని శతకకారుడు చెప్పాడు. అలాంటి నిజమైన పుత్రోత్సాహం సీఎం చంద్రబాబు నాయుడుకు కూడా ప్రస్తుతం కలుగుతోందనడంలో సందేహం లేదు. తండ్రికి తగ్గ తనయుడిగా మంత్రి నారా లోకేశ్ రాటుదేలిన వైనం ప్రశంసనీయం. తాజాగా సింగపూర్ పర్యటనలో సీఎం చంద్రబాబుతో పోటీ పడి మరీ ఏపీకి పెట్టుబడులు తేవడంలో లోకేశ్ సక్సెస్ అయ్యారు. లోకేశ్ చొరవతోనే ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు గూగుల్ ముందుకు వచ్చిందని.. ఏపీలో భారీ డేటా సెంటర్ ఏర్పాటు చేయబోతోందని సమాచారం. 6 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.50,000 కోట్లు) పెట్టుబడితో విశాఖలో 1 గిగా బైట్ సామర్థ్యంతో డేటా సెంటర్ ను గూగుల్ సంస్థ ఏర్పాటు చేయనుందని తెలుస్తోంది. ఇండియాలో ఇంత భారీ స్థాయిలో గూగుల్ పెట్టుబడి పెట్టడం ఇదే తొలిసారి. ఆసియా ఖండంలో ఇంత పెద్ద డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయడం కూడా తొలిసారి అయ్యే అవకాశముంది. ఒక్క గూగుల్ అనే కాదు.. ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు పలువురు పారిశ్రామికవేత్తలను లోకేశ్ ఆహ్వానించారు. ఏపీలో కంపెనీలె పెట్టేందుకు ఉన్న అనుకూలతలను వివరించి పెట్టుబడిదారులలలో విశ్వాసాన్ని నింపడంలో సక్సెస్ అయ్యారు. లోకేశ్ స్పీచ్ కు సింగపూర్ ప్రభుత్వ పెద్దలు, పారిశ్రామికవేత్తలు ఫిదా అయ్యారు. సీఎం చంద్రబాబుతో కొన్ని, విడిగా మరికొన్ని కార్యక్రమాల్లో లోకేశ్ బిజీబిజీగా గడిపారు. తెలుగు డయాస్పోరా సమావేశంలో లోకేశ్ స్పీచ్ ఎన్ఆర్ఐలలో స్ఫూర్తి నింపింది. ఏపీ బ్రాండ్ ను ప్రమోట్ చేయడంలో ఎన్ఆర్ఐలు బ్రాండ్ అంబాసిడర్లుగా మారాలని లోకేశ్ పిలుపునిచ్చారు. ఎయిర్ బస్, ఎవర్ వోల్ట్, గూగుల్ క్లౌడ్, మైక్రో సాఫ్ట్, మురాటా ఇంజనీరింగ్, కెరియర్, ఇన్ఫినియన్, ఐవిపి సెమి, క్యాపిటా ల్యాండ్, ఎబీమ్ కన్సల్టింగ్, డిటిడిఎస్ వంటి గ్లోబల్ కంపెనీల ప్రతినిధులతో లోకేశ్ జరిపిన చర్చలు సఫలమయ్యాయి.

పారిశ్రామికవేత్తలతో వన్ టు వన్ చర్చలు 19, జి టు జి (గవర్నమెంట్ టు గవర్నమెంట్) సమావేశాలు 6, రౌండ్ టేబుల్ సమావేశాలు 4, సైట్ విజిట్లు 4, రోడ్ షో/డయాస్పోరా ఈవెంట్స్ 2....మొత్తం 35 కార్యక్రమాలకు లోకేష్ హాజరయ్యారు.








## సింగపూర్‌లోని ప్రవాసాంధ్రులతో చంద్రబాబు ఫొటో సెషన్.. నెవ్వర్ బిఫోర్... ఎవ్వర్ ఆఫ్టర్!

టీడీపీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి వయసు గురించి వైసీపీ నేతలు విమర్శలు గుప్పిస్తున్న సంగతి తెలిసిందే. అయితే, ఏడు పదుల వయసులోనూ ప్రజల కోసం, టీడీపీ కార్యకర్తల కోసం, అభిమానుల కోసం అహర్నిశలు శ్రమిస్తూ తనకు వయసు ఒక నెంబర్ మాత్రమే అని ఆయన నిరూపిస్తూనే ఉంటారు. తాజాగా సింగపూర్ పర్యటన సందర్భంగా చంద్రబాబు ఇదే విషయాన్ని మరోసారి ప్రూవ్ చేశారు.

ఒకటి కాదు... రెండు కాదు...దాదాపుగా 8 వేల ఫోటోలు దిగి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఈ ఫోటో సెషన్ కు ముందు రోజు రాత్రి చంద్రబాబు హైదరాబాద్ నుండి సింగపూర్ కు విమాన ప్రయాణం చేశారు. నాలుగు గంటల ప్రయాణంలో ఆయన సరిగా నిద్రపోలేదు. ప్రయాణ బడలిక ఉన్నప్పటికీ తనకోసం వచ్చిన ప్రవాసాంధ్రులతో సెల్ఫీలు దిగేందుకు చంద్రబాబు ఉత్సాహంగా ముందుకు వచ్చారు. అది కూడా ఒక్కొక్క కుటుంబంతో ఒక్కొక్క ఫోటో విడివిడిగా దిగారు.



ముందుగా 10 మంది సభ్యులను ఒక గ్రూపుగా చేసి ఫోటో దిగుదామని అనుకున్నారు. కానీ, కుటుంబాల వారీగా దిగితే బాగుంటుందని భావించి అందరితో ఓపిగ్గా చంద్రబాబు సెల్ఫీలు దిగిన వైనం ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. బహుశా ఈ రకంగా ఫోటోలు దిగడం చంద్రబాబుకే చెల్లింది. ఇది చరిత్రాత్మకమని చంద్రబాబుతో ఫోటోలు దిగిన ప్రవాసాంధ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సింగపూర్ లోని ప్రవాసాంధ్రులతో చంద్రబాబు సెల్ఫీలు... నెవ్వర్ బిఫోర్... ఎవ్వర్ ఆఫ్టర్! అని సోషల్ మీడియాలో నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు.



# రుషికొండకు విముక్తి ఎప్పుడు?



**ప్యాలెస్ వినియోగంపై ఇప్పటికీ నిర్ణయం తీసుకోని ప్రభుత్వం**
**రూ.650 కోట్ల ప్రజాధనంతో**
**అత్యంత విలాస భవనాలు కట్టిన జగన్**
**అవి ఎటూకాకుండా ఉండడమే సమస్య**
**విదేశీ ఎంబసీలకు ఇవ్వాలని కొందరు..**
**కన్వెన్షన్‌గా, గెస్ట్‌హౌస్‌లుగా వాడాలని మరికొందరు**
**అన్నింటినీ పరిశీలిస్తున్నామన్న సర్కారు**
**ఏడాది దాటినా ముందుకు పడని అడుగు**

బంగాళాఖాతానికి అభిముఖంగా రుషికొండపై గత ముఖ్యమంత్రి జగన్ నిర్మించిన ప్యాలెస్‌ను ఏం చేయాలో రాష్ట్రప్రభుత్వానికి అంతుపట్టడం లేదు. పర్యాటక శాఖకు చెందిన హరిత రిసార్ట్స్‌ను కూలగొట్టి.. 9.8 ఎకరాల్లో రూ.650 కోట్లతో రాజభవనం నిర్మించింది. పర్యాటకుల కోసం సెవెన్ స్టార్ హోటల్ నిర్మిస్తున్నామని చివరివరకు మాయమాటలు చెప్పారు. ఎన్నికలు ఇంకో రెండు నెలల్లో ఉన్నాయనగా (2024 ఫిబ్రవరి 29న).. దానిని సీఎం క్యాంపు కార్యాలయంగా ఉపయోగిస్తామని అప్పటి పర్యాటక మంత్రి రోజా ప్రకటించారు. తన భార్య భారతీరెడ్డి అభిరుచులతో ఎంతో ముచ్చటపడి నిర్మించుకున్న ఆ భవనంలోకి అడుగు పెట్టకుండానే జగన్ అధికారం కోల్పోయారు. అప్పటివరకూ ఎవరినీ ఆ భవనం వైపు కన్నెత్తి కూడా చూడనివ్వలేదు. ఏకంగా అటు దారితీసే రోడ్లనే మూసివేశారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ రెండుసార్లు రుషికొండ వెళ్లినా చూడకుండానే వెనక్కి వచ్చేశారు. సీపీఐ సీనియర్ నేత కె.నారాయణ కోర్టు ఉత్తర్వులతో లోపలకు వెళ్లి చూడగలిగారు. కూటమి విజయం సాధించాక భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మీడియాతో వెళ్లి ఆ భవనం చూశారు. ఆ తర్వాత సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన కల్యాణ్ దానిని పరిశీలించారు.

వాస్తవానికి రుషికొండ ప్రకృతి రమణీయతకు మారుపేరు. చూడగానే ఆకట్టుకునే ప్రదేశం. చుట్టూ ఎత్తయిన చెట్లు.. ఆహ్లాదకరమైన వాతావరణం... సముద్రతీరంతో సహజసిద్ధంగా ఏర్పడిన రుషికొండ రాష్ట్రానికే తలమానికం. ఎన్నిసార్లు సందర్శించినా... చూడాలనిపించే రిసార్ట్స్ ఇక్కడ ఉన్నాయి. అలాంటి రుషికొండలో రుషి మాత్రమే మిగిలింది. కొండ మొత్తాన్ని గుండు కొట్టేశారు. మట్టి తరలింపు పేరుతో కోట్లు మింగేశారు. సెవెన్ స్టార్ హోటల్ పేరుతో భారీ స్కాంకు తెరలేపారు. మొత్తం 1,48,413 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మాణాలు చేపట్టారు. అందులో 2.8 ఎకరాల్లో మూడు భవనాలను జగన్, ఆయన ఇద్దరు కుమార్తెలకు వేర్వేరుగా నిర్మించారు. ఆ బ్లాకు లోపలకు ఎవరూ వెళ్లకుండా పెద్ద గేటు ఏర్పాటు చేశారు. మిగిలిన భవనాలన్నిటినీ పెద్ద పెద్ద సమావేశ మందిరాలుగా నిర్మించారు. ఎక్కడా గదులు లేవు. వాటినెలా ఉపయోగించుకోవాలనే దానిపై అభిప్రాయాలు తీసుకుంటామని ప్రభుత్వం ప్రకటించింది. కొంతమంది విదేశీ రాయబార కార్యాలయాలకు ఇవ్వాలని.. ఇంకొందరు ఐటీ సంస్థలు పెట్టాలని.. పెద్ద పెద్ద సంస్థలకు, కన్వెన్షన్ సెంటర్‌కు ఇవ్వాలని మరికొందరు సూచించారు. అయితే ఎవరు దానిని వినియోగించుకోవాలన్నా లోపల కొన్ని మార్పులు చేస్తే తప్ప వీలు కాదు. అలా పనులు చేపట్టాలంటే వాటికి మళ్లీ రూ.50-60 కోట్ల వరకు వెచ్చించాల్సి ఉంటుంది.

### సీఎంవోలో అధికారికి బాధ్యతలు



రుషికొండ ప్యాలెస్ భవనాన్ని ఏం చేస్తే బాగుంటుందో నివేదిక ఇవ్వాలని చంద్రబాబు ముఖ్యమంత్రి కార్యాలయంలో ఓ ఐఏఎస్ అధికారిని ఆదేశించారు. అయితే ఆ అధికారి ఇప్పటివరకూ భవనాన్ని సందర్శించనేలేదు. ప్రజలను సందర్శనార్థం అనుమతించి.. జగన్ ప్రభుత్వం నిధులను ఎలా దుర్వినియోగం చేసిందో వివరించాలని కొందరు ప్రభుత్వ పెద్దలకు సలహా ఇచ్చారు. ఆ ఆలోచనను కూడా పరిశీలిస్తున్నట్టు సీఎం ఆ మధ్య విశాఖ వెళ్లినప్పుడు ప్రకటించారు. అయితే దానిపైనా నిర్ణయం తీసుకోలేదు. పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ ఇటీవల రుషికొండ బ్లూ ఫ్లాగ్ బీచ్‌ను సందర్శించారు. విశాఖకు వచ్చే పర్యాటకులకు ఆ భవనాన్ని చూపించే ఆలోచన ఉందని ఆయన ప్రకటించారు. ప్రజాధనాన్ని జగన్ ఎలా దుర్వినియోగం చేశారో తెలియజెప్పేందుకు దానిని అందరికీ చూపించాలని ప్రభుత్వ పెద్దలు భావిస్తున్నారు. కానీ అది చూసి...'ఎంత పెద్ద భవనం నిర్మించాడో' అనే అభిప్రాయాలు కూడా వ్యక్తమయ్యే అవకాశం లేకపోలేదు. కాబట్టి అలాంటి ప్రయత్నం చేయకుండా ఉండడమే మంచిది. విశాఖలో భారీ సమావేశాలు జరుగుతున్నాయి. భవిష్యతలో ఇంకా అనేకం జరుగుతాయి. అటువంటి వాటిని స్టార్ హోటళ్లలో నిర్వహించి, కోట్ల రూపాయల బిల్లులు చెల్లించడం కంటే ఈ భవనాన్ని





ఉపయోగించుకుంటే బాగుంటుందనేది చాలా మంది అభిప్రాయం. అతిథి గృహాలుగా కూడా వాడుకునే అవకాశముంది. ఏదేమైనా నాన్చడం మాని, వీలైంత త్వరగా సద్వినియోగం చేసుకోవలసి ఉంది.

### హైకోర్టు మొట్టికాయలూ బేఖాతర్

అనుమతులకు మించి విశాఖ రుషికొండ ప్రాంతంలో 3.86 ఎకరాలను తవ్వేశామని జగన్ ప్రభుత్వమే తన అఫిడవిట్‌లో పేర్కొంది. అనుమతులకు మించి కొండను చదును చేసేందుకు ఎవరు అనుమతి ఇచ్చారని రాష్ట్ర హైకోర్టు ప్రశ్నించింది. హైకోర్టులో వ్యాజ్యం దాఖలైన తర్వాత.. అప్పటికే పూర్తయిన నిర్మాణాలకు అనుమతులు పొందినట్లు అఫిడవిట్‌లో వివరాలు స్పష్టం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేసింది. వాస్తవాలు తేల్చేందుకు కమిటీ వేయాలని కేంద్ర పర్యావరణ-అటవీ శాఖ(ఎంవోఈఎఫ్)ను ఆదేశించింది. ఎంత విస్తీర్ణంలో ఏపీటీడీసీ నిర్మాణాలు జరుపుతోంది, నిర్మాణాల కోసం ఎంత విస్తీర్ణంలో తవ్వకాలు జరిపారు, నిర్మాణాల దృఢత్వం కోసం ఎంత విస్తీర్ణం మేరకు కొండను చదును చేశారు, ఎంవోఈఎఫ్ అనుమతుల మేరకు నిర్మాణాలు జరిగాయా, లేదా, తదితర విషయాలపై సర్వే నిర్వహించి, నివేదిక సమర్పించాలని కార్పొరేషన్‌ను కూడా ఆదేశించింది. కొండపై జరుపుతున్న నిర్మాణాలతోపాటు కొండను పూర్వస్థితికి తీసుకొచ్చేందుకు తీసుకుంటున్న చర్యలపై స్థాయీ నివేదిక సమర్పించాలని కోరింది. అయినా పరిస్థితుల్లో మార్పు లేదు. ప్రధానంగా పర్యాటక శాఖ అడ్డగోలుగా వ్యవహరించింది. సాక్షాత్తూ హైకోర్టుకే అబద్ధం చెప్పింది. ఎలాంటి ఉల్లంఘనలకు పాల్పడలేదని కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేసింది. రిసార్ట్స్ పునరుద్ధరణ ప్రాజెక్టుకు అవసరమైన అన్ని అనుమతులు తీసుకున్నామని చెప్పడం గమనార్హం.

# గెట్ రెడీ.. ఇండియన్-3 వస్తోంది

సౌత్ ఇండియన్ ఫిలిం హిస్టరీలోనే బెస్ట్ మూవీస్‌లో ఒకటనదగ్గ 'ఇండియన్' సినిమాకు సీక్వెల్ అన్నపుడు ప్రేక్షకులు ఎంతగా ఎగ్జైట్ అయ్యారో. కానీ గత ఏడాది విడుదలైన ఈ సినిమా చూశాక.. ఆ కళాఖండాన్ని టచ్ చేయకుండా అలా వదిలేసి ఉంటే ఎంత బావుణ్నో అనుకున్నారంతా. 'ఇండియన్' ఎంత గొప్పగా అనిపిస్తుందో.. 'ఇండియన్-2' అంత పేలవంగా అనిపించి ప్రేక్షకులను తీవ్ర అసంతృప్తికి గురిచేసింది. ఫలితంగా సౌత్ ఇండియాలో బిగ్గెస్ట్ డిజాస్టర్లలో ఒకటిగా నిలిచిందీ సినిమా. ఆల్రెడీ తిన్న దెబ్బలు సరిపోవని.. 'ఇండియన్-2' ఇచ్చిన షాక్‌తో లైకా ప్రొడక్షన్స్ సంస్థ నిర్మాణమే ఆపేసే పరిస్థితికి వచ్చింది. ఈ స్థితిలో ఆల్రెడీ చాలా వరకు చిత్రీకరణ పూర్తి చేసుకున్న 'ఇండియన్-3' సంగతి ఏమవుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. 'ఇండియన్-2' రిలీజై అప్పుడే ఏడాది పూర్తి కాగా.. 'ఇండియన్-3' తిరిగి ఎప్పుడు పట్టాలెక్కుతుందో.. అసలు రిలీజవుతుందో లేదో అన్న సందేహాలు నెలకొన్నాయి.

కానీ ఇప్పుడు 'ఇండియన్-3' గురించి అప్‌డేట్ బయటికి వచ్చింది. ఈ సినిమా మళ్లీ సెట్స్ మీదికి వెళ్లనుందట. మిగిలిన చిత్రీకరణను పూర్తి చేయడానికి షెడ్యూల్స్ వేసేశారట. హీరో కమల్ హాసన్, దర్శకుడు శంకర్.. లైకా ప్రొడక్షన్స్‌తో ఒక ఒప్పందానికి వచ్చి ఈ సినిమాను పూర్తి చేయడానికి రెడీ అయ్యారని సమాచారం. ఈ విషయంలో సూపర్ స్టార్ రజినీకాంత్ రాయబారం నడిపినట్లు తెలుస్తోంది. లైకాలో '2.0', 'లాల్ సలామ్' చేసిన రజినీకి ఆ సంస్థ అధినేతలతో అనుబంధం ఉంది. ఆ స్నేహంతోనే ఆయన వారి కోసం కమల్, శంకర్‌లను ఒప్పించినట్లు తెలుస్తోంది. త్వరలోనే షూట్ మొదలు కాబోతోంది. ఇండియన్-3కి సంబంధించి ఇంకో 30 శాతం దాకా చిత్రీకరణ మిగిలి ఉన్నట్లు సమాచారం. దీనికి పారితోషకం తీసుకోకుండా పని చేయనున్నారట శంకర్, కమల్. ఐతే సినిమాను పూర్తి చేస్తే చేయొచ్చు కానీ.. థియేటర్లలో రిలీజ్ చేస్తారా అన్నది ప్రశ్న. ఇండియన్-2 అంత పెద్ద డిజాస్టర్ అయ్యాక తర్వాతి పార్ట్ చూడడానికి ప్రేక్షకులకు ఆసక్తి ఉండకపోవచ్చు. ఐతే ఇండియన్-2తో పోలిస్తే ఇండియన్-3 బెటర్ అని టీం వర్గాలు ముందునుంచి చెబుతున్నాయి. సినిమాకు థియేట్రికల్ బిజినెస్ జరగకపోతే మంచి డీల్ చేసుకుని ఓటీటీలో రిలీజ్ చేసే అవకాశాలు లేకపోలేదు.




# దేవర కొండ.. దేవర



టాలీవుడ్ రౌడీ బాయ్ విజయ్ దేవరకొండ నుంచి తాజాగా వచ్చిన చిత్రం 'కింగ్డమ్'. గౌతమ్ తిన్ననూరి డైరెక్ట్ చేసిన ఈ యాక్షన్ డ్రామాలో భాగ్యశ్రీ బోర్సే హీరోయినగా నటించింది. సత్యదేవ్, వెంకటేశ తదితరులు ఇతర ముఖ్యమైన పాత్రలను పోషించగా.. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మించారు. భారీ అంచనాల నడుమ విడుదలైన ఈ సినిమా అభిమానుల మెప్పుతో పాటు ప్రేక్షకుల ప్రశంసలూ అందుకుంటోంది. బాక్సాఫీస్ వద్ద సాలిడ్ వసూళ్లను సొంతం చేసుకుంటోంది. ఈ నేపథ్యంలోనే తాజాగా హైదరాబాద్‌లో విజయ్ దేవరకొండ విలేకర్లతో చిట్ చాట్ చేశాడు. మీడియా వారు అడిగిన అన్ని ప్రశ్నలకూ చాలా ఓపిగ్గా సమాధానం చెప్పాడు. కింగ్డమ్ మూవీ విశేషాలే కాకుండా తన అప్ కమింగ్ ప్రాజెక్టుల వివరాలనూ వెల్లడించాడు. ఈ క్రమంలోనే కింగ్డమ్‌కు మొదట అనుకున్న టైటిల్ ఏంటో రివీల్ చేసి అందర్నీ ఆశ్చర్యపరిచాడు. విజయ్ దేవరకొండ చెప్పిన ప్రకారం.. డైరెక్టర్ గౌతమ్ తిన్ననూరి ఈ చిత్రానికి 'దేవర నాయక' అనే టైటిల్‌ను ఖరారు చేయాలని భావించారట. కానీ.. ఎన్టీఆర్ 'దేవర' సినిమా కోసం తమ టైటిల్‌ను త్యాగం చేశామని కొండన్న తెలిపాడు. అలాగే 'కింగ్డమ్-2' కచ్చితంగా ఉంటుందని.. సెకండ్ పార్ట్‌లో ఒక తెగకు చెందిన నాయకుడు 'దేవర నాయక'గా ఎలా ఎదిగాడు అన్న దాని గురించి ఉంటుందని విజయ్ పేర్కొన్నాడు. కింగ్డమ్-2లో ఒక పెద్ద స్టార్ హీరో ఉంటాడని.. అదెవరన్నది గౌతమ్ చెప్తాడని విజయ్ తెలిపాడు.

# వేళ్లన్నీ తాడేపల్లివైపే!

మద్యం సొమ్ముల డెన్
బిగ్‌బాస్ ప్యాలెస్‌లోనే
ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టుతో
జగన్ బ్యాచ్‌లో కలవరం
'సిట్' తదుపరి టార్గెట్ తామే
కావచ్చని ఆందోళన
టెక్నాలజీ సాయంతో నిందితులకు
దర్యాప్తు బృందం షాక్
డెన్‌లలో నోట్ల కట్టల వీడియోలు రికవరీ
సెల్ ఫోన్లో డిలీట్ చేసినా వెలికితీత
గోవిందప్ప గోడౌన్‌లో మరో కట్టల వీడియో



నవ్యాంధ్రలో జగన్ సారథ్యంలో జరిగిన మద్యం కుంభకోణం కథ క్లైమాక్స్‌కు చేరింది. రూ.3,500 కోట్ల స్కాంలో అంతిమ లబ్ధిదారు ఆయనేనని.. దోచుకున్న సొమ్మంతా తాడేపల్లి డెన్‌లో దాచినట్లు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) కనిపెట్టింది. మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుమారుడు, రాజంపేట వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి ఈ స్కాం రింగ్‌మాస్టర్ అని తేల్చి ఆయన్ను అరెస్టు జైలుకు పంపడం జగన్ అండ్ కోకు గట్టి షాకిచ్చింది. తర్వాతి తమ వంతు కావచ్చని మాజీ ముఖ్యమంత్రి కలవరపడుతున్నట్లు వైసీపీ వర్గాల నుంచి అందిన విశ్వసనీయ సమాచారం. ఎంత తెలివైన దొంగైనా అయినా ఎక్కడో ఒక చోట తప్పుచేసి దొరుకుతాడన్నది పోలీసునానుడి. మద్యం కుంభకోణం నిందితులు కూడా తమ క్రిమినల్ బుర్రతో ఎంత తెలివిగా వ్యవహరించినా.. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా.. ఆధారాలు ధ్వంసం చేసినా.. ఈ టెక్నాలజీ యుగంలో తప్పించుకోలేకపోయారు. జగన్ పాలనలో జరిగిన అతిపెద్ద లిక్కర్ స్కాంలో వసూళ్లు చేసిన వ్యక్తులు ఆ డబ్బుల పంపిణీకి ముందు వీడియోలు తీసి సంబంధిత వ్యక్తులకు పంపారు. నగదు డెన్‌లలో దాచిన డబ్బుల వివరాలు ప్రభుత్వ, పార్టీ పెద్దలకు తెలియజేసేందుకు సెల్‌ఫోన్లో చిత్రీకరించారు.

అయితే ఎన్నికల తర్వాత ఊహించని ఫలితం రావడంతో కింగ్ పిన్ రాజ్ కసిరెడ్డి (ఏ-1) తాను ఏర్పాటు చేసుకున్న వసూళ్ల నెట్‌వర్క్‌లోని ప్రతి వ్యక్తినీ హైదరాబాద్‌కు పిలిపించి ఫోన్లు తీసేసుకున్నారు. వాటిలోని వీడియోలన్నిటినీ డిలీట్ చేశారు. ప్రతి ఫోన్‌కు కనీసం లక్ష రూపాయలకు తగ్గకుండా ఇచ్చేసి కొత్త ఫోన్ తీసుకోవాలని వారికి సూచించారు. లిక్కర్ ఆర్డర్లు పెట్టిన కంప్యూటర్లను కూడా మద్యం డిపోల్లో ధ్వంసం చేసేశారు. ఎక్కడికక్కడ ఇలాంటి జాగ్రత్తలు తీసుకున్నా.. సిట్ అధికారులు ఏదో ఒక దారిలో గుర్తిస్తారని తెలుసుకోలేకపోయారు. సిట్ బృందంలోని మెరికల్లాంటి పోలీసులు సాంకేతికంగా ఆలోచించి.. కసిరెడ్డి అండ్ కో డిలీట్ చేసిన వీడియోలు, ఇతర వివరాలను రిట్రీవ్ చేయడానికి మార్గం వెతికారు. ఏపీఎఫ్ఎస్ఎల్ వద్ద ఎలాంటి పరికరాలు ఉన్నాయో తెలుసుకుని 'డిలీట్ డేటా రిట్రీవల్' కోసం.. తాము స్వాధీనం చేసుకున్న నిందితుల ఫోన్లు పంపారు. ఇంకేముంది.. ఎన్నో రహస్యాలు వెలుగులోకి వచ్చాయి. చాటింగ్‌లు, సందేశాలు, ఫొటోలు, వీడియోలు సైతం బయటపడ్డాయి. వాటిని ఇటీవల కోర్టులో దాఖలుచేసిన చార్జిషీట్లో కూడా సిట్ పొందుపరచింది. ఇందులోని రెండు కీలక వీడియోలు అందరినీ ఆశ్చర్యపరుస్తున్నాయి. రూ.500 నోట్ల కట్టలతో కూడిన డెన్‌లు చూసి.. 'సినిమాల్లోనే ఇలాంటి దృశ్యాలు చూశాం' అంటూ ముక్కున వేలేసుకోక తప్పదు. ఒక వీడియోలో నల్ల దుస్తులు ధరించిన ఓ వ్యక్తి నోట్ల కట్టల మధ్యలో నిల్చొని.. 'ఈ ఐదు కోట్లు అక్కడికి.. ఈ ఏడు కోట్లు ఇక్కడికి.. ఆ నోట్ల కట్టల బాక్సు ఫలానా చోటుకు.. ఈ బండిల్స్ బ్యాగు ఆ కార్లోకి..' అంటూ ఎదురుగా ఉన్నవారికి చెబుతూ కనిపించాడు. వైసీపీలో రాయలసీమకు చెందిన ఓ కీలక నేతకు అతడు అత్యంత సన్నిహితుడిగా సిట్ అధికారులు గుర్తించారు. ఆ డబ్బు ఎవరెవరికి చేర్చాడు.. అలా ఎన్నిసార్లు తరలించాడు.. ఆ వీడియో ఎవరికి పంపాడు.. ఆ సమయంలో అక్కడున్న వ్యక్తులెవరు.. అనే విషయాలపై కూపీ లాగిన సిట్ అధికారులు అతిపెద్ద గుట్టు లాగినట్లు తెలిసింది. మరో వీడియోలో.. వ్యక్తులెవరూ కనిపించడం లేదు.. అయితే భారీగా నోట్ల కట్టలు పుస్తకాల షాపులో బుక్స్ పేర్చినట్లు కనిపిస్తున్నాయి. ఆ డెన్ ఇప్పటికే అరెస్టయి రిమాండ్లో ఉన్న భారతీ సిమెంట్స్ డైరెక్టర్ బాలాజీ గోవిందప్పదిగా దర్యాప్తులో తేలింది. ఆయన ఫోను నుంచే సదరు వీడియోను రిట్రీవ్ చేశారు.



### ఈ నెల 17న చార్జ్‌షీట్..

మూడున్నర వేల కోట్ల రూపాయల కుంభకోణం.. ఏడు దశల్లో ప్రణాళికాబద్ధంగా దోపిడీ.. ఇప్పటి వరకూ 49 మంది నిందితులు.. కింగ్ పిన్ రాజ్ కసిరెడ్డితో పాటు మాజీ సీఎం జగన్ సెక్రటరీ ధనుంజయ్‌రెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, వైసీపీ నేత చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దాకా 12 మంది అరెస్టు.. 200మందికి పైగా సాక్షులు, అనుమానితుల విచారణ.. 9 మంది విదేశాలకు పరారీ.. మూడు నెలలకు పైగా ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) సేకరించిన ఆధారాలన్నిటినీ విజయవాడ ఏసీబీ కోర్టులో దాఖలుచేసిన చార్జిషీటులో చేర్చారు. దోచుకున్న సొమ్ము ఎవరెవరు ఎలా పంచుకున్నారు.. జగన్ సలహాదారుగా పైకి కనిపించిన రాజ్ కసిరెడ్డి(ఏ-1) చేసిన కుట్ర, అతనితో కలిసి దోపిడీ ప్రణాళిక రచించిన వ్యక్తులు, మద్యం వ్యాపారుల నుంచి సేకరించిన ముడుపులు, వాటితో కొనుగోలు చేసిన బినామీ ఆస్తులు, విదేశాలకు తరలిన హవాలా సొమ్ము, ఎన్నికల్లో అభ్యర్థులకు పంపిణి చేసిన వైనాన్ని వివరించారు. లిక్కర్ పాలసీ రూపొందించడంలోనే మొదలైన కుట్ర ఎలా అమలైంది.. మార్కెట్లో ఉన్న మద్యం బ్రాండ్లను తొక్కేసి ముడుపులిచ్చిన అనామక కంపెనీల బ్రాండ్లు ప్రజలపై బలవంతంగా రుద్దడం.. ముడుపుల వసూళ్ల రూటింగ్ నుంచి హవాలా నెట్ వర్క్ ఏర్పాటు వరకూ ఎవరెవరు సూత్రధారులు, ఎవరెవరు పాత్రధారులో పక్కా ఆధారాలతో పొందుపరిచారు. కుట్రధారులతో పాటు ఎక్సైజ్ అధికారులు, గత ప్రభుత్వ పెద్దలు, వైసీపీ నాయకుల పాత్రపై ఇప్పటి వరకూ లభించిన ఆధారాలు సమర్పించారు.

### రింగ్ మాస్టర్ మిథున్‌రెడ్డే

మద్యం ముడుపుల దందాలో రాజంపేట ఎంపీ, వైసీపీ నేత పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డినే రింగ్‌మాస్టర్. మద్యం సిండికేట్‌కు ప్రాణంపోసింది మొదలు అది 3200 కోట్ల మేర సొమ్మును దోచుకునేందుకు జరిగిన వ్యూహాత్మక నేరపూరిత కుట్ర రూపకల్పన, దాని అమలకు ఆయనే కర్త, కర్మ, క్రియ అని సిట్ తేల్చింది. మద్యం ముడుపుల స్కాంకు ఆలోచన ఇవ్వడంతోపాటు దానిని ఆచరణలోకి తీసుకొచ్చి, వేల కోట్ల సొమ్మును కొల్లగొట్టి.. తాడేపల్లి ప్యాలెస్‌కు దానిని చేర్చేవరకు ఈయనే ప్రధాన పాత్రధారి అని సిట్ వెల్లడించింది. జూన్ 19న రాత్రి ఈ కేసులో మిథున్‌రెడ్డిని సిట్ అరెస్టు చేసి ఐపీసీ, అవినీతి నిరోధక చట్టంలోని పలు సెక్షన్ల కింద కేసు నమోదుచేసింది. 2014-19 వరకు మద్యం వ్యాపారం ప్రైవేటు షాపుల ద్వారా జరిగేది. ఆ సమయంలో మార్కెట్‌లో ఉన్న బ్రాండ్ల అమ్మకం డేటా ఆధారంగా ఆర్డర్ ఫర్ సప్లై (ఓఎఫ్ఎస్)ను అమలు చేసేవారు. ఇదంతా ఆటోమేటిగ్గా సాగిపోయేది. ఇదంతా ఆటోమేటిక్ ఎంటర్‌ప్రైజ్ రిసోర్స్ ప్లానింగ్( ఈఆర్‌పీ) విధానంలో నడిచింది. మధ్యలో అధికారులు, ప్రైవేటు వ్యక్తులు తలదూర్చి ఏ కంపెనీకి ఎంత ఆర్డర్ ఇవ్వాలో నిర్ణయించే విధానమే లేదు. 2019లో జగన్ ప్రభుత్వం వచ్చాక ఈ మద్యం నుంచి వేలకోట్ల రూపాయలు పిండుకోవాలని ప్లాన్‌వేశారు. ఈ ముడుపుల దందా ఎలా ఉండాలి? ఎలా అమలు చేయాలి? ఇందులో ఎవరెవరు భాగస్వాములవ్వాలి? డిస్టిలరీస్ ఏం చేయాలి? ఏపీ బేవరేజెస్ కార్పొరే షన్ లిమిటెడ్‌ను ఎలా వాడుకోవాలి? అక్కడి అధికారులను గుప్పిట్లోపెట్టుకొని తమ ప్లాన్‌లను ఎలా అమలు చేయాలన్న అంశాలన్నీ మిథున్‌రెడ్డి బుర్రలోనుంచి వచ్చినవేనని తేలింది. నిర్మాణాత్మక నేరపూరిత నిధుల దోపిడీ కుట్రకు తిరుపతిలోని తన ఇంటి నుంచే శ్రీకారం చుట్టారు. బేవరేజెస్ కార్పొరేషన్‌లో అసిస్టెంట్ కమిషనర్‌గా ఉన్న సత్యప్రసాద్‌ను పావుగా వాడుకున్నారు. 2023 కోటాలో ఐఏఎస్ పదోన్నతి కల్పిస్తామని ఆశచూపారు. ఎంపీ హామీలకు, చూపిన ఆశలకు సత్యప్రసాద్ లొంగిపోయారు. ఇది జరిగిన ఐదు రోజుల తర్వాత.. 2019 అక్టోబరు 13న రెండో మీటింగ్ హైదరాబాద్‌లో అప్పటి ఎంపీ విజయసాయిరెడ్డి నివాసంలో జరిగింది. మిథున్‌రెడ్డి, విజయసాయిరెడ్డి, రాజ్‌కసిరెడ్డి, అప్పటి బేవరెజెస్ కార్పొరేషన్ ఎండీ వాసుదేవరెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సమావేశంలోనే మద్యం సిండికేట్ ఎలా ఉండాలి.. ఎలా పనిచేయాలి.. డిస్టిలరీస్ నుంచి ముడుపులు ఎలా వసూలు చేయాలి.. ఏయే మద్యం బ్రాండ్లను ప్రోత్సహించాలనే అంశాలపై కీలక చర్చ జరిగింది. కనీసం నెలకు రూ.50-60 కోట్ల మేర మద్యం ముడుపులు రాబట్టాలని మిథున్‌రెడ్డి ప్లాన్‌వేశారు. మద్యం అమ్మకాల బేస్ ధరపై కనీసం 12 శాతం కమిషన్ వసూలు చేయాలని ప్రతిపాదించారు. ఇలాగయితే, నెలకు కనీసం 50-60 కోట్లు డిస్టిలరీనుంచి ముడుపులు వస్తాయని ఆయన




స్కామ్‌ను డిజైన్ చేశారు. మాన్యువల్ పంపిణీ విధానం తీసుకురావాలని వాసుదేవరెడ్డి, సత్యప్రసాద్‌లను ఆదేశించారు. ఈ విధానం అమలులో సత్యప్రసాద్ పాత్ర కీలకం కావడంతో ఆయనకు బేవరేజెస్ కార్పొరేషన్‌లో సకల బాధ్యతలు నిర్వహించే ప్రత్యేక అధికారిగా నియమిస్తూ వాసుదేవరెడ్డి ఆదేశాలు జారీ చేశారు. మిథున్‌రెడ్డి సూచనల మేరకు ఆన్‌లైన్ సరఫరా విధానాన్ని సత్యప్రసాద్ తొలగించారు. మాన్యువల్ సరఫరా విధానం తీసుకొచ్చారు. డిస్టిలరీస్, కంపెనీలతో ముడుపులు మాట్లాడేందుకు మిథున్‌రెడ్డి ప్రత్యేకంగా మనుషులను నియమించారు. ముడుపులు చెల్లించేందుకు అంగీకరించిన డిస్టిలరీల నుంచే సరుకు తీసుకుని వాటినే ప్రభుత్వ రిటైల్ దుకాణాల్లో విక్రయించాలని ఆదేశించారు. ఈ మేరకు డిస్టిలరీల నుంచి తీసుకునే ముడుపులను 20 శాతానికి పెంచేశారు. ముడుపులు ఇస్తున్న కంపెనీలకు లాభాలు చేకూర్చేందుకు మార్కెట్‌లో మద్యం ధరలు పెరిగేలా, కంపెనీలకు లాభం వచ్చేలా, ఎక్కువగా తాము సూచించిన కంపెనీల మద్యం మాత్రమే అమ్ముడయ్యేలా ఎంపీ మాస్టర్‌మైండ్‌గా పనిచేశారు. డిస్టిలరీల నుంచి వసూలు చేసిన సొమ్ముతో బంగారం కొనుగోలు, రియల్‌ఎస్టేట్ వ్యాపారంలో భారీగా పెట్టుబడులు పెట్టించారు. ఆఫ్రికా, అమెరికా దేశాల్లో అక్రమంగా పెట్టుబడులు పెట్టించారు. ఎస్పీవై ఆగ్రోస్, శాన్‌హోక్‌లాబ్, డీ-కార్ట్ లాజిస్టిక్స్ మధ్య కోట్లాది రూపాయల లావాదేవీలు నడిపించారు. చివరకు డీ-కార్ట్ లాజిస్టిక్స్ ఖాతా నుంచి నుంచి ఆయన కుటుంబ కంపెనీ పీఎల్‌ఆర్ ప్రాజెక్టుకు రూ.5 కోట్లు బదిలీ అయ్యాయి. దీనివల్లే ఆయన ఈ స్కాంలో అడ్డంగా దొరికిపోయారు. కీలక నిందితులుగా ఉన్న రాజ్ కసిరెడ్డి, చాణక్య, ప్రణయ్‌ప్రకాశ్, వెంకటేశ్ నాయుడు, సైఫ్, , సైమన్ తదితరులతో ఎంపీ అనేక సందర్భాల్లో కలిసి సమావేశాల్లో పాల్గొన్నారు. వారితో వాట్సాప్ చాటింగ్ కూడా చేశారు. నిందితుల వాట్సాప్ డేటాను పరిశీలించినప్పుడు ఈ విషయాలు వెలుగులోకి వచ్చాయి. 2023 మే నుంచి 2024 మే వరకు ఏడాది కాలంలో మద్యం ముడుపుల కేసులో కీలక నిందితులుగా ఉన్న వారితో ఎంపీ అనేక సందర్భాల్లో ఫోన్‌లో మాట్లాడారు. ఇదే కేసులో నిందితులుగా ఉన్న కృష్ణమోహన్‌రెడ్డి (55 సార్లు), చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి (23 సార్లు), మోహితరెడ్డి (4 సార్లు), వాసుదేవరెడ్డి, ధనుంజయ్‌రెడ్డిలతో అనేక సార్లు ఫోన్‌లో మాట్లాడారు. ప్రత్యేక సీఎస్ రజత భార్గవ, ఈ కేసులో సాక్షిగా ఉన్న బీవీఎస్ డిస్టిలరీస్ ఎండీ వెంకటసుబ్బారావుతో కూడా మిథున్‌రెడ్డి ఫోన్‌లో మాట్లాడినట్లు సిట్ పలు సాంకేతిక ఆధారాలను కోర్టు దృష్టికి తీసుకెళ్లింది. ఎంపీ, ఇతర నిందితులు,సాక్షుల కాల్‌డేటా రికార్డ్స్ (సీడీఆర్), ఇతర సాంకేతిక డేటాను కూడా సమర్పించింది.

### ఉలిక్కిపడ్డ తాడేపల్లి

ఢిల్లీ లిక్కర్ స్కాంలో మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ సహా.. ఆయన సహచరులపై అవినీతి మరక పడింది. ఈ కేసులో కేజ్రీవాల్ జైలుకు పోవడంతోపాటు సీఎం పదవిని కూడా కోల్పోయారు. ఆ తర్వాత జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆయనతో పాటు ఆయన పార్టీ ఆప్ కూడా ఓడిపోయింది. ఇంతాచేసి ఢిల్లీ లిక్కర్ స్కాం సైజు రూ.100 కోట్లు. ఈ మాత్రం ముడుపులకే కేజ్రీ బృందం అంత 'మూల్యం' చెల్లించుకుంది. మరి.. జగన్ హయాంలో జరిగిన మద్యం స్కాం పరిమాణం రూ.3,500 కోట్లు. ఈ కుంభకోణంలో తమ కీలక నేతలందరూ సాంకేతిక ఆధారాలతో సహా దొరికిపోయి.. వరుసగా అరెస్టవుతుండడంతో తాడేపల్లి ప్యాలెస్‌లో ఒక్కసారిగా కలవరం మొదలైంది. ఇంతకాలం ఈ కేసు తుస్సుమంటుందని, ఆధారాలే లేవని మాజీ సీఎం జగన భావిస్తూ వచ్చారు. కానీ ఆయన అంచనాలన్నీ తల్లకిందులు చేస్తూ.. ఆయన సన్నిహితులందరినీ సిట్ అరెస్టు చేసేస్తోంది. తాజాగా తనకు అత్యంత సన్నిహితుడైన మిథున్‌రెడ్డిని కూడా అరెస్టు చేయడంతో జగన్‌కు భయం పట్టుకుందని వైసీపీ ముఖ్యనేతలు చెబుతున్నారు. గతంలో అక్రమాస్తుల వ్యవహారంలో సీబీఐ ఆయన్ను అరెస్టు చేయడం.. 16 నెలలు చంచల్‌గూడ జైల్లో ఉన్న సంగతి తెలిసిందే. గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం 11 సీట్లే వచ్చాయని.. మద్యం కేసులో తాను గనుక అరెస్టయితే తన రాజకీయ జీవితమే సమాధి అవుతుందని ఆయన ఆందోళన చెందుతున్నారని అంటున్నారు. వాస్తవానికి మిథున్‌రెడ్డి అరెస్టుకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేయాలని ఆయన ఆలోచన చేశారు. అందుకు కీలక నాయకులెవరూ సహకరించలేదని సమాచారం. సిట్ తన చార్జిషీటులో జగన్ పేరును ప్రస్తావించింది కూడా. దీంతో ఏ క్షణాన్నైనా ఆయన్ను అరెస్టు చేస్తారన్న అభిప్రాయానికి తాడేపల్లి ప్యాలెస్ వచ్చేసిందని సమాచారం. మిథున్‌రెడ్డి అరెస్టు కావడంతో ఒక దశలో జగన్ 'మూకుమ్మడి రాజీనామాల' వ్యూహం గురించీ ఆలోచించారు. తన ఆలోచనను కొందరు ముఖ్యనేతల ముందు ఉంచారు. అయితే ఐదుగురు ఎమ్మెల్యేలు ఈ ప్రతిపాదనను గట్టిగా తిరస్కరించారని తెలిసింది. ఈ వ్యూహం 'వర్కవుట్' కాదని కొందరు ముఖ్యనేతలు కూడా తేల్చిచెప్పారని అంటున్నారు.



# హవ్వ.. ఇంత అన్యాయమా?

వారంతా అవినీతి అధికారులు! అవినీతి నిరోధక శాఖకు అడ్డంగా దొరికిపోయిన తిమింగలాలు. కానీ.. నోటిఫై కాని పోలీస్ స్టేషనలో వారిపై కేసులు నమోదు చేయడం చెల్లదంటూ.. సాంకేతిక కారణాలతో హైకోర్టు ఆ కేసులను రద్దు చేయడం రాష్ట్ర ప్రజానీకాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. ఆయా కేసులు నమోదు చేసేనాటికి విజయవాడలోని ఏసీబీ సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ యూనిట్(సీఐయూ) కార్యాలయాన్ని పోలీస్ స్టేషన్‌గా నోటిఫై చేయలేదని.. దీనిపై ప్రభుత్వం ఎలాంటి గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయలేదని కోర్టు తన తీర్పులో గుర్తు చేసింది. కాబట్టి విజయవాడ ఏసీబీ సీఐయూలో నమోదైన ఎఫ్‌ఐఆర్‌లకు చట్టబద్ధత ఉండదని పేర్కొంది. సదరు ఎఫ్‌ఐఆర్‌లను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన.హరినాథ్ తీర్పు ఇచ్చారు. ఆదాయానికి మించిన ఆస్తులున్నాయనే ఆరోపణలతో రాష్ట్రవ్యాప్తంగా వివిధ శాఖలకు చెందిన 15 మంది అధికారులు, ఉద్యోగులపై విజయవాడలోని ఏసీబీ సీఐయూ కార్యాలయం ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేసింది. నోటిఫైకాని పోలీస్ స్టేషన్‌లో ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేసినందున వాటికి ఎలాంటి చట్టబద్ధతా ఉండదని, వాటిని కొట్టివేయాలని కోరుతూ ఆ 15 మంది అధికారులు హైకోర్టును ఆశ్రయించారు. చట్టప్రకారం.. సదరు ఏసీబీ సీఐయూను పోలీస్ స్టేషన్‌గా గుర్తించేందుకు ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వాల్సి ఉంటుందని.. కానీ, ఈ మేరకు ప్రభుత్వం ఎలాంటి గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వలేదని వాదించారు. ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించిన అడ్వొకేట్ జనరల్.. సాంకేతిక కారణాలు చూపి ఎఫ్‌ఐఆర్‌లను కొట్టివేయాలని కోరలేరని వాదించినప్పటికీ ఉపయోగం లేకపోయింది. ఏసీబీ విభాగంలోని జాయింట్ డైరెక్టర్ల కార్యాలయాలను పోలీస్ స్టేషన్లుగా గుర్తిస్తూ 2003లో ప్రభుత్వం జీవో ఇచ్చిందని ఏజీ గుర్తుచేశారు. పునర్విభజన చట్టంలోని 101, 102 సెక్షన్ల ప్రకారం రాష్ట్ర విభజన అనంతరం ఆ చట్టాలు అమల్లో ఉంటాయని తెలిపారు. విజయవాడలోని ఏసీబీ సీఐయూ కార్యాలయాన్ని పోలీస్ స్టేషన్‌గా నోటిఫై చేస్తూ 2022లో నోటిఫికేషన్ ఇచ్చినప్పటికీ, కేసులు నమోదు చేసేందుకు వాటికి తాత్కాలికంగా అర్హత ఉంటుందని తెలిపారు.






# హింసోన్మాదం.. వికృత మనస్తత్వం

నాయకుడా.. ఫ్యాక్షనిస్టా?
రప్పా రప్పా నరకడం అంటే సినిమా డైలాగట!
సెన్సార్ సర్టిఫికెట్ వచ్చాక దానినెందుకు
వాడకూడదని వితండ వాదన
సినిమాను నిషేధించాలని అడగాలట!
ఓ మాజీ సీఎం మాట్లాడేది ఇలాగేనా?
వైసీపీ అధినేత అసలు రూపం బట్టబయలు
సమాజానికి జగన్ ఏం చెప్పదలుచుకున్నారు?
అసలాయన మానసిక స్థితి సరిగా ఉందా..?
హింసను, శాంతిభద్రతలకు విఘాతం కలిగించడాన్ని ఎందుకు ప్రోత్సహిస్తున్నారు?






ప్రత్యర్థులను రప్పా రప్పా నరుకుతామని వైసీపీ శ్రేణులు ఏకంగా ఫ్లెక్సీలే పెడుతుంటే అడ్డుకోవలసిన ఓ రాజకీయ పార్టీ అధ్యక్షుడు.. అందునా ఓ మాజీ ముఖ్యమంత్రి నిస్సిగ్గుగా సమర్థించుకోవడమేంటి? తాను నాయకుడిని కాదు.. ఫ్యాక్షనిస్టునని చెప్పదలచుకున్నారా? తిరిగి అధికారంలోకి రాబోతున్నామని నిమిషానికోసారి ధీమాగా ప్రకటిస్తున్న ఆయన.. ఇంత తెంపరితనంతో మాట్లాడాల్సిన అవసరమేముంది? నరుకుతాం.. చంపుతామంటూ కేడర్‌ను రెచ్చగొట్టడమేంటి..? గట్టిగా వ్యవహరించడానికి చంద్రబాబు ప్రభుత్వం జంకుతున్నట్లు కనబడుతోంది. ఈ నేపథ్యంలో ఇలాంటి నేతల నుంచి రాష్ట్రాన్ని ప్రజలే కాపాడుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. పల్నాడు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గం రెంటపాళ్లలో.. గత ఏడాది జూన్‌లో జగన్ అధికారంలో ఉన్నప్పుడే.. బెట్టింగులో డబ్బు పోగొట్టుకుని ఆత్మహత్య చేసుకున్న ఓ వ్యక్తి కుటుంబాన్ని పరామర్శిస్తానంటూ ఆయన అక్కడకు బయల్దేరారు. 12 కార్లలో మాత్రమే రావాలని పోలీసులు  సూచిస్తే.. ఊరేగింపులా 70 వాహనాల్లో బయల్దేరారు. వంద మంది కంటే ఎక్కువ రావొద్దని కోరితే ముందురోజే అడ్డదారుల్లో వేల మంది రెంటపాళ్ల చేరుకున్నారు. అయితే గుంటూరు బైపాస్ వద్ద సింగయ్య అనే వైసీపీ కార్యకర్త జగన్ కారు కిందపడ్డారు. కారు టైరు ఆయన మెడపైగా వెళ్లడం వీడియోల్లో స్పష్టంగా కనిపించింది.

అయినా జగన్ గానీ, అందులో ఉన్న వైసీపీ నేతలు గానీ కనీసం కారు దిగలేదు. సింగయ్యకు ఏమైందో ఆరా తీయలేదు. పైగా బయటున్న వైసీపీ కార్యకర్తలు అతడిని కారు కింద నుంచి లాగి అవతలపడేసి వెళ్లిపోయారు. స్థానికులు అంబులెన్సులో ఆస్పత్రికి తీసుకెళ్తే అతడు చనిపోయాడు. అతడి  భార్య ఫిర్యాదుతో పోలీసులు జగన్ అండ్ కోపై కేసు నమోదు చేశారు. జగన్ తీరుపై

ఇంటా బయటా విమర్శలు చెలరేగడంతో పార్టీ నేతలను పంపి మృతుడి కుటుంబానికి రూ.10 లక్షలు పంపి చేతులు దులుపుకొన్నారు. పొరపాటైందని ఓ ప్రకటన చేస్తే అందరూ వదిలేసేవాళ్లు. ప్రభుత్వం కూడా సీరియస్‌గా తీసుకునేది కాదు.. నేరపూరితంగా ఆలోచించి జగన్ కేసును తప్పుదారి పట్టించే ప్రయత్నం చేశారు. సింగయ్య భార్య లూర్దు మేరీని, కుటుంబ సభ్యులను తాడేపల్లి ప్యాలెస్‌కు పిలిపించుకున్నారు. వారిని ఓదార్చారో లేదో గానీ.. మీడియాతో ఎలా మాట్లాడాలో  బాగా శిక్షణ ఇచ్చారు. పోలీసులు ఒత్తిడి చేస్తేనే ఫిర్యాదు చేశానని.. తన భర్త కారు కింద పడి చనిపోలేదని, తీసుకెళ్లిన అంబులెన్సులోనే ఏదో జరిగిందని పోలీసులపై నిందలేయించారు. కానీ అంబులెన్సులో తీసుకెళ్లింది వైసీపీ స్థానిక కార్యకర్తలే. పోనీ లోపల పోలీసులు, వైద్య సిబ్బంది ఉండారనుకుందాం.. సింగయ్య ఎవరో వారికెలా తెలుస్తుంది.. అతడిని చంపితే వారికేమొస్తుంది? ఇంత క్రిమినల్ మైండ్‌తో ఆలోచించే నాయకులు ప్రపంచంలో ఎవరైనా ఉంటారా? అదేమని అడిగితే.. చనిపోయింది మా కార్యకర్త.. పది లక్షలు ఇచ్చామని అంటుంటే ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. ఏడవాలో నవ్వాలో అర్థం కావడం లేదు. నోరెత్తితే చంద్రబాబు వయసు 76 ఏళ్లు.. ఇంకెన్నాళ్లుంటాడు.. ఏ క్షణమైనా పోతాడు.. జగన్ అండ్ కో నోటివెంట ఇవే మాటలు.

వీరు మాత్రం శాశ్వతమా..? అయినా ఎదుటి మనిషి చావు కోరడమేంటో.. ఎవరు చనిపోతారా.. నవ్వుతూ ఊరేగింపులతో పరామర్శలకు వెళ్దామా.. రాజకీయ లబ్ధి పొందుదామా.. ఇవే ఆలోచనలు.

### ఇదేనా మానవత్వం!

మనం ప్రయాణిస్తున్న కారు కింద పొరపాటున కుక్క, కోతిలాంటి జంతువులు పడినా విలవిల్లాడిపోతాం! ప్రమాదవశాత్తూ వాహనం మనిషిని తాకితే... మరింత అప్రమత్తమవుతాం. తక్షణం... స్పందించి అంబులెన్స్‌కు ఫోన్ చేయడమో, అంత సమయంలేకపోతే అదే కారులో ఆస్పత్రికి తీసుకెళ్లడమో చేస్తాం. ఇది... కారు డ్రైవర్‌దే కాదు, అందులో ప్రయాణిస్తున్న వారి మానవీయ, నైతిక, చట్టపరమైన బాధ్యత! కానీ.... వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డికి, ఆయన సైన్యానికీ ఇవేవీ పట్టలేదు. తాను ప్రయాణిస్తున్న కారుకింద ఒక మనిషి పడి నలిగిపోయినా ఆయన పట్టించుకోలేదు. కారు నడుపుతున్న డ్రైవరుకు చీమ కుట్టినట్లయినా అనిపించలేదు. అదే కారులో ప్రయాణిస్తున్న 'ప్రముఖులకు' ఆ ప్రాణం విలువ తెలియలేదు. జన సమీకరణ వద్దూవద్దూ అని పోలీసులు చెప్పినా వినకుండా,,, సత్తెనపల్లి నియోజకవర్గంలో జగన్ చేసిన బల ప్రదర్శనకు రెండు ప్రాణాలు బలైపోయిన సంగతి తెలిసిందే. ఇందులో... సింగయ్య అనే వృద్ధుడి ఊపిరి జగన్ ప్రయాణిస్తున్న కారు కిందే పడి ఆగిపోయింది. ఆయన ఆర్తనాదాలు 'రప్పా రప్పా' ఉన్మాద నినాదాల హోరులో కలిసిపోయాయి. జగన్‌తోపాటు కారులో ఉన్న వారెవరూ ఆ వృద్ధుడి ప్రాణాలకు విలువ ఇవ్వలేదు. 'పడిపోయాడు... పడిపోయాడు' అంటూ కారు చుట్టూఉన్న కొందరు ఆందోళనకు గురైనా, 'జరగరానిది ఏదో జరిగింది' అని తెలియకపోయే అవకాశమే లేదు. అయినా... కారులోపల ఉన్నవారూ స్పందించలేదు. టైరుకు అడ్డంపడిన కర్రముక్కనో, రాయినో తీసేసినట్లుగా సింగయ్యను కార్యకర్తలు పక్కకు లాగేశారు. ఆ తర్వాత... జగన్ వాహనం ముందుకు వెళ్లిపోయింది. సింగయ్య ప్రాణం గాలిలో కలిసిపోయింది. 'జగన్ కాన్వాయ్‌లోని ఏదో కారు సింగయ్యను గుద్దింది' అని పోలీసులు తొలుత భావించారు. కానీ... అది స్వయంగా జగన్ ఎక్కిన కారే అని వీడియోలతో సహా నేడు బయటపడింది. జరిగింది ప్రమాదమే కావొచ్చు! కానీ... దీనిపై జగన్, ఆయన నేతాగణం స్పందనారాహిత్యమే విస్తుగొలుపుతోంది. పోలీసులు వందమందిని అనుమతిస్తే వేలమందితో సత్తెనపల్లికి వెళ్లడం ఒక నేరం! నిర్లక్ష్యంగా కారు నడిపి మనిషిని ఢీకొట్టడం ఒక నేరం! ఆ తర్వాతైనా స్పందించకుండా, క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించకుండా వెళ్లిపోవడం మరింత పెద్ద నేరం! తమ కారణంగా ఒక నిండుప్రాణం పోయిందని తెలిసీ, సంఘటన జరిగి రోజులు గడచినా స్పందించకపోవడం మరో నేరం! సింగయ్య మృతికి రోడ్డు ప్రమాదమే కారణమని పోస్టుమార్టం నివేదికలో స్పష్టమైంది. సింగయ్య కారు టైరుకు రోడ్డుకు మధ్య నలిగిపోవడం.. కారు చక్రం తగలడంతో అతని పక్కటెముకలు విరిగి  ఊపిరితిత్తులలో గుచ్చుకుపోయాయి. అంతేగాక కుడివైపు ఛాతీ మీద.. ఆయన రోడ్డుకు, టైరుకు మధ్య నలగడంతో చీరుకుపోయిన గాయం ఉంది. పక్కటెముకలు గుచ్చుకోవడం వల్ల ఛాతీలో రక్తం కూడా ఉన్నట్లు, లివర్ కూడా గాయమైనట్లు పోస్టుమార్టం నిర్వహించిన వైద్య నిపుణులు పేర్కొన్నారు. పోలీసులు వద్ద ఉన్న ఆధారాల ప్రకారం  జగన్ కారు కింద సింగయ్య పడడం, ఆయా గాయాలతోనే మృతి చెందడం, సింగయ్య తమ కారు కింద పడిన విషయం తెలిసినప్పటికీ జగన్‌తో పాటు కారులో ఉన్న వైసీపీ నాయకులు ఏమి ఎరగనట్లు సింగయ్యను పక్కకు లాగించి ముందుకు వెళ్లిపోవడం తదితర ప్రతి అంశానికి సంబంధించి పోలీసులు వద్ద అన్ని ఆధారాలు ఉన్నాయి. అయినప్పటికీ గతంలో తన బాబాయి వివేకానంద రెడ్డి హత్య విషయంలో ఆడిన డ్రామాలే ఇప్పుడు సింగయ్య మృతి విషయంలోనూ ఆడుతుండడంచూసి పోలీసు అధికారులు సైతం విస్మయం చెందుతున్నారు. వాస్తవానికి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తికి సంబంధించిన కేసులో నిందితుడి భార్య, కుటుంబ సభ్యులను ఇంటికి పిలిపించుకోవడమే కాకుండా కేసును తప్పుదారి పట్టించేలా ఆమెతో మాట్లాడించడం వంటివి చట్టరీత్యా నేరం. అయినప్పటికీ సింగయ్య మృతి కేసులో అటు పోలీసులను, ఇటు కోర్టులను తప్పుదారి పట్టించాలనే ఉద్దేశంతో జగన్, వైసీపీ నాయకులు సరికొత్త డ్రామాకు తెరతీయడం అనేది నీచ సంస్కృతి. జగన్ కుయుక్తులకు చెక్‌పెట్టేందుకు పోలీసులు అన్ని ఆధారాలతో సిద్ధమయ్యారు.

### రప్పా.. రప్పా నరుకుతానంటే మంచిదే కదా!

రెంటపాళ్ల పర్యటనలో వైసీపీ కార్యకర్తలు రెచ్చిపోయారు. ఓ కార్యకర్త ఏకంగా టీడీపీ

వాళ్లను గంగమ్మ జాతరలో పొట్టేలు తల నరికినట్లుగా రప్పారప్పా నరికేస్తానంటూ ఫ్లెక్సీలు పెట్టాడు. ఈ ఉన్మాదం గురించి మీడియా ప్రశ్నిస్తే జగన్ నిర్లజ్జగా వెనకేసుకొచ్చారు. 'నెక్ట్స్ మన ప్రభుత్వంలో టీడీపీ వాళ్లను రప్పా రప్పా ..ఏం జాతరమ్మా అది గంగమ్మ జాతరలో ఏంటమ్మా అది పొట్టేలు తల నరికినట్టా .. రప్పారప్పా నరుకుతానన్నాడు మంచిదేకదా' అని అన్నారు. అడిగిన విలేకరికి, మిగతా మీడియా ప్రతినిధులకు, అక్కడున్న వైసీపీ నేతలకు నోట మాటరాలేదు. ఇలాంటి వ్యక్తి సీఎం ఎలా అయ్యాడని చూసినవారు తిట్టుకుంటున్నారు. పైగా ఆయన రాక్షసానందం ఏమిటంటే.. నరుకుతామన్న మాటను పదే పదే మీడియాను అడిగి చెప్పించుకోవడం. 'ఆ డైలాగ్ మళ్లీ చెప్పమ్మా.. ఆ పూర్తి డైలాగ్ చెప్పు.. ఆ మళ్లా చెప్పు .. గట్టిగా చెప్పు వినపడటం లేదు. మైకు తీసుకుని చెప్పు బాగా అర్థమవుతుంది.. రప్పారప్పా నరికేస్తాం అని.. అదేదో సినిమా డైలాగ్ అనుకుంటా .. యా సినిమా డైలాగ్ అది.. పుష్ప సినిమా డైలాగులా అవి .. మరి నువ్వే ( మీడియా ప్రతినిధులను ఉద్దేశించి) చెబుతున్నావయ్యా స్వామి .. పుష్ప సినిమా డైలాగులు పెట్టినా తప్పేనా ? డెమోక్రసీలో ఉన్నామా ? డెమోక్రసీలో లేమా సామీ నాకు అర్థం కావడం లేదు. అంటే సినిమా డైలాగులు పెట్టినా తప్పేనా? పుష్ప ఫొటోలు పెట్టినా తప్పే.. గడ్డం ఇట్లన్నా తప్పేనా .. గడ్డం ఇట్లన్నా తప్పేనా? ఏందీ సామీ ఇది.. ఏ ప్రపంచంలో ఉన్నాం సామీ' అని వ్యాఖ్యలు చేశారు. తన కారు కింద మనిషి పడితే పక్కకు ఈడ్చిపడేయించిన వ్యక్తి నుంచి ఇంతకంటే మంచి మాటలు ఆశించడం తప్పే. జగన్ ఆలోచనలు చూస్తుంటే.. రాష్ట్రం ప్రశాంతంగా ఉండకూడదు. పెట్టుబడులు రాకూడదు. ప్రజలు ప్రశాంతం ఉండకూడదు అన్నట్లుగా ఉందని టీడీపీ నేతలు మండిపడుతున్నారు.. తన వ్యాఖ్యలపై విమర్శలు వచ్చినా ఆయన తగ్గలేదు. పుష్ప సినిమాకు సెన్సార్ సర్టిఫికెట్ ఇచ్చిందని.. అలా మాట్లాడడంలో తప్పులేదని.. అలాగైతే ఆ సినిమాను నిషేధించాలని వితండ వాదనకు దిగడం గమనార్హం. అంత బహిరంగంగా రప్పారప్పా నరికేస్తామంటూ తన వాళ్లే ఫ్లెక్సీలు, కరపత్రాలు నెడితే ఖండించాల్సింది పోయి.. మాజీ ముఖ్యమంత్రిగా సంతోషిస్తానంటారా? సమాజానికి ఏం చెప్పదలుచుకున్నారు? వార్ డిక్లేర్ అనడం హింసను ప్రేరేపించడం కాదా! ఎవర్ని నరుకుతారు మీరు? ప్రజలనా? ప్రజాస్వామ్యాన్నా? రాజకీయ నాయకుడు ఓటమి తర్వాత సమీక్ష చేసుకోవాలి. మార్పు చెందాలి. కానీ జగనలో ఏ మార్పూ కనబడటం లేదు. తెనాలి పోయి 10 కేసులున్న రౌడీషీటర్‌ను పరామర్శించారు. పోనీ ఆ కేసులు టీడీపీ కూటమి సర్కారు వచ్చాక పెట్టినవా అంటే అదేం కాదు.. వైసీపీ పాలనలో పెట్టినవే. ఇది తెలిసినా కావాలని అక్కడకు వెళ్లారు. రౌడీ షీటర్‌పైన, గంజాయి బ్యాచ్‌పైన ఎంత ప్రేమ! రాష్ట్రానికి తన జమానాలో చేసింది శూన్యం. అంతా నాశనం చేసి పోయారు. చంద్రబాబు తన అనుభవంతో పాలనను గాడినపెట్టి.. లక్షల కోట్ల పెట్టుబడులు తెస్తుంటే జగనకు కడుపుమంటగా ఉందని ఆయన మాటలు, ప్రవర్తనను బట్టే తెలిసిపోతోంది. దీనికి మందు లేదు. ఇలాంటి దుర్మార్గ ఆలోచనలు చేసే వ్యక్తిని రాజకీయంగా భూస్థాపితం చేస్తేనే నవ్యాంధ్రకు మనుగడ అని రాజకీయ విశ్లేషకులు సైతం అంటున్నారు.



### 'తల్లికి వందనం' భయపెడుతోందా?

ప్రతి ఇంట్లో ఇద్దరు పిల్లలకు అమ్మ ఒడి కింద ఆర్థిక సాయం చేస్తానన్న జగన్.. తన హయాంలో ఒక్కరికే పరిమితం చేశారు. అది కూడా సవాలక్ష ఆంక్షలు పెట్టి లబ్ధిదారుల సంఖ్యను తగ్గించారు. అయితే చంద్రబాబు వచ్చాక ఇంట్లో ఎందరు పిల్లలున్నా తల్లికి వందనం కింద రూ.15 వేల చొప్పున ఇస్తున్నారు. కొన్ని ఇళ్లలో ఆరుగురు పిల్లలున్నా ఇవ్వడం సర్వత్రా విస్మయం కలిగిస్తోంది. ఇది జగన్‌కు మరింత కంటగింపుగా మారింది. వాస్తవానికి ఈ పథకానికి నిధులు సమీకరించుకోవడానికి కూటమి ప్రభుత్వం చాలా కష్టపడాల్సి వచ్చింది. పన్నుల ఆదాయాన్ని పెంచుకుని.. వచ్చిన దానిని ఈ స్కీంకు వినియోగించారు. ప్రజల్లో అందునా మహిళల ఆనందానికి అంతేలేదు. ఏ పార్టీ వారో చూడకుండా అందరికీ ఇస్తుండడంతో జగన్ తట్టుకోలేకపోతున్నారు. అందుకే అందరికీ అందడం లేదని పచ్చిగా అబద్ధమాడుతున్నారు. అమలవుతున్న స్కీముల నుంచి జనం దృష్టి మళ్లించడానికే పరామర్శల పేరుతో జనంపై దండయాత్రలు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వ విజయాలను మరుగునపరచడానికి శాంతిభద్రతల సమస్య



సృష్టించాలని చూస్తున్నారు. నరుకుడు భాష వాడుతున్నారు. దానిని వైసీపీ నేతలు ఆదర్శంగా తీసుకుంటున్నారు. చిత్తూరు జిల్లా బంగారుపాళ్యంలో మామిడి రైతులను పరామర్శించడానికి వెళ్లినప్పుడు జగన్ నానా రభస చేశారు. మాజీ సీఎంను అన్న హుందాతనమే లేకుండా, నిబంధనలను అడ్డగోలుగా ఉల్లంఘించారు. పోలీసులకు ఇచ్చిన రూట్‌మ్యాప్‌కు భిన్నంగా బంగారుపాళ్యంలోకి వెళ్లేందుకు.. వాహనాన్ని అటు తిప్పి.. ఇటు తిప్పి.. నడిరోడ్డుపై డ్రామాలాడారు. నిబంధనలు గుర్తుచేస్తూ... ముందుకు వెళ్లకుండా అడ్డు నిలబడిన ఎస్పీపైకి వాహనాన్ని నడిపించేందుకూ వెనుదీయలేదు. మరి నాయకుడు అడ్డదారి పడితే, కార్యకర్తలు మెయిల్ రోడ్డులో వెళ్తారా? బంగారుపాళ్యం మార్కెట్ యార్డు వద్ద వైసీపీ శ్రేణులు రచ్చ రచ్చ చేశాయి. భద్రతా విధుల్లోని పోలీసులను కవ్విస్తూ వీరంగం సృష్టించాయి. జగన్ మార్కెట్ యార్డుకు రాకముందే యార్డులోకి వైసీపీ కార్యకర్తలు చొచ్చుకెళ్లి బీభత్సం సృష్టించాయి. అమ్ముకోడానికి ఓ రైతు రెండు ట్రాక్టర్లలో తెచ్చుకున్న మామిడికాయలను రోడ్డుపై పారబోసి తొక్కుకుంటూ పోయారు. జగన పర్యటనలో హెలిప్యాడ్ వద్ద 30 మంది, మార్కెట్‌యార్డులో 500 మందికి మాత్రమే పోలీసులు అనుమతి ఇచ్చారు. వైసీపీ శ్రేణులు వాటిని లెక్క చేయలేదు. హెలిప్యాడ్‌ను 500మంది చుట్టుముట్టారు. బయట మూడు వేలమంది మోహరించారు. అక్కడ దీంతో తోపులాట, తొక్కిసలాట చోటుచేసుకున్నాయి. జగన ముందుగా అనుకున్న రూట్ ప్రకారం కాకుండా బంగారుపాళ్యం పట్టణంలో నుంచి వెళ్లేందుకు ప్రయత్నించారు. హైవే మీద అనుకున్నంత జనాలు లేకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇందుకు చిత్తూరు ఎస్పీ మణికంఠ అభ్యంతరం తెలిపారు. ఇద్దరికీ కాసేపు వాదన జరిగింది. జగన కారుకు ఎదురుగా ఎస్పీ, మరో ఇద్దరు పోలీసు అధికారులతో అడ్డంగా నిలబడిపోయారు. ముందుగా ప్రకటించిన రూట్‌లోనే వెళ్లాలని కోరారు. కానీ జగన ఆగ్రహంతో ఎస్పీ మాట వినకుండా ఆయన మీదుగా పోనివ్వాలని తన కారు డ్రైవర్‌ను ఆదేశించినట్టు అక్కడున్నవారు చెప్పారు. దీంతో ఎస్పీ ఇంకొంతమంది పోలీసులను, వాహనాలను రోడ్డుకు అడ్డంగా పెట్టేశారు. ఇక చేసేదేమీలేక జగన కాన్వాయ్ హైవే రూట్ మీదుగానే మార్కెట్ యార్డుకు చేరుకోవాల్సి వచ్చింది. మరోవైపు.. ఎప్పుడూ రైతులతో నిండి ఉండే యార్డు వైసీపీ శ్రేణులతో నిండిపోయింది. ఇక్కడ కూడా వైసీపీ బ్యాచ నానా బీభత్సం సృష్టించింది. మద్యం తాగి రోడ్డుమీద తిరుగుతూ హంగామా సృష్టించారు. 'వచ్చేది మా ప్రభుత్వమే .... ఎదురుగా వచ్చేవారిని రప్పా.. రప్పా కోస్తాం' అంటూ రోడ్డుపై, మార్కెట్‌యార్డు గేటు వద్ద అరుస్తూ వీరంగం చేశారు. కొంతమంది వైసీపీ కార్యకర్తలు బైకులతో రయ్‌రయ్‌మంటూ వేగంగా జనం మధ్యలోకి దూసుకొచ్చి భయభ్రాంతులకు గురిచేశారు. 'వచ్చేది మా ప్రభుత్వమే... మీ అంతుచూస్తాం' అంటూ పోలీసులను నేరుగా బెదిరించారు. మార్కెట్ యార్డు ప్రధాన గేటును మూసేసినా లెక్క చేయలేదు. పోలీసులను, గేట్లను తోసేసి లోపలకు వెళ్లిపోయారు. దాదాపు ఐదు వేల మంది యార్డులోకి చొరబడి గందరగోళం సృష్టించారు. ఇంత కంగాళీ చేయాల్సిన అవసరం ఉందా? ఇప్పట్లో ఎన్నికలేమీ లేవు కదా..? ఒకటే కారణం.. ద్వితీయ శ్రేణి నేతల్లో పలువురు కూటమి పార్టీల్లోకి జంప్ అవుతున్నారు. కేడర్ జారిపోతున్నారు. ఎంపీలు ముందే నిష్క్రమించారు. ఎమ్మెల్సీలు టీడీపీ ద్వారం వద్ద వేచిచూస్తున్నారు. చంద్రబాబు గ్రీన్‌సిగ్నల్ ఇస్తే దూకేయడానికి సిద్ధంగా ఉన్నారు. మరోవైపు కేసులు కమ్ముకుంటున్నాయి. మద్యం స్కాంలో అరెస్టు చేస్తారన్న భయం వెంటాడుతోంది. అందుకే ఇలాంటి కార్యక్రమాలు తలపెడుతున్నారని కూటమి పార్టీలు మండిపడుతున్నాయి.

### పగలే చంపండని చెబుతా!

జగన్‌ను ఆదర్శంగా తీసుకున్న వైసీపీ మాజీ మంత్రి పేర్ని నాని.. ప్రత్యర్థులను వేసేద్దామంటూ కార్యకర్తలను రెచ్చగొడుతున్నారు. ఆ మధ్య ఆయన కృష్ణా జిల్లాల్లో కొన్ని చోట్ల కార్యకర్తల సమావేశాలు పెట్టారరు. 'నరకండి అని చెబితే చీకట్లో ఎందుకు చెయ్యమని చెబుతాను.. పగలే చెయ్యమని చెబుతా..' అంటూ పేట్రేగిపోయారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై తీవ్ర విమర్శలు చేశారు. అరేయ్.. ఒరేయ్ అంటూ అనుచితంగా మాట్లాడారు. 'నీకు 76 ఏళ్లు వచ్చాయి.. ఇంకెంతకాలం ఉంటావు చంద్రబాబూ! జగన్‌ను, వైసీపీని భూస్థాపితం చేస్తాడంట! ఏరా పీకే (పవన్ కల్యాణ్..) నిన్నే రా.. సిగ్గుపెట్టలేదా దేవుడు మీకు? మాట మీద నిలబడవా లోకేశ్! ఐదు నెలలు జైలులో వంశీ ఉన్నాడుగా.. జైలుకి వెళ్లి ఉచ్చ పోయించావా? ఎవడొస్తాడో రండిరా.. మూడు నెలల్లో ఆరోగ్యం బాగు చేసుకుని మా వాడు (కొడాలి నాని) వస్తున్నాడు. మిమ్మల్ని కట్‌డ్రాయర్ మీద నిలబెట్టి ఉరికిచ్చి కొడతాడు. అరేయ్.. నేను చంపేయండని అనలేదురా. అనాలనుకుంటే పట్టపగలే అంటాను. చంద్రబాబు రోజులు లెక్కపెట్టుకోమని చెప్పాడు కదా! జగన్ అంతు చూడడం నీ తరమా, నీ కొడుకు తరమా' అని నోటికొచ్చినట్లు మాట్లాడారు. దీనిపై పోలీసులు కేసులు పెట్టేసరికి అరెస్టు భయంతో అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఆయన తండ్రి పేర్ని కృష్ణమూర్తి ఎంత సౌమ్యుడు.. ఎంత మంచివారు.. బందరు మున్సిపల్ చైర్మన్‌గా ఉన్నప్పుడు చేసిన అభివృద్ధిని ప్రజలు ఇప్పటికీ చెప్పుకొంటుంటారు. అలాంటి నేత కడుపున నాని చెడపుట్టారని జనం ఛీత్కరిస్తున్నారు.



# అంతా ఆ తాను ముక్కలే!

ప్రభుత్వం మారినా అదే ఇసుక దందా
రాజధాని పేరు చెప్పి.. విజయవాడ మీదుగా అక్రమ రవాణా
కొత్త మార్గాల్లో తెలంగాణకు తరలింపు
లారీలకు ఖరీదైన కార్లతో ఎస్కార్ట్
యాప్ ద్వారా డ్రైవర్లకు రూట్ డైరెక్షన్స్
కృష్ణా జిల్లా నుంచి గుంటూరు, ఏలూరు,
తిరువూరు మీదుగా హైదరాబాద్‌కు రవాణా
సీమ, నెల్లూరు నుంచి బెంగళూరు, చెన్నైకి కూడా



నవ్యాంధ్రలో ఇసుక దందా కొనసాగుతోంది. ప్రభుత్వం మారినా స్మగ్లర్ బాబులదే రాజ్యం. వైసీపీ, టీడీపీ, జనసేన.. ఇలా పార్టీలతో సంబంధం లేదు. అంతా ఒక తాను ముక్కలమేనని రుజువు చూసుకుంటున్నారు. చంద్రబాబు అమల్లోకి తీసుకొచ్చిన ఉచిత ఇసుక విధానం పుణ్యమా అని విజయవాడ నగరం, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో ఇసుక అందరికీ అందుబాటులోకి వచ్చేసింది. కారుచౌకగా టన్ను రూ.200కే లభిస్తోంది. ఇది కొనుగోలుదారులకు వరంగా మారింది. ఇది నాణేనికి ఒకవైపు. ఇసుక సిండికేట్ మాఫియాకు మాత్రం ఈ ధర గిట్టుబాటు కావడం లేదు. దీంతో కాసుల దండుకునేందుకు రూటు మార్చారు. తెలంగాణకు తరలిస్తే దండిగా సంపాదించుకోవచ్చని విచ్చలవిడిగా వ్యవహరించడం మొదలుపెట్టారు. ఆంధ్ర నుంచి ప్రధానంగా ఉమ్మడి కృష్ణా జిల్లా నుంచి అక్రమంగా తరలించేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఎన్టీఆర్ జిల్లా నుంచి నందిగామ, జగ్గయ్యగపేట, తిరువూరు నుంచి అక్రమ రవాణా జరుగుతుండగా, కృష్ణా జిల్లాలో కంకిపాడు, రొయ్యూరు, తోట్లవల్లూరు, పెదపులిపాకల నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా ఇసుక తరలుతోంది. ఎన్టీఆర్ జిల్లా నుంచి ఎస్కార్ట్ వాహనాల ద్వారా అక్రమంగా ఇసుక తరలిస్తుంటే.. కృష్ణా జిల్లా నుంచి రాజధాని పేరు చెప్పి గుంటూరు మీదుగా హైదరాబాద్ తరలించేస్తున్నారు. ఈ ఇసుక దోపిడీ అడ్డుకునేందుకు తెలంగాణ రాష్ట్రంలో ట్రైనీ ఐపీఎస్‌లను నియమించి అక్కడి ప్రభుత్వం చెక్ పెట్టే ప్రయత్నాలు చేస్తోంది. ఇటీవల వరుసగా ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల నుంచి అక్రమంగా రవాణా అవుతున్న ఇసుక టిప్పర్లపై దాడులు చేసి వాటిని సీజ్ చేస్తున్నారు. అయినా అక్రమ రవాణా ఆగడం లేదు. ఇదంతా ఒక ఎత్తయితే.. చిన్న చిన్న బిల్డర్లు సైతం తమ స్థాయిలో దందా కొనసాగిస్తున్నారు. సొంత ఇల్లు కట్టుకునేవారు ఉచితంగా ట్రాక్టర్లు, ఎడ్ల బండ్లు తెచ్చుకుని ఇసుక తీసుకెళ్లవచ్చన్న నిబంధనను అనుకూలంగా వాడుకుంటున్నారు. ఇళ్ల మధ్య ఖాళీ స్థలాలుంటే ట్రాక్టర్లు, బండ్లలో తెచ్చిన ఇసుకను అక్కడ నిల్వ చేస్తున్నారు. కొంత పెద్ద బిల్డర్లు ఓపెన్‌గానే పెద్ద పెద్ద ఇసుక కొండలు నిల్వ చేస్తున్నారు.

### తెలంగాణలో ఎక్కువ అక్రమ ఇసుక

తెలంగాణలో భవన నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. అక్కడ బాగా డిమాండ్ ఉండడంతో ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లోని అధికారిక రీచ్‌లు, అనధికారిక రీచ్‌ల నుంచి పెద్దఎత్తున అక్రమంగా ఇసుక మాఫియా అక్రమంగా ఇసుకను రవాణా చేస్తోంది. ఆ రాష్ట్రానికి వెళ్తున్న ఇసుకలో సింహభాగం అక్రమంగానే తరలిస్తున్నదే. ఎఅక్కడ పోలీసులు పట్టుకుంటున్న ఘటనలను పరిశీలిస్తే ఇప్పటి వరకు పట్టుబడిన ఏ వాహనాలకు వే బిల్లులు లేవు. క ృష్ణానది, మున్నేరు, కట్టలేరు నుంచి ఇసుక అనధికారికంగా తరలిపోతోంది. ఈ ప్రాంతాల్లో ఇసుక సిండికేట్ మాఫియా అనుసరించే విధానం చూస్తే ముక్కున వేలేసుకుంటారు. ఎన్టీఆర్ జిల్లా నుంచి వెళ్లే ఇసుక లారీలకు ముందుగా ఎస్కార్ట్ వాహనాలు వెళ్తున్నాయి. ఒక్కో లారీకి ఖరీదైన కారును ఎస్కార్ట్‌గా నడుపుతున్నారంటే వ్యాపారం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. వాటిలో ఉండే సిబ్బంది ఫోన్లు, వెనుక వచ్చే లారీ డ్రైవర్ ఫోన్ నిరంతరం ఆన్‌లోనే ఉంటాయి. ఎస్కార్టు ఇచ్చే డైరెక్షన్ ప్రకారం లారీలు కదులుతాయి. టిప్పర్‌లో 45 నుంచి 50 టన్నులకు తక్కువ కాకుండా ఓవర్‌లోడ్‌తో తెలంగాణకు అక్రమంగా తరలిస్తున్నారు. ఆ రాష్ట్రానికి రవాణా చేయడం వల్ల భారీగా గిట్టుబాటు అవుతోంది. హైదరాబాద్‌కు అయితే టన్నుకు రూ.1,700, ఖమ్మం అయితే రూ.1400–1500 వరకు ధర వస్తోంది. తెలంగాణకు ఒక లారీ/టిప్పర్ రెండ్రోజులకు ఐదు ట్రిప్పులు వేస్తోంది. ఇలా వందల సంఖ్యలో లారీలు హైదరాబాద్‌కు వెళ్తున్నాయి.

### అధునాతన అక్రమం!

ఎన్టీఆర్ జిల్లా నుంచి తెలంగాణకు ఇసుకను అక్రమంగా తరలిస్తున్న నిర్వాహకులు.. మై వీల్స్ మొబైల్ యాప్ వాడుతున్నారు. ఇది సాధారణ జీపీఎస్ నేవిగేషన్ కంటే కూడా అదనపు ఫీచర్లతో ఉంటుంది. ఈ యాప్ ద్వారా డ్రైవర్‌కు ఒక రూట్ సెట్ చేస్తారు. ఆ రూట్‌లో లారీ చక్రం ఆగినా యజమానికి అలెర్ట్ వస్తుంది. ఎస్కార్ట్ ద్వారా పోలీసులు ముందున్నారని తెలిస్తే వెంటనే ఈ యాప్ ద్వారా డ్రైవర్‌కు మరో జీపీఎస్ రూట్ సెట్ చేస్తారు. డ్రైవర్ కంగారుపడకుండా దారి మళ్లిస్తాడు. ఈ యాప్ ద్వారా వాహనాల్లో డీజిల్ లెవల్ కూడా తెలుసుకుంటారు. తగ్గుతుంటే వెంటనే మరో వాహనంలో డీజిల్‌ను పంపిస్తారు. వాహనం ఆగిన సమయాన్ని బట్టి మిగిలిన లారీలన్నింటినీ డైవర్ట్ చేస్తారు.

### అమరావతి పేరుతో..

కృష్ణా జిల్లాలో కృష్ణానదీ తీరం వెంబడి ఉన్న కంకిపాడు, తోట్లవల్లూరు, రొయ్యూరు, మద్దూరు, పెదపులిపాక ప్రాంతాల నుంచి అధికారిక, అనధికారిక రీచ్‌ల ద్వారా కూడా తెలగాణకు ఇసుక అక్రమంగా తరలిపోతోంది. ఈ ప్రాంతాల నుంచి కృష్ణా కరకట్ట రోడ్డు మీదుగా వాహనాలను గుంటూరు తరలిస్తున్నారు. వాహనాలను అడ్డుకోకుండా ఉండటానికి రాజధాని పనులకు తీసుకెళ్తున్నామని చెబుతున్నారు. వాస్తవానికి కృష్ణానది పక్కన ఉన్న రాజధానికి అక్కడి నుంచే ఇసుక వస్తుంది. కృష్ణా జిల్లా నుంచి అంత దూరం తీసుకెళ్లాల్సిన పనిలేదు. కానీ రాజధానిలోని కాంట్రాక్టు సంస్థల లోగోలను లారీల మీద అంటించి మరీ వాటిని గుంటూరు తరలించి అక్కడి నుంచి హైదరాబాద్ పంపుతున్నారు. కొందరు టీడీపీ, వైసీపీ నేతలైతే.. సీఎం చంద్రబాబు ఇంటినిర్మాణానికి తీసుకెళ్తున్నామని చెప్పుకొంటున్నారు. ఒకవేళ ఎవరైనా అడ్డుకున్నా సీఎం పేరు చెబితే మాట్లాడలేరు కదా! దొంగ రూట్లలో, డొంక రోడ్లలో టిప్పర్లను పంపుతున్నారు.

### రాయలసీమ నుంచి బెంగళూరుకు..

రాయలసీమలో వివిధ నదులు, చెరువుల్లో తవ్వి తీసిన ఇసుకను స్థానిక అవసరాలకు కాకుండా బెంగళూరుకు పెద్దఎత్తున తరలిస్తున్నారు. మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచర వర్గానిదే ఈ విషయంలో పైచేయి. నెల్లూరు నుంచి చెన్నైకి, కర్నూలు నుంచి హైదరాబాద్, బెంగళూరుకు పెద్దఎత్తున ఇసుక తరలిపోతోంది. నిఘా పెద్దగా లేకపోవడం.. ఒకట్రెండు టిప్పర్లు పట్టుకున్నా పై నుంచి వచ్చే ఫోన్లతో వదిలేయడం.. ప్రస్తుతం ఇదేజరుగుతోంది. గోదావరి నది, రీచ్‌ల నుంచి విశాఖకు.. అక్కడి నుంచి ఒడిసాకు తరలిస్తున్న స్మగ్లర్లు కూడా ఉన్నారు. ఉచిత ఇసుక విధానం సామాన్యులకు, కార్మికులకు మంచిదే అయినా.. అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతున్న కారణంగా దాని అసలు లక్ష్యం నీరుకారిపోతోంది. జగన్ ఐదేళ్ల పాలనలో లారీ రూ.12 వేల వరకు పలికేది. ఇప్పుడు చాలామటుకు ఉచితంగా అందుతోంది. రవాణా చార్జీలు మాత్రమే జనం పెట్టుకోవాలి. ఇళ్లు కట్టనివారి పేరుతో ఆన్‌లైన్లో రిజిస్టర్ చేసి ఇసుకను నిల్వ చేస్తున్నవారూ ఉన్నారు.





# స్పీడు పెంచాలి బాసూ..

**ప్రపంచవ్యాప్తంగా సినీ పరిశ్రమ ప్రస్తుతం ఒక రకమైన సంక్షోభ పరిస్థితిని ఎదుర్కొంటోంది. కరోనా సమయంలో ఎదురైందే అతి పెద్ద సంక్షోభం అనుకున్నారు కానీ.. తర్వాతి కాలంలో దాని ప్రభావం మరింత తీవ్రంగా ఉంటోందన్నది వాస్తవం. కరోనా కాలంలో మొదలైన ఓటీటీ విప్లవం.. వెండితెరలను మామూలు దెబ్బ కొట్టలేదు. థియేటర్లకు వచ్చే జనం సంఖ్య నానాటికీ తగ్గిపోతోంది. స్టార్లున్న సినిమాలు కూడా పట్టుమని పది రోజులు థియేటర్లలో నిలవట్లేదు. స్టార్లు లేని సినిమాలను అసలు జనం థియేటర్లకు వచ్చే చూడడం లేదు. దీంతో నిర్మాతలు పెట్టిన పెట్టుబడిని వెనక్కి తెచ్చుకోలేక నానా అవస్థలు పడుతున్నారు. థియేటర్ల మనుగడే ప్రశ్నార్థకమవుతున్న పరిస్థితుల్లో భవిష్యత్ పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ పరిస్థితుల్లో థియేటర్లకు ప్రేక్షకులను రప్పించే కథలను ఎంచుకుని, బడ్జెట్లు తగ్గించుకుని, పక్కా ప్రణాళికతో సినిమాలు తీయడం ఒకెత్తయితే.. స్టార్ హీరోలు వేగం పెంచి చకచకా సినిమాలు చేయడం మరో ఎత్తుగా కనిపిస్తోంది.**











తెలుగు సినిమా ఇండియాలోనే నంబర్ వన్ అయిపోయిందని జబ్బలు చరుచుకోవడం బాగానే ఉంది కానీ.. మన దగ్గర సక్సెస్ రేట్ చూస్తే దారుణంగా ఉంటోంది. ఎప్పుడో ఒక సినిమా పాన్ ఇండియా స్థాయిలో అదరగొట్టేస్తున్నా.. మిగతా చిత్రాల్లో విజయవంతం అవుతున్నవి చాలా తక్కువ. ఇప్పుడు థియేటర్లకు వచ్చి సినిమాలు చూడడంలో ప్రేక్షకులు చాలా సెలక్టివ్‌గా ఉంటున్నారు. స్టార్ హీరోల సినిమాలకు మాత్రం టికెట్లు తెగుతున్నాయి. బిగ్ స్క్రీన్లలో చూడదగ్గ ఈవెంట్ ఫిలిమ్స్ అంటేనే జనం వెండి తెరల వైపు కదులుతున్నారు. కానీ స్టార్ హీరోల నుంచి ఎప్పుడో కానీ సినిమా రావడం లేదు. ఏడాదికి ఒక సినిమా అందించే స్టార్ హీరోలు అరుదైపోయారు. ఒక్కో సినిమాకు రెండు మూడేళ్లు సమయం తీసుకుంటుండడం ఆందోళన రేకెత్తిస్తోంది.

ఒకప్పుడు ఎన్టీఆర్, ఏఎన్నార్ లాంటి అగ్ర కథానాయకుడు రెండు మూడు నెలల్లో ఒక సినిమా అవగొట్టేసి ఏడాదికి మూణ్నాలుగు రిలీజ్‌లు ఉండేలా చూసుకునేవారు. కృష్ణ అయితే నెలకో సినిమా రిలీజ్ చేసిన సందర్భాలున్నాయి. కథ ఓకే అయిందా.. చకచకా షెడ్యూల్స్ వేసేవాళ్లు. శరవేగంగా సినిమాలు తీసేవాళ్లు. తర్వాతి తరంలో చిరంజీవి, బాలకృష్ణ, నాగార్జున, వెంకటేష్ సైతం వేగంగానే సినిమాలు చేశారు. ఏడాదికో సినిమా రిలీజ్ ఉండేలా చూసుకునేవారు. కానీ ఆ తర్వాతి రోజుల్లో పరిస్థితులు మారిపోయాయి. పెద్ద స్టార్లు రెండేళ్లకు కానీ ఒక సినిమా చేయట్లేదు. కొన్నిసార్లు గ్యాప్ ఇంకా మించి పోతోంది. దీంతో పెద్ద హీరోల సినిమాల ఫ్రీక్వెన్సీ తగ్గిపోయి థియేటర్లు నిండడం చాలా కష్టమవుతోంది. దీంతో ఇండస్ట్రీనే ఇప్పుడు సంక్షోభంలో పడే పరస్థితి కనిపిస్తోంది. అందుకే దిల్ రాజు సహా అగ్ర నిర్మాతలు పదే పదే పెద్ద హీరోలు వేగంగా సినిమాలు చేయాలని నొక్కి వక్కాణిస్తున్నారు.

## ప్రభాస్, పవన్ నయం

ప్రస్తుత టాప్ హీరోల్లో కొంచెం వేగంగా సినిమాలు చేస్తున్నది రెబల్ స్టార్ ప్రభాస్, పవర్ స్టార్ పవన్ కళ్యాణ్‌లే అని చెప్పాలి. నిజానికి మిగతా హీరోలతో పోలిస్తే నెమ్మదిగా సినిమాలు చేయాల్సిన పరిస్థితులు వీళ్లకే ఉన్నాయి. ప్రభాస్ పాన్ ఇండియా సూపర్ స్టార్‌గా ఎదిగిన నేపథ్యంలో అతను పరిమిత బడ్జెట్లో, చిన్న స్థాయి సినిమాలు చేసేందుకు అవకాశాలు తక్కువ. తన మార్కెట్, తన సినిమాలపై ఉండే అంచనాల దృష్ట్యా పెద్ద బడ్జెట్లలో, భారీ కథలతో దర్శకులు, నిర్మాతలు రెడీ అవుతున్నారు. చిన్న స్కేల్లో సినిమా చేసే పరిస్థితి ఎంతమాత్రం లేదు. అయినా సరే.. ప్రభాస్ మంచి స్పీడుతో సినిమాలు చేస్తున్నాడు. బాహుబలి రెండు భాగాలకు కలిపి ఐదేళ్లకు పైగా వెచ్చించాక 2019లో 'సాహో'తో మొదలుపెట్టి.. గత ఏడాది జులైలో 'కల్కి' వరకు ఐదు సినిమాలను ఐదేళ్ల వ్యవధిలో రిలీజ్ చేయగలిగాడు. తన రేంజికి ఈ ఫ్రీక్వెన్సీ గొప్ప అనే చెప్పాలి. ఈ ఏడాది డిసెంబరులో 'కల్కి'తో పలకరించనున్న ప్రభాస్.. ఆ తర్వాత ఫౌజీ, సలార్-2, కల్కి-2, స్పిరిట్ ఇలా చాలా సినిమాలను లైన్లో పెట్టుకున్నాడు. చూస్తుంటే ఇకపైనా ప్రభాస్ నుంచి ఏడాదికో సినిమా వచ్చేలా ఉంది. ఇక పవర్ స్టార్ విషయానికి వస్తే ఆయన రాజకీయాలతో తీరిక లేకుండా ఉన్నప్పటికీ.. రీఎంట్రీలో రెండేళ్ల వ్యవధిలో వకీల్ సాబ్, భీమ్లా నాయక్, బ్రో.. ఈ మూడు చిత్రాలతో పలకరించాడు. తర్వాత ఎన్నికల కోసం సినిమాలను పక్కన పెట్టడంతో గ్యాప్ వచ్చింది. ఇటీవల మళ్లీ ఖాళీ చేసుకుని హరిహర వీరమల్లు, ఓజీ చిత్రాలను పూర్తి చేశాడు. ఈ ఏడాది కొన్ని నెలల వ్యవధిలో ఈ రెండు చిత్రాలు రిలీజ్ కానున్నాయి. వచ్చే ఏడాది ఆయన్నుంచి 'ఉస్తాద్ భగత్ సింగ్' వస్తుంది. పవన్ స్థాయి హీరో నుంచి ఇంత తక్కువ టైంలో మూడు సినిమాలు రావడం గొప్ప విషయం.

## మిగతా స్టార్ల సంగతేంటి?

మహేష్ బాబు, జూనియర్ ఎన్టీఆర్, అల్లు అర్జున్, రామ్ చరణ్.. ఈ టాప్ స్టార్లందరూ నెమ్మదిగానే సినిమాలు చేస్తున్నారు. మహేష్ ప్రస్తుతం చేస్తున్నది రాజమౌళి సినిమా కాబట్టి అనివార్యంగా మూడేళ్లు దాని కోసం పెట్టాల్సిందే. ఆయన చివరగా 'గత ఏడాది సంక్రాంతికి 'గుంటూరు కారం'తో పలకరించాడు. మళ్లీ రాజమౌళి సినిమా వచ్చేసరికి ఇంకో రెండేళ్లకు పైగానే సమయం పట్టొచ్చు. రాజమౌళితో 'ఆర్ఆర్ఆర్' చేయడం వల్ల రామ్ చరణ్, ఎన్టీఆర్‌ల కెరీర్లలో చాలా గ్యాప్ వచ్చింది. 2018లో 'అరవింద సమేత' చేశాక గత ఆరేళ్ల వ్యవధిలో ఎన్టీఆర్ సినిమాలు రెండే వచ్చాయి. ప్రస్తుతం అతను వార్-2, డ్రాగన్ చిత్రాల్లో నటిస్తున్నాడు. ఇవి రెండూ ఏడాది వ్యవధిలో రాబోతున్నాయి. ఎన్టీఆర్ కూడా ఇకపై వేగంగానే సినిమాలు చేయాలని నిర్ణయించుకున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. 'పుష్ప' రెండు భాగాల కోసం ఐదేళ్ల సమయం పెట్టిన అల్లు అర్జున్.. కొత్త సినిమా మొదలుపెట్టడానికి కొంచెం సమయం తీసుకున్నాడు. అట్లీ దర్శకత్వంలో సినిమా త్వరలోనే సెట్స్ మీదికి వెళ్లబోతోంది. అతను సినిమాకు, సినిమాకు చాలా గ్యాప్ తీసుకుంటాడు. ఇకనుంచైనా స్పీడు పెంచాల్సిన అవసరముంది. రామ్ చరణ్ 'ఆర్ఆర్ఆర్' తర్వాత ఆచార్య, గేమ్ చేంజర్ సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. ఇవి రెండూ ఆలస్యం అయ్యాయి. ఇప్పుడు చేస్తున్న 'పెద్ది'ని మాత్రం వేగంగా పూర్తి చేయాలని చూస్తున్నాడు. ఆ తర్వాతి ప్రాజెక్టులకు ఇప్పట్నుంచే సన్నాహాలు జరుగుతున్నాయి. అందులో సుకుమార్ సినిమా ఒకటి. సీనియర్ హీరోల్లో బాలయ్య స్పీడే వేరు. ఆయన్నుంచి ఏటా ఒక సినిమా కచ్చితంగా వస్తోంది. గ్యాప్ లేకుండా సినిమాలు చేస్తూ పోతున్నారు బాలయ్య. చిరంజీవి, నాగార్జున, వెంకటేష్ ఆచితూచి అడుగులు వేస్తున్నారు. వాళ్లు కూడా స్పీడు పెంచాల్సి ఉంది. రవితేజ ఎప్పుడూ వేగంగానే సినిమాలు లాగిస్తుంటాడు. విజయ్ దేవరకొండకు ఈ మధ్య కెరీర్లో గ్యాప్ వచ్చింది. అతనూ స్పీడు పెంచాల్సిన అవసరముంది. వేగంగా సినిమాలు చేయడానికి తోడు.. పారితోషకాలు తగ్గించాల్సిన బాధ్యత కూడా హీరోల మీద ఉంది. తక్కువ రోజుల్లో సినిమాలు అయిపోయేలా పక్కా ప్రణాళికలు రచిస్తే.. హీరోల కాల్ షీట్స్ తగ్గుతాయి. దానికి తగ్గట్లే పారితోషకాలు తగ్గడానికి అవకాశముంటుంది. ఈ మేరకు దిద్దుబాటు చర్యలు చేపట్టకపోతే టాలీవుడ్ మనుగడే ప్రశ్నార్థకమయ్యేలా ఉంది.

# నటనలో ఎవ్వరూ అందుకోలేని ‘కోట’



**తరానికి ఒక్కరు అనిపించే నటులు.. కొన్ని తరాలను అలరించే ఆర్టిస్టులు అరుదుగా ఉంటారు. ఒక ఇమేజ్ ఛట్రంలో చిక్కుకోకుండా.. ఏ పాత్ర చేసినా అందులో ఒదిగిపోయి.. ఏ రసాన్నయినా అద్భుతంగా పండించగల సామర్థ్యం అందరికీ ఉండదు. అలాంటి అరుదైన నటుడే.. కోట శ్రీనివాసరావు. ఫలానా పాత్రలో కోట సరిగా చేయలేదు అనే భావన ఎప్పుడైనా కలిగిందా? ఫలానా ఎమోషన్ ఆయన సరిగా పండించలేడు అని వేలెత్తి చూపింగలమా? ఆయన నటన మొహం మొత్తినట్లుగా ఎప్పుడైనా అనిపించిదా? కోట ఎంత గొప్ప నటుడో చెప్పడానికి ఇంతకంటే రుజువేముంది?**











తెలుగు సినీ పరిశ్రమలో ఎందరో సూపర్ స్టార్లను చూశాం. ఒకరిని మించి ఒకరన్నట్లు స్టార్‌డమ్ తెచ్చుకున్న హీరోలున్నారు. వారి నటనా కౌశలం గురించి.. వాళ్ల కలెక్షన్ల రికార్డుల గురించి గొప్పగా మాట్లాడుకుంటాం. ఐతే క్యారెక్టర్, విలన్, కామెడీ వేషాలు వేసే నటుల గురించి ఎక్కువగా చర్చించుకోం. తెలుగు సినీ చరిత్ర ఆరంభం నుంచి పరిశీలిస్తే ఈ పాత్రలు చేసే వాళ్లలో అత్యంత గొప్ప నటుల జాబితా తీస్తే టాప్-5లో నిలిచే సత్తా ఉన్న నటుడు కోట శ్రీనివాసరావు. ఒక ఎస్వీ రంగారావు.. ఒక కైకాల సత్యనారాయణ.. ఒక రావుగోపాల్రావు.. ఈ వరుసలో తర్వాత చెప్పుకోదగ్గ గొప్ప నటుడు కోట. ఒక రకంగా చెప్పాలంటే ఆ ముగ్గురి కంటే కూడా నటనలో, పాత్రల్లో వైవిధ్యం చూపించిన ఘనత కోటకు దక్కుతుంది. ‘గణేష్’ చిత్రంలో భీతిగొల్పేలా నటించినా.. ‘అహనా పెళ్ళంట’లో కడుపు చెక్కలయ్యేలా నవ్వించినా.. ఆయనకే సాధ్యం. ‘హలో బ్రదర్’ సినిమాలో సినిమా అంతా నవ్వించి.. చివర్లో ఏడిపించడం కోటకే చెల్లింది. ‘ఊహ’ చిత్రంలో బాగా నవ్వించి.. చివర్లో విలనీతో భయపెట్టడమూ ఆయనకే సొంతం. ‘శత్రువు’ సినిమాలో ఓవైపు కామెడీ చేస్తూ.. ఇంకోవైపు విలనీతో విశ్వరూపం చూపించడమూ కోట ప్రత్యేకతను చాటి చెబుతుంది. ఇక ‘ఆడవాళ్ళ మాటలకు అర్థాలే వేరులే’ లాంటి సినిమాల్లో ఆయన తండ్రి పాత్రల్లో ఆర్ద్రతను ఎంత గొప్పగా చూపించాడో చెప్పేదేముంది? 750పైగా చిత్రాల్లో నటించిన కోట.. చేయని పాత్ర లేదు. పండించని ఎమోషన్ లేదు. ఒక నటుడిని చాలా ఏళ్ల పాటు చూస్తుంటే.. చేసిన పాత్రలే మళ్లీ చేస్తుంటే.. ఒక దశ తర్వాత బోర్ కొట్టడం సహజం. గొప్ప నటుడిగా పేరున్న ప్రకాష్ రాజ్ సహా చాలామంది ఇందుకు మినహాయింపు కాలేకపోయారు.

కానీ కోట మాత్రం 4 దశాబ్దాలకు పైగా సాగిన కెరీర్లో ఏ రోజూ ప్రేక్షకులకు మొహం మొత్తేలా చేయలేదు. ఏ పాత్రతోనూ బోర్ కొట్టించలేదు. ఈ క్యారెక్టర్‌కూ మిస్ ఫిట్ అనిపించలేదు. నటుడిగా ఆయన గొప్పదనానికి ఇదే రుజువు. పెద్దగా ప్రాధాన్యం లేని, తక్కువ నిడివి ఉన్న పాత్రలు చేసినా సరే.. కోట తన ప్రత్యేకతను చాటుకుంటారు. ‘అత్తారింటికి దారేది’ లాంటి సినిమాలే అందుకు ఉదాహరణ. ఇటు ఆంధ్రా.. అటు తెలంగాణ.. ఇంకోవైపు రాయలసీమ.. ఇలా ఏ స్లాంగ్‌నైనా అద్భుతంగా పలికి.. తాను అక్కడి వాడినే అనిపించేలా డైలాగులు చెప్పడం కోటకే చెల్లు. తెలంగాణ వాడు కాకపోయినా.. ఇక్కడి వాళ్లకు ఏమాత్రం తీసిపోని రీతిలో ఆ యాసలో డైలాగులు చెప్పి మెప్పించిన ఘనత కోటకే సొంతం.

**రచ్చ కూడా గెలిచారు**

కోట శ్రీనివాసరావు ఎంత గొప్ప నటుడో తెలుగు వాళ్లకు తెలియంది కాదు. వాళ్లకు కొత్తగా ఈ విషయం గుర్తు చేయాల్సిన పని లేదు. తెలుగు సినిమాల్లో ఆయన అద్భుత నటనకు తార్కాణంగా నిలిచే పాత్రలు కోకొల్లలు. ఐతే మన వాళ్ల ప్రతిభను మనం పొగుడుకుంటే గొప్పేముంది? ఇతర భాషల వాళ్లు కొనియాడితే అది చాలా స్పెషల్. అందులోనూ తామే గొప్ప అనుకునే తమిళులు.. మన నటుడి ప్రత్యేకతను గుర్తించి ప్రశంసలు కురిపిస్తే అది మనకూ గర్వకారణమే. కోట శ్రీనివాసరావు ఈ గౌరవాన్నే పొందారు. తమిళంలో ఆయన 20 సినిమాలకు పైగానే నటించారు. పరభాషా నటులకు పెద్దగా అవకాశాలు ఇవ్వని తమిళ ఫిలిం ఇండస్ట్రీలో ఇన్ని సినిమాలు చేయడం అంటే చిన్న విషయం కాదు. కోట ప్రతిభకు తమిళ ఫిలిం మేకర్స్, ప్రేక్షకులు అంతగా ఫిదా అయ్యారు కాబట్టే ఆయనకు అక్కడ అన్ని అవకాశాలు దక్కాయి. ఆయన ప్రతిభను తమిళులకు పరిచయం చేసిన సినిమా.. సామి. తెలుగులోకి ‘లక్ష్మీ నరసింహ’ పేరుతో రీమేక్ అయిన చిత్రమే.. సామి. ఇక్కడ బాలయ్య హీరోగా నటిస్తే ప్రకాష్ రాజ్ విలన్ పాత్ర పోషించారు. ఒరిజినల్లో లీడ్ రోల్‌లో విక్రమ్ నటిస్తే.. విలన్ పాత్రను కోట చేశారు. తమిళంలో ‘నరసింహ’ పేరిట ఉన్న రికార్డులను బద్దలు కొట్టి ఇండస్ట్రీ హిట్ అయిన సినిమా.. సామి. ఈ సినిమా ఇంత పెద్ద హిట్ కావడంలో హీరోగా విక్రమ్ పెర్ఫామెన్స్ ఎంత కీలకమో.. కోట విలనీది కూడా అంతే ముఖ్య పాత్ర. పెరుమాళ్ పిచ్చాయ్ అనే విలక్షణ పాత్రలో కోట















అద్భుతంగా నటించాడు. తమిళంలో ఒక మూసలో సాగిపోతున్న విలన్ పాత్రలకు, నటనకు ఒక వైవిధ్యం తీసుకొచ్చారు కోట. ఆయన పెర్ఫామెన్సుకి ప్రేక్షకులు ఫిదా అయిపోయారు. ఈ సినిమా తర్వాత తమిళంలో ఆయనకు అవకాశాలు వరుస కట్టాయి. విజయ్‌తో 'తిరుపాచ్చి', విశాల్‌తో 'సెల్యూట్', జీవాతో 'కో' (తెలుగులో రంగం), కార్తితో 'శకుని', విక్రమ్‌తో మరోసారి 'తాండవం', 'సామి–2'.. ఇలా చాలా సినిమాలే చేశారాయన. హిందీలో కూడా కోట ప్రతిభను చాటారు. అమితాబ్ బచ్చన్‌తో 'సర్కార్' సహా పలు చిత్రాల్లో నటించారు. 'సర్కార్'లో కోట నటనకు అమితాబ్ సైతం అబ్బురపడ్డారు. వాట్ ఎన్ యాక్టర్ అంటూ కోటను ఆయన కొనియాడినట్లు స్వయంగా రామ్ గోపాల్ వర్మ వెల్లడించడం విశేషం.

ఆ పాత్రలు చాలా స్పెషల్

నాలుగు దశాబ్దాలకు పైగా కెరీర్.. 750కి పైగా సినిమాలు.. ఇంత సుదీర్ఘ కెరీర్లో కోట చేసిన పాత్రల్లో ఏది 'ది బెస్ట్' అంటే చెప్పడం చాలా చాలా కష్టం. ఇంకెవరూ ఇలా చేయలేరు అనిపించేలా కోట అత్యద్భుతంగా నటించిన పాత్రలు పదుల సంఖ్యలో ఉంటాయి. ఐతే కోట అన్ని రసాలూ పండించినా.. ఆయనకు ఎక్కువ పేరు తెచ్చినవి విలనీ, కామెడీ. ఈ రెండు రకాల పాత్రల్లో చరిత్రలో నిలిచిపోయినవి.. తర్వాతి తరాలకు రెఫరెన్సుల్లా ఉపయోగపడేవి రెండున్నాయి. అవే.. సాంబశివరావు, లక్ష్మీపతి. 'గణేష్' చిత్రంలో చేసిన హెల్త్ మినిస్టర్ సాంబశివరావుగా కోట నటన గురించి ఎంత చెప్పినా తక్కువే. కోట బేసిగ్గా ఆంధ్రా ప్రాంతానికి చెందిన వ్యక్తి. కానీ ఇందులో తెలంగాణ యాసతో సాగే పాత్రను పోషించిన విధానానికి ఇక్కడి వాళ్లు కూడా ఫిదా అయిపోయారు. ఆహార్యం, భాష, యాస,







స్క్రీన్ ప్రెజెన్స్, నటన.. ఇలా ప్రతి విషయంలోనూ నూటికి నూరు మార్కులు పడతాయి ఈ పాత్ర విషయంలో. ఒక కిరాతకుడైన రాజకీయ నాయకుడంటే ఇలాగే ఉంటాడు అనిపించేలా.. ఒళ్లు గగుర్పొడిచేలా ఆ పాత్రను ఆయన పోషించారు. వెంకీ ఇంటికి వచ్చి ముందు కాళ్ల బేరానికి వచ్చి, తర్వాత వార్నింగ్ ఇచ్చే సన్నివేశంలో కోట నటనకు ఎన్ని అవార్డులు ఇచ్చినా తక్కువే అవుతుంది. ఇక పతాక సన్నివేశాల్లో కోట నటన అయితే వేరే లెవెల్ అని చెప్పాలి. ఇక 'అహనా పెళ్ళంట'లో పరమ పిసినారి అయిన లక్ష్మీపతి పాత్రలో కోట పండించిన నవ్వులు.. తరతరాలుగా తెలుగు వారి కడుపు చెక్కలు చేస్తూనే ఉన్నాయి. ముఖ్యంగా ఎదురుగా కోడిని వేలాడదీసుకుని.. వట్టి అన్నం తింటూ చికెన్ తింటున్న భావన తెచ్చుకునే సన్నివేశం ఐకానిక్‌గా నిలిచిపోయింది. ఈ తరం టీనేజీ కుర్రాళ్లు సైతం దాన్ని ఒక మీమ్‌గా వాడుతున్నారంటే కోట ఆ సన్నివేశాన్ని అంత అద్భుతంగా అభినయించారన్నమాట. ఈ సినిమాలో మొత్తంగా కోట నటన అద్భుతం. కోట కెరీర్లో ఎన్నో అద్భుతమైన పాత్రలున్నా సరే.. ఈ రెండు క్యారెక్టర్లు పతాక స్థాయిలో నిలుస్తాయి.

తన నటనతో కొన్ని తరాలను అలరించి.. మరపురాని జ్ఞాపకాలను అందించి.. తెలుగువారి మనసుల్లో చెరగని ముద్ర వేసిన కోట శ్రీనివాసరావుకు 'నమస్తే ఆంధ్ర' నివాళి అర్పిస్తోంది.






# తారక్ వెర్సస్ నాగ్.. జెండా ఎగరేసేదెవరు?

**ఈసారి ఇండిపెండెన్స్ డే వీకెండ్లో బాక్సాఫీస్‌ను షేక్ చేసేలా ఉంది. పాన్ ఇండియా స్థాయిలో రిలీజవుతున్న రెండు సినిమాల మధ్య రసవత్తర సమరం చూడబోతున్నాం. అవి బేసిగ్గా తెలుగు సినిమాలు కావు కానీ.. తెలుగు స్టార్లు వాటిలో ప్రధాన పాత్రలు పోషించారు. ఆ ఇద్దరూ జూనియర్ ఎన్టీఆర్, అక్కినేని నాగార్జున కాగా.. వారు నటించిన పర భాషా చిత్రాలు.. వార్-2, కూలీ. పర భాషల్లో వీరి మార్కెట్‌కు ఈ సినిమాలు ఎంతో కీలకం కానుండగా.. తెలుగు రాష్ట్రాల్లో వీరి పేరు మీదే ఈ చిత్రాలు సేల్ అవుతున్నాయి. ఇక్కడ కూడా అవి ఘనవిజయం సాధిస్తాయనే అంచనాలున్నాయి. మరి అంతిమంగా ఈ సినిమాల్లో పైచేయి సాధించే చిత్రమేదో?**

'బాహుబలి'తో ప్రభాస్ పాన్ ఇండియా స్థాయిలో తిరుగులేని స్టార్ ఇమేజ్ సంపాదించగా.. తనలా వెలిగిపోవాలని మిగతా స్టార్లకూ ఆశపుట్టింది. ఐతే 'పుష్ప'తో అల్లు అర్జున్ మాత్రమే ప్రభాస్ తర్వాత అంత ఫాలోయింగ్ సంపాదించాడు. రాజమౌళితో 'ఆర్ఆర్ఆర్' చేసిన రామ్ చరణ్, జూనియర్ ఎన్టీఆర్ ఇద్దరూ మంచి గుర్తింపే సంపాదించారు కానీ.. ఆ గుర్తింపు మార్కెట్‌కు ఏమేర తోడ్పడుతుందన్నది ఇప్పుడే చెప్పలేని పరిస్థితి. రామ్ చరణ్ 'గేమ్ చేంజర్'కు నెగెటివ్ టాక్ రావడంతో పాన్ ఇండియా ప్రేక్షకులను రీచ్ కాలేకపోయింది. ఐతే జూనియర్ ఎన్టీఆర్‌కు మాత్రం 'వార్-2' ఉత్తరాదిన పెద్ద బ్రేక్ ఇస్తుందన్న అంచనాలున్నాయి. అతను నేరుగా హిందీ సినిమా చేయడం ద్వారా ఉత్తరాది మార్కెట్‌ను టార్గెట్ చేశాడు. హృతిక్ రోషన్-టైగర్ ష్రాఫ్ కలిసి నటించిన 'వార్' పెద్ద హిట్ అవగా.. దాని సీక్వెల్లో టైగర్ పాత్రను తారక్‌తో రీప్లేస్ చేశారు. ఈ చిత్రానికి సెకండ్ హీరోనే కాదు.. దర్శకుడు కూడా మారాడు. సిద్దార్థ్ ఆనంద్ నుంచి అయాన్ ముఖర్జీ దర్శకత్వ బాధ్యతలు అందుకున్నాడు. సినిమాను నిర్మించింది మాత్రం యశ్ రాజ్ ఫిలిమ్స్. స్పై థ్రిల్లర్లు తీయడంలో ఆ సంస్థకున్న గుర్తింపే వేరు. ఐతే అన్నీ బాగున్నా.. 'వార్' టీజర్ మాత్రం అంత ఎగ్జైటింగ్‌గా అనిపించలేదు. కానీ సినిమా మాత్రం అంచనాలకు మించి ఉంటుందని బాలీవుడ్ వర్గాలు అంటున్నాయి. ఆ సంగతలా ఉంచితే.. హృతిక్ రోషన్ ముందు తారక్ దీటుగా నిలబడతాడా అన్నది ప్రశ్న. హృతిక్ ఫిజిక్, స్క్రీన్ ప్రెజెన్స్ గురించి కొత్తగా చెప్పాల్సిన పని లేదు. ఐతే లుక్స్ పరంగా హృతిక్ ముందు తగ్గినా.. పెర్ఫామెన్స్‌తో తారక్ పైచేయి సాధించగలడని అభిమానులు భావిస్తున్నారు. ఈ సినిమాతో తారక్ ఉత్తరాదిన ఎలా ఫాలోయింగ్ పెంచుకుంటాడన్నది కీలకం. మరోవైపు తెలుగు రాష్ట్రాల్లో సినిమా హిట్టవడం కూడా తన మీదే ఆధారపడి ఉంది. ఎన్టీఆర్‌కు సన్నిహితుడైన నాగవంశీ ఈ చిత్రాన్ని తెలుగు వరకు ఏకంగా రూ.80 కోట్లు పెట్టి కొన్నాడు. ఆ మేర రికవరీ అంత తేలిక కాదు. ఇండిపెండెన్స్ డే వీకెండ్ కలిసొచ్చేదే అయినా 'కూలీ'తో పోటీ పడి గెలవడం తేలిక కాదు.




### నాగ్ రేంజ్ మార్చే సినిమా

అక్కినేని నాగార్జున స్టార్ పవర్ గత దశాబ్ద కాలంలో బాగా డౌన్ అయిపోయిన మాట వాస్తవం. 'సోగ్గాడే చిన్నినాయనా' తర్వాత ఆయనకు పెద్ద హిట్ లేకపోయింది. రామ్ గోపాల్ వర్మతో చేసిన 'ఆఫీసర్' నాగ్ మార్కెట్‌ను దారుణంగా దెబ్బ తీసింది. 'వైల్డ్ డాగ్' సినిమాకు పాజిటివ్ టాక్ వచ్చినా కూడా ఆశించిన వసూళ్లు రాని పరిస్థితి. చివరి చిత్రం 'నా సామి రంగ'తో ఓ మోస్తరు ఫలితాన్నందుకున్నాడాయన. కానీ తర్వాత ఆయన సోలో హీరోగా సినిమానే చేయలేదు. లీడ్ రోల్స్‌కు గ్యాప్ ఇచ్చి స్పెషల్ రోల్స్ చేయడం మొదలుపెట్టాడు నాగ్. ఈ క్రమంలో ధనుష్‌తో కలిసి నటించిన 'కుబేర' మంచి ఫలితాన్నందుకుంది. దీంతో ఇప్పటికే మంచి క్రేజ్ తెచ్చుకున్న 'కూలీ'కి ఇంకా హైప్ పెరిగింది. సూపర్ స్టార్ రజినీకాంత్ హీరోగా 'విక్రమ్' దర్శకుడు లోకేష్ కనకరాజ్ రూపొందించిన ఈ చిత్రంలో నాగ్ నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్ర చేయడం విశేషం. ఐతే ఎలాంటి పాత్ర అయితేనేం అందులో నాగ్ క్యారెక్టర్‌కు రావాల్సిన హైప్ వచ్చేసింది. తెలుగులో ఈ సినిమా హక్కులు రూ.50 కోట్లకు పైగా పలకడం విశేషం. రజినీకి ఒకప్పటితో పోలిస్తే తెలుగులో ఫాలోయింగ్ తగ్గింది. కానీ 'కూలీ'కి నాగ్ ఫ్యాక్టర్ తోడై అదిరిపోయే బిజినెస్ జరిగింది. ఆయన్ని నెగెటివ్ క్యారెక్టర్లో చూసేందుకు ప్రేక్షకులు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. ఒకప్పుడు గీతాంజలి, శివ, రక్షకుడు, అన్నమయ్య లాంటి చిత్రాలతో తమిళంలో మంచి మార్కెట్ తెచ్చుకున్న నాగ్.. తర్వాత ఫోకస్ చేయలేదు. ఇప్పుడు మళ్లీ తమిళంలోకి రీఎంట్రీ ఇస్తున్నాడు. ఈ చిత్రం పాన్ ఇండియా స్థాయిలోనూ పెద్ద ఎత్తున రిలీజవుతోంది. నాగ్‌కు హిందీలో కూడా మంచి ఫాలోయింగ్ ఉన్న సంగతి తెలిసిందే. అక్కడ కూడా సినిమాకు ఆయన ప్లస్ అవుతాడని టీం భావిస్తోంది. ఈ సినిమా అంచనాలకు తగ్గట్లు పెద్ద హిట్టయితే పాన్ ఇండియా స్థాయిలో నాగ్ మళ్లీ తన మార్కెట్‌ను విస్తరించడానికి అవకాశం లభిస్తుంది. త్వరలో వందో సినిమా చేయబోతుండగా.. 'కూలీ' ఆయనకు కీలకంగా మారింది. గతంలో తెలుగులో తారక్ సినిమా 'నాన్నకు ప్రేమతో' మీద నాగ్ మూవీ 'సోగ్గాడే చిన్నినాయనా' పైచేయి సాధించింది. మరి ఇప్పుడు పాన్ ఇండియా పోరులో వీరి చిత్రాల్లో ఏది పైచేయి సాధిస్తుందో?

# మనకు ముళ్ళు.. వాళ్లకు పూలు







**తమిళ సినిమాలంటే మన ప్రేక్షకులకు ఒకప్పుడు మహా మోజుండేది. అక్కడి నుంచి అనువాదం అయి వచ్చిన ఎన్నో సినిమాలను మన వాళ్లు నెత్తిన పెట్టుకున్నారు. రజినీకాంత్, కమల్ హాసన్, సూర్య, కార్తి, విజయ్, అజిత్, జీవా, ధనుష్.. ఇలా ఎంతోమంది తమిళ స్టార్లను మన వాళ్లు గొప్పగా ఆదరించారు. ఆదరిస్తూనే ఉన్నారు. అదే సమయంలో మన హీరోలు, నిర్మాతలకూ తమిళ దర్శకుల మీద భలే గురి. కానీ తెలుగులో సక్సెస్ అయిన తమిళ దర్శకులను వేళ్ల మీద లెక్కబెట్టవచ్చు. అయినా మన వాళ్ల తీరు మారడం లేదు. తమిళ దర్శకులను మళ్లీ మళ్లీ నమ్ముతూనే ఉన్నారు. వాళ్లు మన హీరోలకు షాక్‌ల మీద షాక్‌లు ఇస్తూనే ఉన్నారు. అదే సమయంలో తెలుగు దర్శకులు.. తమిళ హీరోలకు మంచి విజయాలు అందిస్తూ తమ సత్తాను చాటుతుండడం విశేషం.**

ఒకప్పుడు మన హీరోలు పర భాషా దర్శకులతో జట్టు కట్టడానికి చాలా ఉబలాటపడేవాళ్లు. ముఖ్యంగా తమిళ



దర్శకులంటే భలే క్రేజుండేది. ఒకప్పుడంటే భారతీరాజా, బాలచందర్ లాంటి లెజెండరీ డైరెక్టర్లు తెలుగులో గొప్ప గొప్ప సినిమాలు తీశారు.. ఆ తర్వాతి దర్శకుల్లో అందరూ దాదాపుగా తెలుగులో ఫెయిలైన వాళ్లే. ఇక్కడ ఆ దర్శకులు చేసిన సినిమాల సక్సెస్ రేట్ అంతంతమాత్రమే అయినా.. వాళ్ల వెంట పడడం మానేవారు కాదు మన హీరోలు. ఒకప్పటితో పోలిస్తే తమిళ దర్శకులు తెలుగులో చేస్తున్న సినిమాలు తగ్గినా సరే.. ఎప్పుడో ఒకసారి ఓ సినిమా వచ్చినా అది బోల్తా కొడుతూనే ఉంది. సూపర్ స్టార్ మహేష్ బాబు.. రమణ, గజిని, తుపాకి, కత్తి లాంటి చిత్రాలతో తమిళంలో అగ్ర దర్శకుడిగా పేరు తెచ్చుకున్న మురుగదాస్‌తో సినిమా చేయాలని ఎంతో ఆశపడ్డాడు. ఎన్నో ఏళ్ల నిరీక్షణ తర్వాత వీరి కలయికలో 'స్పైడర్' సినిమా వచ్చింది.

అదెంత పెద్ద డిజాస్టరో కొత్తగా చెప్పాల్సిన పని లేదు. దీని కంటే ముందు మురుగదాస్ తన ప్రైమ్ టైంలోనే మెగాస్టార్ చిరంజీవితో 'స్టాలిన్' తీశాడు. అది 'స్పైడర్'లా డిజాస్టర్ కాలేదు కానీ.. అనుకున్నంత సక్సెస్ కూడా కాలేదు. ఇక తమిళంలో రన్, సెండైకోళి (పందెంకోడి), పయ్యా (ఆవారా) లాంటి హిట్లు ఇచ్చిన లింగుస్వామి.. అక్కడ తన ప్రైమ్ అంతా అయిపోయాక తెలుగులో యంగ్ హీరో రామ్‌తో 'ది వారియర్' మూవీ తీశాడు. రామ్‌ను చాలామంది వారించినా వినకుండా ఈ సినిమా చేసి తల బొప్పి కట్టించుకున్నాడు. తన కెరీర్లోనే ఇది అతి పెద్ద డిజాస్టర్ అయింది. ఇక వెంకట్ ప్రభు దర్శకత్వంలో నాగచైతన్య చేసిన కస్టడీ గురించి చెప్పాల్సిన పని లేదు. ఈ సినిమాకు మినిమం ఓపెనింగ్స్ రాలేదు. చెన్నై 28 మొదలు సరోజ, గోవా, మన్కాతా లాంటి హిట్లు ఇచ్చిన వెంకట్ ప్రభు.. చైతూతో మాత్రం పేలవమైన సినిమా తీసి తన కెరీర్లో ఒక



డిజాస్టర్‌ను జమ చేశాడు. ఒకప్పుడు మెగాస్టార్‌తో 'స్నేహం కోసం' సినిమా తీసి హిట్టు కొట్టిన సీనియర్ దర్శకుడు కె.ఎస్.రవికుమార్.. చివరగా తెలుగులో 'రూలర్' మూవీ తీశాడు. నందమూరి బాలకృష్ణ నటించిన చిత్రం అట్టర్ ఫ్లాప్ అయింది. ఇక ఈ దర్శకులంతా ఒకెత్తయితే.. ఇండియన్ ఫిలిం హిస్టరీలోనే గొప్ప దర్శకుల్లో ఒకడిగా పేరు తెచ్చుకున్న శంకర్ కథ మరో ఎత్తు. ఆయనతో సినిమా చేయాలని మెగాస్టార్ చిరంజీవి సహా ఎంతోమంది టాలీవుడ్ స్టార్లు ఆశపడ్డారు. కానీ తాను టాప్ ఫాంలో ఉండగా తెలుగు హీరోల వైపు కన్నెత్తి చూడలేదు శంకర్. తాను ఫామ్ కోల్పోయారు మెగా పవర్ స్టార్ రామ్ చరణ్‌తో 'గేమ్ చేంజర్' తీశాడు. ఆ సినిమా ప్రేక్షకులను తీవ్రంగా నిరాశపరిచింది. మరీ డిజాస్టర్ టాక్ రాకపోయినప్పటికీ.. అంతిమంగా సినిమాకు అదే ఫలితం వచ్చింది.

### మన వాళ్లు సూపర్..


మన హీరోలకు తమిళ దర్శకులు ఇలా షాకుల మీద షాకులు ఇస్తుంటే.. మన దర్శకులు తమిళ, మలయాళ హీరోలకు వరుసగా బ్లాక్‌బస్టర్లు అందిస్తుండడం విశేషం. మలయాళ లెజెండరీ హీరో మమ్ముట్టి తనయుడైన దుల్కర్ సల్మాన్ ఇప్పుడు తెలుగు ప్రేక్షకులకు అత్యంత ఇష్టమైన హీరోల్లో ఒకడైపోయాడు. అతను కూడా టాలీవుడ్‌కు



రుణపడిపోయాడు. తన కెరీర్లో బెస్టెస్ట్ సినిమాలను టాలీవుడ్డే అందించడం విశేషం. తెలుగులో తన తొలి చిత్రం 'మహానటి' కల్ట్ స్టేటస్ తెచ్చుకుంది. దీన్ని నాగ్ అశ్విన్ రూపొందించాడు. ఆ తర్వాత హను రాఘవపూడి.. దుల్కర్ హీరోగా రూపొందించిన 'సీతారామం' మరో క్లాసిక్‌గా నిలిచిపోయింది. ఇక చివరగా అతడితో తెలుగు దర్శకుడు వెంకీ అట్లూరి తీసిన 'లక్కీ భాస్కర్' కూడా క్రిటికల్ అప్లాజ్ తెచ్చుకోవడంతో పాటు కమర్షియల్‌గా సక్సెస్ అయింది. వీటిలో ఏ సినిమాకు అదే సాటి. మలయాళంలో గొప్ప కంటెంట్ ఉన్న సినిమాలు వస్తుంటాయి కానీ.. అక్కడ దుల్కర్ చేసిన సినిమాలు కూడా వీటిని బీట్ చేయలేవంటే అతిశయోక్తి కాదు. ఇక తమిళ హీరో ధనుష్ తెలుగులో రెండు అద్భుతమైన చిత్రాల్లో నటించాడు. ఇప్పటికే వెంకీ అట్లూరితో 'సార్' సినిమా చేసి పెద్ద హిట్ అందుకున్నాడు. అది గొప్ప సినిమాగా పేరు తెచ్చుకుంది. లేటెస్ట్‌గా శేఖర్ కమ్ముల దర్శకత్వంలో అతను నటించిన 'కుబేర' కూడా ఘనవిజయాన్నందుకుంది. ధనుష్ ఇప్పటికే ఎన్నో అద్భుతమైన పాత్రలు చేశాడు. ఎన్నో అవార్డులూ అందుకున్నాడు. కానీ కుబేరలో చేసిన దేవా అనే బిచ్చగాడి పాత్రకు వాటన్నింటికీ మించి ప్రశంసలు దక్కాయి. తన కెరీర్ బెస్ట్ పెర్ఫామెన్స్ ఇదే అంటే అతిశయోక్తి కాదు. ఇక తెలుగులో దర్శకుడిగా అంత గొప్ప పేరేమీ లేకపోయినా వంశీ పైడిపల్లిని నమ్మి తమిళంలో 'వారిసు'




సినిమా చేశాడు టాప్ స్టార్ అయిన విజయ్. రొటీన్ సినిమా అంటూ విమర్శలు వచ్చినా.. అది కమర్షియల్‌గా సక్సెస్ అయింది. మరోవైపు క్రాక్, వీరసింహారెడ్డి హిట్ల తర్వాత గోపీచంద్ మలినేని.. హిందీలో 'జాట్' మూవీ చేశాడు. సన్నీ డియోల్ హీరోగా నటించిన ఈ చిత్రం పెద్ద హిట్టే అయింది. ఇలా వరుసగా తెలుగు దర్శకులకు పరభాషా కథానాయకులకు ఘనవిజయాలు అందిస్తుండడం విశేషమే. వరుస ఫ్లాపులతో సతమతం అవుతున్న సూర్య సైతం తెలుగు దర్శకుడితో జట్టు కడుతున్నాడు. ధనుష్, దుల్కర్‌లతో హిట్లు కొట్టిన వెంకీ అట్లూరి.. సూర్యను డైరెక్ట్ చేయబోతున్నాడు. ఈ సినిమా కూడా సక్సెస్ అయితే తెలుగు దర్శకుల మీద పర భాషా కథానాయకులకు మరింత గురి కుదురడం ఖాయం.


Sri Siddhi Vinayaka Cultural Center
SVCC Temple Fremont
40155 Blacow Rd, Fremont, CA 94538
(510) 403-4256
www.svcctemple.org/fremont
www.facebook.com/svc
Weekdays: 9 am - 12 pm and 5:30 pm - 8:30 pm
Weekends: 9 am - 8:30 pm
mailinglistfremont@svcctem





# బ్రెజిల్‌లో బెబ్బులి ఫ్యామిలీ





బ్రెజిల్‌కు చెందిన ఎరీ బోర్గస్ ఇంటికి వెళ్తే ఒళ్లు జల్లుమంటుంది. అక్కడి దృశ్యాలను చూసి గుండె దడదడలాడుతుంది. కాళ్లు వణికి, ఒళ్లంతా చెమట పడుతుంది. కారణం.. ఆ ఇంట్లో ఎటు చూసినా పులులే. ఓ పులి సోఫా మీద పడుకుని టీవీ చూస్తుంటుంది. మరో పులి బాల్కనీలో వాకింగ్ చేస్తుంటుంది. ఇంకో పులి వంటింట్లో ఎరీ భార్య వంట చేస్తుంటూ చూస్తూ నిలబడి ఉంటుంది. మరో పులి తన తోటి పులితో ఆటలాడుతూ కనిపిస్తుంది. వాటన్నిటినీ చూస్తే పై ప్రాణాలు పైనే పోతాయి. అది ఇల్లో 'జూ'నో అర్థం కాక కాసేపు కంగారు పుడుతుంది. కానీ అవన్నీ పెంపుడు జంతువులేనని.. ఒక్కసారైనా రౌద్రం చూపవని తెలిశాక మనసు నెమ్మది పడుతుంది. ఆ ఇంటి యజమాని ఎరీకి జంతువులంటే చాలా ప్రేమ. రకరకాల జంతువులను పెంచుకుంటూ ఉండేవాడు. అయితే ఓరోజు... మూత పడటానికి సిద్ధంగా ఉన్న ఓ సర్కస్ కంపెనీకి చెందిన రెండు పులులను ఇంటికి తెచ్చుకున్నాడు. ఆ తరువాత మరో రెండు, ఆ తర్వాత మరో మూడు... ఇలా మొత్తం ఏడు పులులను ఇంటిలో చేర్చాడు. తన ముగ్గురు కూతుళ్లతో సమానంగా వాటినీ పెంచడం మొదలుపెట్టాడు. అతడు చేసిన పనికి మొదట అతని భార్యాపిల్లలు హడలిపోయారు. అతని కూతుళ్లు నయరా, ఉయరా, డ్యూసనిరాలు భయంతో వణికిపోయారు. వాళ్లను పులులకు దగ్గర చేయడానికి చాలానే కష్టపడాల్సి వచ్చింది ఎరీకి. అయితే.. మొదట భయపడినా మెల్లగా పులులతో చెలిమి చేయడం మొదలుపెట్టారు ముగ్గురూ. ఇప్పుడు వారు విడదీయలేని నేస్తారు. వాటితో కలిసి ఈత కొడతారు. వాటి వీపుల మీద పడుకుని సేద తీరతారు. తమ చేత్తో వాటి నోటిలో మాంసం పెడతారు. వాటిని ఒడిలో పడుకోబెట్టుకుని ఒళ్లు నిమురుతారు.  పేరుకు పులులే అయినా ఇవన్నీ కుక్కపిల్లల్లా తిరుగుతుంటాయి ఇంటిలో. గాండ్రించడం గానీ, రౌద్రాన్ని ప్రదర్శించడం గానీ ఎప్పుడూ జరగదు. ఎరీ పిల్లలు ఎటు వెళ్లినా, వాళ్ల వెనకాలే తిరుగుతూ ఉంటాయవి. వాళ్లు కాలేజీకి వెళ్తుంటే, కూడా వెళ్లడానికి రెడీ అయిపోతుంటాయి. వాటిని బుజ్జగించి వెళ్లాల్సి వస్తుంది వాళ్లకి. నయరా అయితే వాటితో కలిసి ఈత కొడుతుంటుంది. ఎరీ వాటిని కార్లో ఎక్కించుకుని కాసేపు బయట తిప్పి తీసుకొస్తుంటాడు. మొదట్లో ఆ చుట్టుపక్కల వాళ్లు పులులను ఇంట్లో పెంచడాన్ని వ్యతిరేకించారు. కానీ వాటితో ఈ కుటుంబానికి ఏర్పడిన బంధాన్ని చూసిన తర్వాత వాళ్లు నెమ్మదించారు. పైగా ఈ పులుల వల్ల ఎవరికీ ఎప్పుడూ ఏ హానీ జరగకపోవడంతో అందరూ అలవాటు పడిపోయారు.







నమస్తే ఆంధ్ర.కామ్
VOICE OF TELUGU PEOPLE
NAMASTEANDHRA.COM
FOR THE STATE # OF THE STATE # BY THE STATE
JUL 2025

